


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 127

SUNDAY Special

ఆదివారం 28-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఉత్తర్వులు జారీచేసింది. రాజవంశీకుడైన వర్మ 1990లలో బీజేపీలో చేరారు.

- వివరాలు 18లో



మనూ.. చరిత్ర లిఖించేనా!

పారిస్ ఒలింపిక్స్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ మనూ భాకర్. నేడు మధ్యాహ్నం 3:30గం. నుంచి ఫైనల్.

- వివరాలు 15లో



డెమొక్రటిక్ అభ్యర్థిగా కమల

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా కమల హారిస్ పేరు ఖరారైంది. అధికారిక పత్రాలపై ఆమె సంతకాలు చేశారు.

- వివరాలు 6లో



నాటి ఈగే నేటి డేగ!

56 ఏళ్ల మరియ కోరినా మచాదో ఇప్పుడు వెనిజులా వేగుచుక్క. ఈ కొద్ది నెలల్లోనే వెనిజులాకొక ఆశాదీపంలా అవతరించారు.

- వివరాలు 14లో

సభలో 'కరెంటు' మంట

విద్యుత్ అంశంపై అధికార, విపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలు

- బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లోనే స్మార్ట్ మీటర్లు బిగిస్తామంటూ కేంద్రంతో ఒప్పందం చేసుకుందన్న సీఎం రేవంత్
- తెలంగాణ విద్యుత్ సంస్థలను కేంద్రానికి అప్పజెప్పింది
- ఎన్నికల్లో రైతులు దెబ్బ తీస్తారని తెలిసి దాచిపెట్టింది
- అది ఇప్పుడు రాష్ట్ర డిస్కంలకు గుదిబండగా మారింది
- మీటర్ల బిగింపు ఒప్పందంపై బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నాటి ఒప్పంద పత్రాలను సభ ముందుంచిన సీఎం
- సీఎంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల విమర్శలు సరికాదు: భట్టి



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: సభలో 'కరెంటు' అంశం మంటలు రేపింది. 'స్మార్ట్ మీటర్ల' ఏర్పాటు ఒప్పందం, వ్యవసాయానికి మీటర్లు పెట్టేందుకు సిద్ధమయ్యారనే అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలతో శాసనసభ దద్దరిల్లింది. శనివారం ఉదయం సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావుల మధ్య వివిధ అంశాలపై జరిగిన సవాళ్లు, ప్రతిసవాళ్లు, ఆ సమయంలో వారు చేసిన వ్యాఖ్యలు.. రాత్రి శాసనసభ ముగిసే సమయంలో 'కరెంటు' వివాదానికి తెరలేపాయి. విద్యుత్ సంస్కరణలు అమలు చేయనందుకు తమ హయాంలో రూ.30 వేల కోట్లు నిధులు కోల్పోయామని ఉదయం హరీశ్‌రావు చెప్పగా.. అసలు బీఆర్ఎస్ సర్కారు 2017లోనే మిగతా 2వ పేజీలో ▶

- సీఎం రేవంత్ ఎవరో తెచ్చిన ఏదో కాగితాన్ని పట్టుకుని మాట్లాడుతున్నారు: హరీశ్
- తొందరపడి మాట్లాడితే సీఎం కుర్చీ గౌరవం తగ్గుతుంది
- పాత మీటర్లను 'స్మార్ట్'గా మార్చడానికే మేం ఒప్పుకున్నాం .. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టడం కాదు..
- కేంద్రం పెట్టిన రూల్స్‌ను ఒప్పుకోబోమని కేసీఆర్ సభలోనే ప్రకటించారు
- రూ. 30 వేల కోట్ల రుణ సేకరణ అవకాశాలనూ వదులుకున్నాం
- విద్యుత్ సంస్థలు ప్రైవేటీకరణ కాకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడి

రేవంత్‌రెడ్డి వర్సెస్ హరీశ్‌రావు

- అప్పుల లెక్కలు సరే.. అమ్ముకున్న లెక్కలేవీ?
- ఆరు గ్యారంటీలను నమ్మితే.. ధోకా చేస్తారా?
- శాసనసభలో సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావు మాటల యుద్ధం

2లో

గల్లీకో బెల్ట్ షాప్ పెడతారా?


- బడ్జెట్‌పై శాసనసభలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- ఎక్సైజ్ ఆదాయం రూ.7 వేల కోట్లు ఎలా పెరుగుతుందని నిలదీత
- కావాలంటే మా పథకాల పేర్లు మార్చుకోండి.. కానీ ఆపొద్దని విజ్ఞప్తి

మేడిగడ్డ కుంగుబాటు.. కాంగ్రెస్ కుట్రే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణ
- సరిగ్గా ఎన్నికలకు ముందు నవంబర్‌లో కుంగిపోయింది
- భవిష్యత్తులో బరాజ్‌కు ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వ కుట్రగానే భావించాల్సి వస్తుందని వ్యాఖ్య

- వివరాలు 3లో



ఎల్లంపల్లి నుంచి వచ్చిన నీటిని నంది పంప్‌హౌస్ ద్వారా నంది మేడారం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్న దృశ్యం

పంపింగ్ ప్రారంభం

- ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు నీళ్లు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులో ఎత్తిపోతలు షురూ
- నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్‌మానేరుకు తరలింపు

సాక్షి, హైదరాబాద్/రామగుండం/ధర్మారం: అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన పంప్‌హౌస్‌ల ద్వారా నీటి పంపింగ్ ప్రక్రియను శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోని నీళ్లను నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిగతా 8వ పేజీలో ▶

గోదావరి మళ్లీ మహోగ్రరూపం

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు
- భద్రాచలం వద్ద 53.2 అడుగులకు చేరిన వరద మట్టం.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ - 8లో

కృష్ణా.. తుంగభద్ర పోటాపోటీ

- శ్రీశైలంలోకి గంటగంటకూ పెరుగుతున్న వరద.. నేడు మరింత పెరిగే చాన్స్
- ప్రాజెక్టులోకి 4.12 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. నాగార్జునసాగర్‌కు 52,599 క్యూసెక్కులు.. - 7లో

ఇదండీ సంగతి



..ఇక నుంచి మీ వెంట ఒక మైకు ఎప్పుడూ ఉంచుకోండి మేడం!

ఆషామాషీగా ఉండి వెళ్లడానికి రాలేదు

ఈ ఐదేళ్లే కాదు.. మరో ఐదేళ్లు, తర్వాతి పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపేది మేమే..

బడ్జెట్ పద్దుపై ఇచ్చిన సమాధానంలో డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్య

- మా బడ్జెట్ అంకెల గారడీ కాదు.. హామీలు, ప్రజల ఆశలు తీర్చేలా ప్రతిపాదనలు.. ఆర్థిక వనరులపై మాకు అవగాహన ఉంది.. ప్రత్యామ్నాయ ప్రణాళికలున్నాయి
- ప్రజలపై పన్నులు వేయబోం.. ఆరు గ్యారంటీల గురించి అనుక్షణం తపిస్తున్నామని వెల్లడి - 3లో



"బడ్జెట్‌లో అంకెల గారడీలు, భ్రమలేమీ లేవు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతి కోసం బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాం. మేం బీఆర్ఎస్ మాదిరిగా అడ్డగోలుగా పెడితే ఈ బడ్జెట్ 3.50 లక్షల కోట్లతో ఉండేది. కానీ అలా చేయకుండా రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదించాం.

'వికసిత భారత్' సాకారంలో రాష్ట్రాలదే కీలకపాత్ర

పేదరిక నిర్మూలనే మా ప్రాధాన్యం.. నీతి ఆయోగ్ భేటీలో మోదీ

- వివరాలు 6లో

మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారు: మమత

తనను ఘోరంగా అవమానించారంటూ నీతి ఆయోగ్ భేటీ నుంచి వాకౌట్

- వివరాలు 6లో



తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

ఏం చేయకముందే బీఆర్‌ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తాము ఏమీ చేయకముందే బీఆర్‌ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసలు వారు చేసిన అవినీతిపై చర్యలు తీసుకుంటే పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ఎద్దేవా చేశారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ అధికారం ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ నేతలు విచ్చలవిడిగా వ్యవహరించారని, ఇప్పుడు వారిని చూస్తే బాధనిపిస్తోందని అన్నారు. ముందుంది ముసుర్ల పండుగ అని వ్యాఖ్యానించారు. నీళ్లు వచ్చినప్పుడు ఎత్తిపోయడం మామూలుగా జరిగే ప్రక్రియ అని, దీనికి కూడా బీఆర్‌ఎస్ నేతలు చెప్పాలా అని రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.

పడగొడతం అంటే తొడగొడతం

అసెంబ్లీలో తన సీటు వద్ద తొడకొట్టిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తుందని, అయితే ఇటీవల కొందరు పడగొడతం అని వ్యాఖ్యానిస్తున్నారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'పడగొడతం అంటే తొడగొడతాం' అంటూ అసెంబ్లీలో తన సీటు వద్ద నిలబడే ఆయన తొడగొట్టారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ తరపున శాసనసభలో మాట్లాడారు. గత అసెంబ్లీలో పాండవుల తరహాలో ఐదుగురు సభ్యులు ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కౌరవులవంటి బీఆర్‌ఎస్‌ను మట్టి కరిపించి అధికారాన్ని చేపట్టారన్నారు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టడానికి అప్పులు తెచ్చే పరిస్థితి నెలకొన్న తరుణంలో తమను హామీలపై నిలదీయడానికి మరో ఏడాది ఓపిక పట్టాలని చెప్పారు. హైదరాబాద్ నగర సమగ్రాభివృద్ధి కూడా కాంగ్రెస్ పార్టీ దార్శనికత పుణ్యమేనని అన్నారు. మెట్రోరైల్ ప్రాజెక్టు, మూసీ రివర్‌ఫ్రంట్, రీజనల్ రింగ్‌రోడ్డు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేలా బీజేపీ సభ్యులు కూడా కృషి చేయాలని చెప్పారు.

'అభివృద్ధి'లో కాంగ్రెస్‌కు మద్దతిస్తాం

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ



కొడంగల్: తెలంగాణ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తామని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒవైసీ మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే ముస్లింలను వేధిస్తున్నారని, ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ వెలమల పార్టీ, టీడీపీ కమ్మల పార్టీ, కాంగ్రెస్ రెడ్ల ప్రాబల్యం ఉన్న పార్టీ అన్నారు. ముస్లింల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్నదే ఎంఐఎం పార్టీ అని స్పష్టం చేశారు. హిందువులు, ముస్లింల సహకారంతో తాము 40 ఏళ్లుగా హైదరాబాద్‌లో విజయం సాధిస్తున్నామని వివరించారు. అందరి సహకారంతో రాజధానిలో తిరుగులేని శక్తిగా ఎదిగామన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి X హరీశ్‌రావు

అప్పుల లెక్కలు సరే.. అమ్ముకున్న లెక్కలేవీ?

- ఆరు గ్యారంటీలను నమ్మితే.. ధోకా చేస్తారా?
- శాసనసభలో సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావు మాటల యుద్ధం
- ఆరు గ్యారంటీల అమలును గాలికి వదిలేశారన్న హరీశ్
- సోనియా, రాహుల్‌లతో హామీ ఇప్పించి.. వారి పరువు తీశారని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌పై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్‌రావు ఆరోపణలు.. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించడంతో.. ఈ ఇద్దరి మధ్య అసెంబ్లీలో మాటల యుద్ధం నడిచింది. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడిన హరీశ్‌రావు.. గతంలో తమ ప్రభుత్వం చేసిన అప్పులను ఎక్కువ చేసి చూపిస్తున్నారని, అది సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీల అమలు కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదేమని నిలదీశారు. ఇంతలో సీఎం రేవంత్ జోక్యం చేసుకున్నారు. ''హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారు. లక్షల కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును రూ.7 వేలకోట్లకే తెగనమ్మారు. గొర్రెల స్కీం పేరుతో రూ.700 కోట్లు దండుకున్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం ఖర్చు విషయంలో గతంలో ఒకటి చెప్పి ఇప్పుడు రూ.94 వేల కోట్లే అంటున్నారు. అప్పుల లెక్కలు చెబుతున్నారు.. కానీ అమ్ముకున్న లెక్కలు చెప్పడంలేదు. రాష్ట్ర ప్రభుత్వ భూములను కాపాడాల్సింది పోయి.. ఎన్ని వేలకోట్ల విలువైన భూములు అమ్ముకున్నారో లెక్కలు తీద్దాం. పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం చేశారు. మీరు నిజాయతీ పాలన అందించి ఉంటే.. బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్స్, గొర్రెల పంపిణీపై విచారణకు సిద్ధమా?'' అని సవాల్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుండుసున్నా ఇచ్చినా బుద్ధి తెచ్చుకోకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

అబద్ధపు గ్యారంటీలతో పరువు తీశారు

మాజీమంత్రి హరీశ్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు, రంగారెడ్డి జిల్లాల కరువు, వలసలకు రేవంత్‌రెడ్డి గతంలో ఉన్న టీడీపీ, ఇప్పుడున్న కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. ''బతుకమ్మ చీరల విషయంలో సీఎం మహిళలను అవమానపరిచారు. దీనిపై క్షమాపణ చెప్పాలి. ఆరు గ్యారంటీలపై రాహుల్ గాంధీతో హామీ ఇప్పించారు. సోనియా గాంధీతో కూడా లేఖ రాయించారు. కానీ అమలు చేయలేక.. సోనియా గౌరవం పోగొట్టారు. రాహుల్ పరువు తీశారు. పేగులు మెడలో వేసుకుంటా, లాగులో తొండలు విడుస్తానంటూ సీఎం రేవంత్‌రెడ్డి వాడిన రాక్షస భాషను చూసి జనం భయపడుతున్నారు. ముఖ్యమంత్రి కుర్చీ గౌరవం పోగొట్టవద్దని కోరుకుంటున్నాం'' అని హరీశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 500 హత్యలు, 1,800 అత్యాచారాలు జరిగాయని.. పోలీసులు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రతివారం సీఎం ప్రజలను కలుస్తారని చెప్పారని.. కానీ ప్రజాపాలనలో మొదటి రోజు తప్ప మళ్లీ అక్కడ కనిపించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీయే పెద్ద ధోకా అని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో సభలో బీఆర్‌ఎస్ సభ్యులంతా 'ధోకా.. ధోకా..' అంటూ నినాదాలు చేశారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం వ్యక్తంచేశారు.

సభలో 'కరెంటు మంట'

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రంతో మీటర్ల ఏర్పాటుకు ఒప్పందం చేసుకుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దీనికి ఆధారంగా నాటి ఒప్పంద పత్రాలను రాత్రి శాసనసభ ముందుంచారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

బీఆర్‌ఎస్ వాదన సత్యదూరం

విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే అంశంపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న వాదనలు పూర్తిగా సత్యదూరమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ''ప్రధాని మోదీ సమక్షంలో 2017 జనవరి 4న ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. 2017 జూన్ 30 నుంచి ఆరు నెలల్లోగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగిస్తామని, 2018 జూన్ 30లోగా ఫీడర్లకు మీటర్లు పెడతామని, 2018 డిసెంబర్ 31 లోగా 500 యూనిట్లు, ఆపై విద్యుత్ వాడే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు, 2019 డిసెంబర్ 31 లోపు 200 యూనిట్ల విద్యుత్, ఆపైన వాడే వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెడతామని ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందాలను అమలు చేయకపోతే, స్మార్ట్ మీటర్లను బిగించకపోతే.. కేంద్ర ప్రభుత్వం డిస్కంల మీద చర్యలు తీసుకునే అవకాశముంది. ఇప్పుడు వాటి మెడపై కత్తి వేలాడుతోంది. ఇది గత ప్రభుత్వం చేసిన దుర్మార్గం. వాళ్లు, వీళ్లు ప్రేమించుకున్నప్పుడు, సంతకాలు పెట్టుకున్నప్పుడు తెలంగాణ ప్రయోజనాలు కనిపించలేదు. ఎన్నికలు వచ్చేప్పటికి రైతులు ఉరి వేస్తారని తెలిసి దాన్ని దాచిపెట్టారు. ఈ ఒప్పందంతో తెలంగాణ విద్యుత్ సంస్థలను కేంద్ర ప్రభుత్వానికి అప్పజెప్పారు. డిస్కంలకు విధిలేని పరిస్థితిని తెచ్చిపెట్టారు..'' అని రేవంత్ మండిపడ్డారు.

బీఆర్‌ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలి..

ఉదయ్ ఒప్పందంపై సంతకాలు పెట్టలేదని, మీటర్లు పెట్టబోమని చెప్పామని బీఆర్‌ఎస్ నేతలు చెప్తున్న మాటలన్నీ అబద్ధాలేనని సీఎం రేవంత్ ఆరోపించారు. ''ఈ ఒప్పందంపై అప్పటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఐఏఎస్ అజయ్ మిశ్రా, సదరన్ డిస్కం సీఎండీ రఘుమారెడ్డి, నార్తర్న్ సీఎండీ ఏ.గోపాల్‌రావు సంతకం పెట్టారు. ఇప్పుడు విధిలేక మన వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకు బీఆర్‌ఎస్ నేతలు ఇప్పటికైనా క్షమాపణలు చెప్పాలి'' అని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మేడిగడ్డ సందర్శనపైనా సీఎం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''మేడిగడ్డకు వెళ్లి సెల్ఫీలు దిగారు. సెల్ఫ్ డబ్బా కొట్టుకున్నారు. పదవి పోయినందుకు మీకు తొందర ఉండాలిగానీ.. నాకేమీ తొందరలేదు'' అని పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌కు తొందరెక్కువ: హరీశ్‌రావు

సీఎం రేవంత్‌రెడ్డికి తొందరపాటు ఎక్కువని, సభను తప్పుదోవ పట్టిస్తూ మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎవరో ఏదో కాగితం తెచ్చిస్తే తొందరపడి మాట్లాడటం వల్ల సీఎం కుర్చీ గౌరవాన్ని తగ్గిస్తుందని.. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని మాట్లాడితే హుందాతనం పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ''నేను ఉదయం మాట్లాడేప్పుడు ఉదయ్ పథకం కింద కేంద్రం బలవంతంగా రూ.9 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర సర్కారుపై రుద్దిందని చెప్పాను. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఓ కాగితం తెచ్చి మీరు సంతకాలు పెట్టారు, మీటర్లు పెడుతున్నారంటూ సుదీర్ఘంగా చెప్పారు. అసలు మేం చెప్పిందేంటి? కేంద్రం రూ.30 వేల కోట్లు అప్పు అదనంగా ఇస్తామన్నా.. వ్యవసాయ బోరుబావుల వద్ద మీటర్లు పెట్టబోం, విద్యుత్ సంస్కరణలను ఒప్పుకోమనే చెప్పాం. నాటి సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీలోనే ఈ విషయం స్పష్టం చేశారనే నేను ఉదయం వివరించాను. కానీ సీఎం రేవంత్ ఏదో అనుకుని 'ఉదయ్' కాగితాన్ని తెచ్చి చూపించారు. 2017 జనవరి 4న అందిన ఆ పేపర్‌లో వ్యవసాయ బోరు బావులకు కాకుండా.. అన్నివర్గాల కరెంట్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించాలని స్పష్టంగా ఉంది. అంటే పాత మీటర్లు ఉన్న చోట కొత్తగా స్మార్ట్ మీటర్లు పెట్టడమే తప్ప.. కొత్తగా మీటర్లు పెట్టే ముచ్చటే అందులో లేదు..'' అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

నేను చెప్పిన 'రూల్స్' పేపర్ వేరు

ఇక తాను చెప్పిన కాగితం కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్ నుంచి 2021 జూన్ 9న వచ్చిందని హరీశ్‌రావు వివరించారు. ''దాని ప్రకారం.. ఏ రాష్ట్రాలు ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పు తీసుకోవాలని అనుకుంటున్నాయో ప్రతిపాదనలు పంపాలని కోరారు. 2022 నుంచి 2025 వరకు విద్యుత్ సంస్కరణలు అమలుచేస్తే.. అరశాతం అదనంగా 4 శాతం జీఎస్‌డీపీ వరకు అప్పు అధికంగా పొందే వెసులుబాటు ఇస్తామని కేంద్రం పేర్కొంది. దానికి ఒప్పుకుంటే తెలంగాణకు రూ.30 వేల కోట్లు సమకూరేవి. అయితే సంస్కరణల్లో భాగంగా డిస్కంల ప్రైవేటీకరణ, వ్యవసాయ బోర్లు, బావులకు మీటర్లు పెట్టడం వంటివి రైతులకు ఇబ్బంది తెస్తాయని గుర్తించి.. ఆ నిబంధనలకు మేం ఒప్పుకోలేదు'' అని స్పష్టం చేశారు. కానీ సీఎం సభను, ప్రజలను తప్పుదారి పట్టించే యత్నం చేశారని హరీశ్ ఆరోపించారు. ఈ సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కల్పించుకుని హరీశ్‌రావు వ్యాఖ్యలను ఖండించారు. ''ఏదో ఓ కాగితాన్ని చూపుతూ సభను, ప్రజలను సీఎం తప్పుదారి పట్టిస్తున్నారంటూ హరీశ్ మాట్లాడటం సరికాదు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడతామని సీఎం ఎక్కడైనా చెప్పారా? మీరు తలకిందులుగా తపస్సు చేసినా మేం రైతులకు మీటర్లు పెట్టబోం..'' అని పేర్కొన్నారు.

గల్లీకో బెల్ట్ షాప్ పెడతారా?

బడ్జెట్‌పై శాసనసభలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

- ఎక్సైజ్ ఆదాయం రూ. 7 వేల కోట్లు ఎలా పెరుగుతుందని నిలదీత

సాక్షి, హైదరాబాద్: మద్యం అమ్మకాలపై, బెల్ట్ షాపులపై రాద్ధాంతం చేసిన కాంగ్రెస్ నాయకులే ఇప్పుడు అదే మద్యంతో అధిక రాబడి కోసం ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీలో శనివారం బడ్జెట్‌పై చర్చను ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. మద్యం అమ్మకాల ద్వారా రూ. 7 వేల కోట్లకుపైగా అధికంగా రాబడిని బడ్జెట్‌లో చూపారని నిలదీశారు. 'బీర్లపై డ్యూటీని రూ. 2,760 కోట్ల నుంచి రూ. 3,500 కోట్లకు పెంచారు. సుంకాన్ని రూ. 11,031 కోట్ల నుంచి 15,500 కోట్లకు పెంచి బీర్లు, లిక్కర్ ధరలు భారీగా పెంచబోతున్నట్లు స్పష్టం చేశారు. గతేడాది కంటే మద్యం అమ్మకాల కింద వ్యాట్ రూపంలో రూ.2 వేల కోట్లు వస్తుందంటున్నారు. ఊరికో బెల్ట్ షాప్ ఉందని గతంలో భట్టి అన్నారు. మీరు ప్రతిపాదించిన దాన్నిబట్టి గల్లీకో బెల్ట్ షాప్ పెడతారా? మద్యాన్ని నియంత్రించి బెల్ట్ షాపులు ఎత్తేస్తామని చెప్పి ఇప్పుడు రూ. 7 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయాన్ని ఎలా పెంచుకుంటారో చెప్పండి?' అని హరీశ్ ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ హయాంలో అప్పు రూ. 3,85,340 కోట్లే

బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అప్పు రూ. 3,85,340 కోట్లు మాత్రమేనని హరీశ్‌రావు అన్నారు. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం 6,71,757 కోట్లు అప్పు చేసిందని పదేపదే చెబుతున్నారు. కోవిడ్ సమయంలో కేంద్రం 2020–21 ఆర్థిక సంవత్సరానికి జీఎస్డీపీలో 1.75% అధికంగా అప్పులు చేసే వెసులుబాటు కల్పించింది. గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలను ఆదుకోకుండా అప్పులు తీసుకొనే స్థితికి నెట్టింది. కేంద్రం నిర్ణయాలు, కోవిడ్ వల్ల తెలంగాణ అనివార్యంగా రూ. 41,159 కోట్ల అప్పు తీసుకోవల్సిన పరిస్థితి వచ్చింది. అవన్నీ తీసేస్తే రూ. 3,85,340 కోట్లుగా అప్పు తేలుతుంది' అని హరీశ్‌రావు చెప్పారు.

వైఎస్సార్ పథకాలను కొనసాగించాం...

'అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అనే మంచి పథకాలని పేర్లు కూడా మార్చకుండా కొనసాగిస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదే సభలో చెప్పారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలను కేసీఆర్ సభలో పొగిడి కొనసాగించారు. కానీ మీరు అలాంటి హుందాతనాన్ని ప్రదర్శించకుండా కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాలు రద్దు చేయడంతో పేద గర్భిణులపై ఎంతో ప్రభావం చూపుతుంది. మీకు భేషజాలు ఉంటే పథకాల పేర్లు మార్చుకోండి. కానీ దయచేసి పథకాలు ఆపకండి. ఆరోగ్యశ్రీకి గతేడాదితో పోలిస్తే బడ్జెట్‌ను కుదించారు' అని హరీశ్ విమర్శించారు.

గన్‌పార్క్ వద్దకు వెళ్లి కరెంటు వస్తుందా లేదా ప్రజలను అడుగుదాం?

'బీఆర్‌ఎస్ పాలనలో అన్ని రంగాలకు 24 గంటలు కరెంట్ ఇచ్చాం. పది నిమిషాలు టీ బ్రేక్ ఇస్తే గన్‌పార్క్ దగ్గర రోడ్డు మీదికి వెళ్దాం. నాతోపాటు డిప్యూటీ సీఎం భట్టిని రమ్మనండి. మా పాలనలో కరెంట్ బాగుందా? ఇప్పుడు బాగుందా? అని ప్రజల్ని అడుగుదాం' అని హరీశ్‌రావు అన్నారు.

సీఎం మందబలంతో సభను తప్పుదోవ పట్టించారు

ప్రధాన ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకుండా వాయిదా వేసుకుని పారిపోయారు: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ సర్కారు మందబలంతో శాసనసభను తప్పుదోవ పట్టించిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షానికి మైక్ ఇవ్వకుండా, వివరణ తీసుకోకుండా సభను వాయిదా వేసుకుని పారిపోయిందని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత మీడియా పాయింట్ వద్ద హరీశ్ మాట్లాడారు. ''కేంద్ర ప్రభుత్వం గతంలో ఉదయ్ పథకం ద్వారా రాష్ట్రం మీద బలవంతంగా రూ.9 వేల కోట్ల భారాన్ని రుద్దింది. ఇదే విషయాన్ని నేను సభలో చెప్తే.. సీఎం మాత్రం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. 2017 నాటి నోట్‌లోని అంశాలను చదివి వినిపించారు. అందులో వ్యవసాయ బోరుబావుల వద్ద ఉన్న మీటర్లకు బదులు స్మార్ట్ మీటర్లు పెట్టాలనే అంశం తప్ప.. కొత్తగా మీటర్లు పెట్టాలనే ప్రస్తావన లేదు. కానీ 2021 జూన్‌లో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడి 0.5% అదనపు అప్పు తీసుకునే రాష్ట్రాలు మీటర్లు పెట్టాలని కేంద్రం నిబంధన పెట్టింది. దానికి మేం ఒప్పుకోలేదు. రైతుల ప్రయోజనాల కోసం రూ.30వేల కోట్లు వదులుకున్నాం. సీఎం రేవంత్ సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. మోటార్లకు మీటర్లు పెట్టే కుట్రను అమలు చేస్తున్నారేమోనని అనుమానంగా ఉంది'' అని హరీశ్ పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వివేకానంద

'హరీశ్.. నా జోలికి రావొద్దు'



సాక్షి, హైదరాబాద్: 'నా ఒరిజినాలిటీని ఇంకా చూపలేదు. అసలు విషయాలు మాట్లాడలేదు. నా జోలికి రావద్దు' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. శాసనసభలో బడ్జెట్ పద్దుపై చర్చ సందర్భంగా శనివారం సాంబశివరావు మాట్లాడుతూ ఇంకొంత సమయం తీసుకుంటానని తెలపగా హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పార్టీకి సరైన సమయం ఇవ్వకుండా సీపీఐ నుంచి గెలిచిన ఏకైక సభ్యుడైన కూనంనేనికి ఇంకెంత సమయం ఇస్తారని స్పీకర్‌ను ప్రశ్నించారు. దీంతో కూనంనేని హరీశ్‌ను మందలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణం బాధ్యులందరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు.

'బీఆర్‌ఎస్ పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, పేదలపై గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం కోరింది. ఈ మేరకు సీపీఎం నేతలు జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, ఎస్.వీరయ్య, పి.ప్రభాకర్ శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసిన పేదలపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెట్టిన కేసులు, ఆర్టీసీ సమ్మె సందర్భంగా కార్మికులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని కోరారు. కేసుల వివరాలను కూడా ముఖ్యమంత్రికి అందజేశారు. తమ విజ్ఞప్తి పట్ల సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారని సీపీఎం నేతలు వెల్లడించారు.

అమిత్ షాపై కేసు ఎత్తేశారు.. నాపై కేసు మూయలేదు

రేవంత్ సర్కారుపై అక్బరుద్దీన్ అసంతృప్తి

- తప్పుడు కేసులకు భయపడబోనని స్పష్టీకరణ
- నగరంలో శాంతిభద్రతలు గాడి తప్పాయని ఆందోళన



సాక్షి, హైదరాబాద్: 'మీ అన్నయ్య (ప్రధాని మోదీ) సోదరుడి (అమిత్ షా)పై పెట్టిన కేసును ఎత్తేసి ఈ పేద సోదరుడి (గరీబ్ భాయ్)పై తప్పుడు కేసును మాత్రం మూసివేయలేదు' అంటూ సీఎం రేవంత్‌పై ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ తనకు అన్నయ్య (బడే భాయ్) అని.. గతంలో ప్రధాని పాల్గొన్న ఓ బహిరంగ సభలో రేవంత్ అనడాన్ని పరోక్షంగా గుర్తు చేశారు. ఎన్నికల ప్రచారంలో బాలలను వినియోగించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై నమోదైన కేసును ఎత్తేసిన హైదరాబాద్ పోలీసులు.. తనపై నమోదు చేసిన తప్పుడు కేసును మాత్రం ఎత్తేయడానికి నిరాకరించారని అక్బరుద్దీన్ ఆరోపించారు. బడ్జెట్ పద్దుపై శనివారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన రెండు గంటలపాటు ప్రసంగించారు. 'రాత్రి 10 గంటల వరకు ఎన్నికల ప్రచారానికి అనుమతి ఉండగా 9.50 గంటలకే ఓ పోలీసు అధికారి సభా వేదిక పైకెక్కి ప్రచారాన్ని ఆపేయాలని కోరారు. దీనిపై నేను అభ్యంతరం తెలపడంతో కేసు పెట్టారు. అయితే విచారణలో పోలీసులదే తప్పిదమని తేలిందని.. కేసును ఎత్తేస్తామంటూ నాటి పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య ఫోన్ చేసి క్షమాపణలు చెప్పారు. కానీ ఆ తర్వాత వచ్చిన కొత్త సీపీ.. కేసును ఎత్తేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. నేను ముస్లిం కావడమే దీనికి కారణం' అని అక్బరుద్దీన్ ఆరోపించారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా భయపడబోనన్నారు.

పోలీసుల సహకారంతోనే డ్రగ్స్ సరఫరా

భాగ్యనగరంలో పోలీసుల సహకారంతోనే గంజాయి, డ్రగ్స్ సరఫరా జరుగుతోందని తీవ్ర ఆరోపణలు చేశారు. నగరంలో శాంతిభద్రతలు గాడితప్పాయని, హత్యలు, అత్యాచారాలు ఆగడం లేదన్నారు. కాగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వక్ఫ్ భూముల కబ్జాలపై సీఐడీ విచారణకు ఆదేశించిందని, పురోగతిపై సమీక్షించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ గెలిచిన అసెంబ్లీ స్థానాల పరిధిలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక ఓట్లు రావడంపై ఆలోచించాలని సీఎంను కోరారు.

బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం

బీసీలకు అప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అక్బరుద్దీన్ ఒవైసీ ధ్వజమెత్తారు. వారికి న్యాయం జరగాలంటే తమతో కలిసి పోరాడాలన్నారు. శనివారం బడ్జెట్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ 'బీసీల సంక్షేమం పేరుతో ఎన్నో హామీలిచ్చి నిధులివ్వకపోవడంతో బీసీలు బీఆర్‌ఎస్‌ను ఓడించారు. వారిప్పుడు ప్రతిపక్ష సీట్లలో కూర్చున్నారు. గతంలో బీసీల కోసం పోరాడుతున్న ఆర్.కృష్ణయ్య నుంచి స్ఫూర్తి పొందే నేను మైనారిటీల కోసం గొంతెత్తడం ప్రారంభించా' అని ఆయన పేర్కొన్నారు.

మీ ఆరోపణల్లో నిజం లేదు

అక్బరుద్దీన్ ఆరోపణలపై సీఎం రేవంత్ స్పందన

- ఆ కేసు ఎత్తివేతను కోర్టులో కాంగ్రెస్ పార్టీ సవాల్ చేసినట్లు వెల్లడి
- రాష్ట్రానికి నిధుల కోసమే మోదీని అన్నయ్యగా సంబోధించినట్లు వివరణ



సాక్షి, హైదరాబాద్: ప్రధాని రాష్ట్రానికి పెద్దన్న లాంటి వారని, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, అనుమతుల విషయంలో సహకరించాలని కోరుతూ తాను మోదీని అన్నయ్య (బడే భాయ్)గా సంబోధించానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరణ ఇచ్చారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి పోతే 47 పైసలే తిరిగి వస్తున్నాయన్నారు. గుజరాత్, యూపీకి నిధులు ఇచ్చినట్లే తెలంగాణకు సైతం ఇవ్వాలని కోరానని గుర్తు చేశారు. ప్రధాని, ముఖ్యమంత్రి మధ్య సఖ్యత ఉండాలనే అలా చెప్పినట్లు స్పష్టం చేశారు. బడ్జెట్ పద్దుపై శనివారం చర్చలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ అమిత్ షాపై కేసు ఎత్తివేత గురించి చేసిన ఆరోపణల్లో నిజం లేదని తోసిపుచ్చుతూ ఆయన వివరణ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో చిన్నారులను వినియోగించిన కేసులో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డి పాత్ర లేదని, నిర్వాహకులే దానికి బాధ్యులని తేలడంతో హైదరాబాద్ పోలీసులు వారిపై కేసు ఉపసంహరించుకున్నారని రేవంత్ పేర్కొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఫిర్యాదుతోనే వారిపై అప్పట్లో ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. కానీ ఆ కేసును ఎత్తేయడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించిందని చెప్పారు. మోదీని ఎంత పొగిడినా తనకు బీజేపీ వార్డు సభ్యుడి టికెట్ కూడా ఇవ్వదని.. కాంగ్రెస్ పార్టీయే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అక్బరుద్దీన్‌పై ఉన్న కేసు వివరాలను తెలుసుకుంటానని చెప్పారు.

ఏ జైలో తేల్చుకోవాలని ఎల్‌అండ్‌టీకి స్పష్టం చేశా

ఎంఐఎం గత పదేళ్లు బీఆర్‌ఎస్‌తో చేసిన తప్పుడు దోస్తీతో పాతబస్తీకి చాలా నష్టం జరిగిందని, ఇప్పుడు సరైన దోస్తును గుర్తించారని సీఎం రేవంత్ ఛలోక్తి విసిరారు. రేవంత్ తన బాల్య స్నేహితుడని, సీఎం కుర్చీలో ఆయన్ను చూడటం సంతోషకరమని అక్బరుద్దీన్ అనడంతో ఈ మేరకు సీఎం స్పందించారు. పాతబస్తీలో మెట్రో ప్రాజెక్టు నిర్మించలేమని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ చేతులెత్తేసిందని.. ప్రాజెక్టును నిర్మించకపోతే చంచల్‌గూడ జైలుకెళ్తారో లేక చర్లపల్లి జైలుకెళ్తారో తేల్చుకోవాలని ఆ కంపెనీకి తాను స్పష్టం చేసినట్లు సీఎం వెల్లడించారు. తమకు కావాల్సిన వారి భూముల ధరలను పెంచుకోవడానికి గత ప్రభుత్వం అవసరం లేకున్నా హైటెక్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రోలైన్ నిర్మాణానికి టెండర్లు సైతం పిలిచిందని, తాము అధికారంలోకి రాగానే రద్దు చేశామన్నారు. నాటి సీఎం వైఎస్సార్‌తోపాటు నాటి కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి సమష్టి కృషితో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు సాకారమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టనున్నామని, కేంద్రం 15%, రాష్ట్రం 35%,45% రుణం,5% పీపీపీ విధానంలో నిధులను సమకూరుస్తామని చెప్పారు. కేంద్రం వాటా నిధులు ఇవ్వకున్నా రుణాలు తెచ్చి పూర్తిచేస్తామని అక్బరుద్దీన్ అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో మోదీ సవతి సోదరుడి ప్రేమ చూపారంటూ రేవంత్‌ను ఉద్దేశించి అక్బరుద్దీన్ అనడంతో సీఎం స్పందించారు.

అక్బరుద్దీన్ కొడంగల్‌లో పోటీ చేస్తే గెలిపిస్తా

తెలంగాణ వచ్చాక గౌలిగూడ బస్టాప్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో కారిడార్‌ను నిర్మించకుండా గత ప్రభుత్వం పాతబస్తీకి దగా చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. గౌలిగూడ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో లైన్ పూర్తిచేస్తామన్నారు. రెండో విడత ప్రాజెక్టులో భాగంగా ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు వరకు కారిడార్ నిర్మిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికలకు ముందే పనులు పూర్తి చేసి చాంద్రాయణగుట్ట (అక్బరుద్దీన్ సొంత నియోజకవర్గం)కు మెట్రోలోనే వచ్చి అక్కడి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయాలని కోరతానన్నారు. ఆయన గెలుపునకు సహకరించాలని అక్బరుద్దీన్‌ను కోరారు. తనను సైతం సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి గెలిపించాలని అక్బరుద్దీన్ బదులివ్వగా సభలో కొద్దిసేపు ఆసక్తికర చర్చ జరిగింది. కాంగ్రెస్ బీ–ఫారంపై కొడంగల్ నుంచి అక్బరుద్దీన్ పోటీ చేస్తే తాను దగ్గరుండి గెలిపిస్తానని రేవంత్ ఆఫర్ ఇచ్చారు. చాంద్రాయణగుట్ట నుంచి ఎంఐఎం టికెట్‌పై పోటీ చేస్తామంటే తాము సైతం గెలిపించడానికి సిద్ధమేనని అక్బరుద్దీన్ బదులిచ్చారు.



మేడిగడ్డ కుంగుబాటు వెనుక కాంగ్రెస్ కుట్ర

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

- సరిగ్గా ఎన్నికలకు ముందు నవంబర్‌లో కుంగిపోయింది
- భవిష్యత్తులో బరాజ్‌కు ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వ కుట్రగానే భావించాల్సి వస్తుంది
- సీఎం సోదరులు ఏం చేస్తున్నారో తెలుసు.. అన్నీ బయట పెడతాం
- కన్నెపల్లి నుంచి పంపింగ్ కోసం ఆగస్టు 2 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ పిల్లర్ల కుంగుబాటు వెనుక కాంగ్రెస్ పార్టీ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఆరోపణలు చేశారు. 'లక్షల క్యూసెక్కుల వరదను తట్టుకున్న బరాజ్.. సరిగ్గా ఎన్నికలకు ముందు నవంబర్‌లో కుంగిపోయింది. భవిష్యత్తులో బరాజ్‌కు ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వ కుట్ర అని భావించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఒకరిద్దరు మంత్రులకు ఎవరితో సంబంధాలు ఉన్నాయో అందరికీ తెలుసు.. బరాజ్‌ను వారు ఏమైనా చేయగలరు' అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ శాసన సభాపక్షం కార్యాలయంలో కేటీఆర్ శనివారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి చేస్తున్న వ్యవహారాలను సరైన సందర్భంలో బయటపెడతాం. ఉదయసింహా, ఫహీమ్ ఖురేషి, అజిత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి షాడో కేబినెట్ నడుపుతున్నారు. ఎక్కడేం జరుగుతోందో మాకన్నీ తెలుసు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకొనే ప్రయత్నంలో భాగంగా ఎన్‌డీఎస్‌ఏ నివేదికను అడ్డుపెట్టుకొని నీళ్లు ఎత్తిపోయడం లేదు. మేడిగడ్డపై కాంగ్రెస్, బీజేపీ ఒకే వైఖరితో ఉన్నాయి. బీజేపీ చెప్పినట్టుగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నడుచుకుంటున్నారు. పోలవరం కాఫర్‌డాం కొట్టుకుపోయినప్పుడు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఏమైంది? భేషజాలకు వెళ్లకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు లిఫ్ట్ చేయకుంటే ఆగస్టు 2 తర్వాత కార్యాచరణ ప్రకటిస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఎవరి లాభం కోసం మూసీ ప్రక్షాళన?

ఎవరి లాభం కోసం మూసీ ప్రక్షాళనకు రూ. 1.50 లక్షల కోట్లు ప్రతిపాదిస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. మెట్రో అలైన్‌మెంట్‌ను మార్చాలని ఎంఐఎం ఒత్తిడి చేసినందునే పాతబస్తీలో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదన్నారు. ఎల్ అండ్ టీ తీరుపై అసెంబ్లీలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలతో పెట్టుబడిదారులకు తప్పుడు సందేశం వెళ్తుందని చెప్పారు. భూసేకరణలో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొనే ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్ ప్రతిపాదించామని కేటీఆర్ చెప్పారు. షావలీ దర్గాపై గత ప్రభుత్వం వేసిన అఫిడవిట్‌కు భిన్నంగా రేవంత్ వెళతారా? అని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వానికి వివిధ పథకాలకు, పనులకు పేర్లు మార్చే పిచ్చి ఉందని, హైడ్రా కూడా అందులో భాగమేనన్నారు. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్ల పూర్తికాలం అధికారంలో కొనసాగాలని కోరుకుంటున్నట్లు కేటీఆర్ ఆకాంక్షించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వట్లేదన్నారు.

ఎనిమిది సీట్లు ఇస్తే ఏమిచ్చారు..?

తెలంగాణ ప్రజలు బీజేపీని ఎనిమిది లోక్‌సభ స్థానాల్లో గెలిపించినా రాష్ట్రానికి మాత్రం ఒరిగిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'బీజేపీకి అత్యంత క్లిష్టమైన సమయంలో ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చారు. కానీ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ మెట్రోరైలు విస్తరణకు నయాపైసా ఇవ్వలేదు' అని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కేటీఆర్ పేర్కొన్నారు.



మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న కేటీఆర్

కేంద్రంపై పోరాడకుండా మమ్మల్ని విమర్శిస్తారా?

- బడ్జెట్‌లో అన్యాయంపై ప్రధానికి, ఆర్థిక మంత్రికి లేఖ రాశాం: మల్లురవి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై పోరాడకుండా బీజేపీ ఎంపీలు తమను విమర్శించడం న్యాయం కాదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి వ్యాఖ్యానించారు. తెలంగాణకు జరిగిన అన్యాయంపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని తప్పుపట్టడం ద్వారా బీజేపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అన్నారు. శనివారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై ప్రధాని మోదీకి రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంపీలంతా కలిసి లేఖ రాశామని, ఈ లేఖ ప్రతులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు కూడా పంపామని చెప్పారు. న్యాయవాది అయ్యుండీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలంగాణకు అన్యాయం జరగలేదని అన్యాయంగా మాట్లాడుతున్నారని అన్నారు. న్యాయపరమైన హక్కుల గురించి మాట్లాడితే రఘునందన్‌రావు అపహాస్యం చేయడం ఏమిటని ప్రశ్నించిన మల్లురవి, రాష్ట్ర అభివృద్ధి కోసం తమతో పాటు పోరాటానికి బీజేపీ ఎంపీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కొత్త జిల్లాల ఏర్పాటులో శాస్త్రీయత లేదు

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి
- వికారాబాద్ జిల్లా ఉండాలా వద్దా?: సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలు, మండలాల్లో శాస్త్రీయత లేదని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బడ్జెట్ చర్చలో భాగంగా మాట్లాడిన ఆయన వికారాబాద్ జిల్లా ఏర్పాటు చేసి, పరిగి, తాండూరు, వికారాబాద్ ప్రాంతాలను జోగుళాంబ జోన్‌లో కలిపారని, దానిపై ఆందోళనలు చేస్తే తిరిగి సవరించారని గుర్తు చేశారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధితో జిల్లాలు చేయాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతిలో జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసేందుకు జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కాగా, రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అభ్యంతరం తెలిపారు. వికారాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లు ఆందోళన చేశామని, అలాంటి వికారాబాద్ జిల్లా ఏర్పాటును రామ్మోహన్‌రెడ్డి తప్పు పడుతున్నారని, రంగారెడ్డి జిల్లాలో ఉంటే బాగుండునని మాట్లాడారన్నారు. ఈ విషయంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ తన అభిప్రాయం చెప్పాలని కోరారు. అందుకు మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం చెపుతూ స్పీకర్ స్థానాన్ని ప్రశ్నించడం సరికాదని సబితకు సూచించారు.

బదిలీల నిలిపివేతపై హర్షం

సాక్షి, హైదరాబాద్: అర్చకుల బదిలీలను నిలిపివేయడంతో పాటు వారి ఇతర సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి గోత్ర నామాలపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ సచివాలయ మీడియా సెంటర్ ముందు జేఏసీ నాయకులు రమేష్‌శర్మ, ఆనంద్ శర్మలు విలేకరులతో మాట్లాడారు. అర్చకుల బదిలీలను నిలిపివేస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, సహకరించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆషామాషీగా ఉండి వెళ్లడానికి రాలేదు

ఈ ఐదేళ్లేకాదు.. మరో ఐదేళ్లు, తర్వాతి పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపేది మేమే..

- బడ్జెట్ పద్దుపై ఇచ్చిన సమాధానంలో డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: ఏదో ఐదేళ్లు ఆషామాషీగా ఉండి వెళ్లిపోవడానికి తాము అధికారంలోకి రాలేదని.. మరో ఐదేళ్లు, ఆ తర్వాత ఇంకో పదేళ్లు తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపేది కాంగ్రెస్ పార్టీయేనని ఆర్థిక శాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందుకు తగినట్టుగానే ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. బడ్జెట్‌లో అంకెల గారడీలు, భ్రమలేవీ లేవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు, ప్రజల ఆశలు తీర్చేలా, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించామని తెలిపారు. కానీ బీఆర్ఎస్ పక్షాన మాట్లాడిన హరీశ్‌రావు చేసిన విమర్శలు, ఆరోపణలు సరికాదన్నారు. తాము అధికారంలోకి వచ్చి 8 నెలలు కూడా కాలేదని.. ఎన్నికల కోడ్‌పోగా మిగిలిన నాలుగు నెలల్లోనే ఎన్నో పథకాలు అమల్లోకి తెచ్చామని చెప్పారు. అసెంబ్లీలో బడ్జెట్‌పై జరిగిన చర్చకు శనివారం రాత్రి ఆయన సమాధానమిచ్చారు. భట్టి ప్రసంగం ఆయన మాటల్లోనే..

''బడ్జెట్‌లో రైతుల కోసం రూ.72,659 కోట్లు ప్రతిపాదించడంలో తప్పేముంది? హైదరాబాద్ నగరాభివృద్ధి కోసం రూ.10వేల కోట్లు ఇచ్చాం. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఏం చేయవచ్చో కూడా మర్చిపోయే పరిస్థితిని తీసుకువచ్చిన బీఆర్ఎస్‌లా కాకుండా.. వారి నిధులు వారికే పెట్టాం. మహిళలకు లక్ష కోట్ల రుణాలిచ్చేందుకు అవసరమైన వడ్డీలు ప్రతిపాదించాం. నాలుగు నెలల కాలంలోనే 32,410 ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చాం. మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చాం. రూ.31 వేల కోట్లతో రుణమాఫీని సుసాధ్యం చేశాం. రైతు కూలీలకు ఈ ఏడాది నుంచే రైతు భరోసా ఇస్తాం. స్పష్టమైన విద్యుత్ పాలసీతో ముందుకొస్తాం. ఆరు గ్యారంటీల గురించి అనుక్షణం తపిస్తున్నాం. ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో ఇళ్లు లేని పేదల జాబితా తయారు చేసి ఇన్‌చార్జి మంత్రులకు ఇవ్వాలి. రైతు భరోసా ఎలా ఇవ్వాలన్న దానిపై ఆలోచన చేస్తున్నాం. హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును 35 ఏళ్ల లీజుకు ఇచ్చి.. ఆ డబ్బు మొత్తాన్ని ఒకేసారి తీసుకొని బీఆర్ఎస్ పాలకులు దోపిడీ చేశారు. దానిపై విచారణ చేయిస్తాం. అవసరమైతే లీజును రద్దు చేస్తాం. బీఆర్ఎస్ పాలకులకు చాన్స్ దొరికితే హైటెక్ సిటీని కూడా అమ్మేసేవారు.

బీఆర్ఎస్‌లా అయితే రూ.3.50 లక్షల కోట్ల బడ్జెట్

మేం బీఆర్ఎస్ మాదిరిగా అడ్డగోలుగా పెడితే ఈ బడ్జెట్ 3.50లక్షల కోట్లతో ఉండేది. కానీ అలా చేయకుండా రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదించాం. ఎక్సైజ్ ఆదాయం కూడా గతం కంటే 5 శాతమే ఎక్కువగా ప్రతిపాదించాం. టానిక్ లాంటి అడ్డగోలు సంస్థలను కట్టడి చేసి ఆ మొత్తం రాబడతాం. కేంద్ర ప్రాయోజిత పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటాం. పన్ను రాబడులు ఎలా రాబట్టుకోవాలో మాకు తెలుసు.

హైదరాబాద్ అభివృద్ధి అంతా మాదే..

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చూడటానికి ఏదైనా కట్టారా? ఇక్కడి కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ కాంగ్రెస్ తీసుకువచ్చినవే. ఔటర్‌రింగురోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైల్‌తోపాటు ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ ఇళ్లను కాంగ్రెస్ నిర్మించింది. అందుకే హైదరాబాద్ అభివృద్ధి చెందింది. హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి, మంజీరాల నుంచి నీటిని తెచ్చింది కాంగ్రెస్ పార్టీయే. అలా మేం తెచ్చిన నీళ్లకు నల్లా తిప్పి.. ఆ నీళ్లు చల్లుకుని తామే తెచ్చామని గొప్పలు చెప్పుకున్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీకి రూ.650 కోట్లు బిల్లులు పెండింగ్ పెడితే మేం చెల్లిస్తున్నాం. అలాంటి ఆరోగ్యశ్రీ గురించి బీఆర్ఎస్ మాట్లాడితే జనం నవ్వుకుంటారు. పింఛన్లు కూడా రెండు నెలలు ఎగ్గొట్టిన చరిత్ర బీఆర్ఎస్‌ది. మేం పన్నులు వేయబోం. మేం పన్నుల భారం వేస్తే ప్రజలు.. వారిపైపు వస్తారని బీఆర్ఎస్ భావిస్తోంది. అలాంటి ఆశలు పెట్టుకోవద్దు. ఎల్ఆర్ఎస్‌పై స్పష్టమైన నిర్ణయంతో ముందుకెళతున్నాం. మోసం గురించి బీఆర్ఎస్ మాట్లాడితే ఎట్లా? మోసం అంటే బీఆర్ఎస్, నమ్మకం అంటే కాంగ్రెస్ అని ఎవరిని అడిగినా చెప్తారు.

ప్రాధాన్యతలకు అనుగుణంగా నిధులు

అర్థవంతంగా, కొద్దిగా ఖర్చుచేస్తే నీళ్లు పారే ప్రాజెక్టులు, ఇతర ప్రాధాన్యతలను నిర్ణయించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాం. కొన్ని వేల కోట్లతోనే లక్షల ఎకరాల్లో నీళ్లు పారిస్తాం. పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఎల్‌బీసీ టన్నెల్, అన్ని ప్రాజెక్టులు ఆన్ చేసే విధంగా చర్యలు చేపడతాం. సీతారామ ప్రాజెక్టు కింద రూ.1,400 కోట్లు ఖర్చు చేస్తే 4 లక్షల ఎకరాలకు నీళ్లు పారేవి. కానీ ఒక్క ఎకరానికి కూడా గత ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేకపోయింది. మా ప్రభుత్వం రూ.75 కోట్లతో చిన్న కాలువతో (రాజీవ్ కెనాల్) అతిత్వరలోనే 1.25 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వబోతున్నాం. దీనిని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్‌లను కూడా పునరుద్ధరిస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదవర్గాల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఆలోచన చేస్తున్నాం. హైదరాబాద్ నగర అభివృద్ధి వేగవంతం చేస్తాం. పాతబస్తీ అనేది వారసత్వ సంపద, అక్కడి కట్టడాలను సంరక్షించి ప్రపంచానికి అద్భుతంగా అందిస్తాం. చార్మినార్ పెడస్ట్రేషన్ ప్రోగ్రామ్‌ను కచ్చితంగా అమలు చేస్తాం. మూసీ రివర్ ఫ్రంట్ సుందరీకరణ ప్రాజెక్టును హైదరాబాద్‌కు వన్నె తెచ్చేలా తీర్చిదిద్దుతాం..'' అని భట్టి విక్రమార్క చెప్పారు.

పైన పటారం... లోన లొటారం

బడ్జెట్‌పై పాయల్ శంకర్ విమర్శ



సాక్షి, హైదరాబాద్: ప్రజల ఆశలపై రాష్ట్ర బడ్జెట్ నీళ్లు చల్లిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభా పక్ష ఉప నేత పాయల్ శంకర్ విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలేవీ అమలయ్యే పరిస్థితి లేదన్నారు. బడ్జెట్ హామీల అమలుకు ఏటా రూ. 9 లక్షల కోట్లు కావాలని, దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు ఏమాత్రం బాగోలేనందున, ఆ వాస్తవం ఎప్పుడో అప్పుడు ప్రజలకు తెలియాల్సిందేనని, ఆలోపే ప్రభుత్వమే జనానికి వాస్తవాలు చెబితే బాగుంటుందని సూచించారు. వార్షిక బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ. 2.91 కోట్లతో బడ్జెట్ వినడానికి బాగున్నప్పటికీ, పైన పటారం లోన లొటారం తరహాలో ఉందని అన్నారు. గ్రామపంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ లేదని, మునిసిపాలిటీల్లో చెత్త తొలగించే పరిస్థితి లేదని విమర్శించారు. ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల ఆకాంక్షలను ఈ బడ్జెట్‌లో నెరవేర్చకుండా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను అసెంబ్లీ విమర్శించడం శోచనీయమన్నారు. బ్రాహ్మణ పరిషత్తు నిధులను రూ.100 కోట్ల నుంచి రూ.50 కోట్లకు తగ్గించటం ఏమాత్రం సరికాదని అన్నారు. తెలంగాణ పదం కూడా కేంద్ర బడ్జెట్‌లో లేదని అసెంబ్లీలో కాంగ్రెస్ సీనియర్ నేతల/ వ్యాఖ్యానించారని, మరి ఈ బడ్జెట్‌లో ఏయే జిల్లాల పేర్లు ప్రస్తావించారని పాయల్ శంకర్ ప్రశ్నించారు.

సభ్యుల సమ్మతితోనే రైతు భరోసా

మండలిలో ఉపముఖ్యమంత్రి భట్టి స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకొని శాసన సభ్యులతో చర్చించి వారి సమ్మతితోనే రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సమ్మతితోనే ప్రజాపాలన సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో తప్పుంటే వేలెత్తి చూపాలని, తప్పకుండా సరిచేసుకుంటామన్నారు. శనివారం శాసనమండలిలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు భట్టి బదులిచ్చారు. తాజా బడ్జెట్‌లో రైతాంగానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. రైతు రుణమాఫీ కొనసాగుతోందన్నారు. విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతోనే సీఎం ఈ శాఖను ఆయన వద్దే అట్టిపెట్టుకున్నారని భట్టి వివరించారు. చేనేత పరిశ్రమను ఆదుకుంటామని, బతుకమ్మ చీరలతోనే కాకుండా హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు తదితరాలకు చేనేత పరిశ్రమను ఉపయోగించుకుంటామన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించేందుకు మంత్రివర్గ ఉపసంఘం కృషి చేస్తోందన్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రులుగా కొనసాగే అర్హతలేదు
- బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి నిధులు తీసుకురావాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్షతో కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. బడ్జెట్ సవరణల ద్వారా తెలంగాణ అభివృద్ధికి నిధులు తెచ్చి బీజేపీ నేతలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. హైడ్రా, మూసీ ప్రక్షాళన, మెట్రో ఇతర అంశాలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించామన్నారు. 'బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా.. ఇంకా సమయం మించిపోలేదు. ఈ బడ్జెట్ సెషన్‌లోనే కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి నిధులు తెప్పించే ప్రయత్నం చేయాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి మా ప్రతినిధి బృందం రావడానికి సిద్ధంగా ఉంది' అని మంత్రి అన్నారు. కాగా, రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కేంద్ర మంత్రులుగా ఉన్నా.. మనకు నిధులు రాకపోవడం విడ్డూరమని పొన్నం పేర్కొన్నారు. వీరిద్దరికీ కేంద్ర మంత్రులుగా కొనసాగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. ఒక రూపాయి కూడా ఇవ్వని బీజేపీ నేతలు ఏం ముఖం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని దేశం మొత్తం తెలియజేయడానికే నీతి ఆయోగ్ సమావేశానికి ముఖ్యమంత్రి వెళ్లలేదన్నారు.

బీఆర్ఎస్ నేతలది కాళేశ్వరం విహార యాత్ర

బీఆర్ఎస్ నేతల కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన విహార యాత్రలా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వెళ్లి ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ద్వారానే మొత్తం నీళ్లు వచ్చినట్టు బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ ప్రాజెక్టు నుంచి తమ పొలాలకు నీళ్లు రాలేదని, మిడ్ మానేరు ద్వారా వచ్చిన నీళ్లతోనే అక్కడి రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని స్పష్టం చేశారు. రైతాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి అన్నారు.

మీది హాఫ్ నాలెడ్జ్.. మీకు నాలెడ్జే లేదు

అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పరస్పర విమర్శలు





సాక్షి, హైదరాబాద్: శాసన సభలో శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య పరస్పరం మాటల తూటాలు పేలాయి. సభలో బడ్జెట్‌పై హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి భాషపై వ్యాఖ్యలు చేయడంతో మంత్రి కోమటిరెడ్డి జోక్యం చేసుకున్నారు. 'టీఆర్ఎస్ ఆవిర్భావంలో దళితుడు సీఎం అవుతారన్నారు. బడ్జెట్‌పై చీల్చిచెండాడతానని కేసీఆర్ అన్నారు. దీంతో మేమంతా ఉదయం తొమ్మిదిన్నరకే వచ్చి కూర్చున్నాం. కానీ కేసీఆర్‌కు ముఖం చెల్లక హరీశ్‌రావుతో మాట్లాడిస్తున్నారు' అని కోమటిరెడ్డి కామెంట్ చేశారు. దీంతో హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. 'టీపీసీసీ పదవిని రేవంత్ రూ. 50 కోట్లకు కొనుక్కున్నాడని అనలేదా? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హాఫ్ నాలెడ్జ్' అంటూ విమర్శించారు. దీనిపై అధికారపక్ష సభ్యులు నిరసన తెలిపినా హరీశ్ ఆవేశంతో 'అవును ఆయన హాఫ్ నాలెడ్జే' అని పునరుద్ఘాటించారు. దీంతో స్పీకర్ వెంటనే జోక్యం చేసుకొని ఆ మాటలను విరమించుకోవాలని హరీశ్‌రావును కోరారు. అనంతరం కోమటిరెడ్డి జోక్యం చేసుకొని 'హరీశ్‌రావు హాఫ్ నాలెడ్జే కాదు... ఆయనకు ఆకారం పెరిగిందే కానీ నాలెడ్జ్ ఎక్కడుంది? ఆయన ఒక డమ్మీ మంత్రి, డమ్మీ అల్లుడు' అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

హరీశ్‌కు హాఫ్ నాలెడ్జ్.. కేసీఆర్‌కు 'ఫుల్' నాలెడ్జ్: సీఎం

ఈ తరుణంలో సీఎం రేవంత్ స్పందించారు. 'వారికేమో (హరీశ్‌ను ఉద్దేశించి) హాఫ్ నాలెడ్జ్... పెద్దాయనకు (కేసీఆర్) ఫుల్ నాలెడ్జ్ (సైగలతో మోచేతిని చూపించారు). ఇలా ఉన్నప్పుడు మేమేం చేయగలం?' అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై హరీశ్ కౌంటర్ ఇస్తూ మేము సరిగ్గా పనిచేయలేదనే ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. మీరు కూడా తప్పులు చేసి ఇక్కడ కూర్చుంటారా? మేము అక్కడికి వస్తాం. మంత్రులు మీటింగ్‌లు పెడితే కరెంట్ ఉంటుందో లేదోనన్న భయంతో అధికారులు జనరేటర్లు పెడుతున్నారు' అని విమర్శించారు. మరోవైపు హరీశ్‌రావు మాట్లాడుతున్నంత సేపు బీఆర్ఎస్ సభ్యులు ఆరు గ్యారంటీలపై ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు స్పీకర్‌ను కోరగా ప్లకార్డు లను మార్షల్స్‌కు ఇస్తేనే సభ నడుపుతానని స్పష్టం చేశారు. కాగా, ఉప ముఖ్యమంత్రి భట్టి స్పందిస్తూ తమ బడ్జెట్ చూసి హరీశ్‌రావుకు కంటగింపుగా ఉందని వ్యాఖ్యానించారు.

హరీశ్‌రావుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అభినందన

శాసనసభలో వార్షిక బడ్జెట్‌పై జరిగిన చర్చలో బీఆర్ఎస్ తరఫున ప్రసంగించిన సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావును పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభినందించారు. ప్రసంగం పూర్తి చేసిన అనంతరం లాబీలోని ప్రతిపక్ష నేత కేసీఆర్ ఛాంబర్‌కు వచ్చిన హరీశ్‌పై ప్రశంసలు కురిపించారు. పార్టీకి కేటాయించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు బడ్జెట్ ప్రతిపాదనల్లో లోపాలను సమర్థవంతంగా ఎత్తిచూపారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కితాబునిచ్చారు. ట్రెజరీ బెంచ్ (ప్రభుత్వ పక్షం) నుంచి సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మరో ముగ్గురు మంత్రులు జోక్యం చేసుకుని చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినా తిప్పికొట్టారని ప్రశంసించారు. ప్రభుత్వ పక్షాన్ని ఇరుకున పెట్టేలా ప్రసంగించారని, సీఎం, అధికార పక్షం నుంచి ఎదురైన విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టారని పార్టీ ఎమ్మెల్యేలు అభినందించారు. హరీశ్‌రావు ప్రసంగానికి సోషల్ మీడియాలో మంచి స్పందన వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చర్చించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసిందనే వాదనను బడ్జెట్ ప్రసంగంలో తిప్పికొట్టగలిగానని హరీశ్‌రావు పేర్కొన్నారు.



> ఆయన నాకు అనుగ్రహించిన దానియంతటిలో నేనేమియు పోగొట్టుకొనక, అంత్యదినమున వాటిని లేపుటయే నన్ను పంపినవాని చిత్తమైయున్నది.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; తిథి: బ.అష్టమి రా.10.47 వరకు, తదుపరి నవమి; నక్షత్రం: అశ్విని ప.3.54 వరకు, తదుపరి భరణి; వర్జ్యం: ప.12.09 నుండి 1.39 వరకు, తదుపరి రా.12.57 నుండి 2.27 వరకు; దుర్ముహూర్తం: సా.4.48 నుండి 5.39 వరకు; అమృత ఘడియలు: ఉ.9.11 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

యోగి ఆదిత్యనాథ్
(ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

గెలుపు.. భుజం మీద చెయ్యి వేస్తుంది. ఓటమి.. భుజం మీది ఆ చేతిని తీయించేస్తుంది. భుజానికి, చేయికి మధ్య ఉండేవి గెలుపు ఓటములే కాని... అది ఎవరి భుజం, ఎవరి చెయ్యి అన్నది కాదు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి యూపీలో 62 సీట్లు వచ్చినప్పుడు, ఆ తర్వాత మోదీజీ ఒకట్రెండుసార్లు నా భుజం మీద చెయ్యి వేసి నాతో కలిసి కొంత దూరం నడిచారు. 2024 ఎన్నికల్లో ఆ 62 సీట్లు 33 కు తగ్గిపోయినప్పుడు... "మీరుండీ ఓడిపోయాం యోగీ..." అన్నట్లుగా నా వైపు చూశారు. చూశారే గానీ నా భుజంపైన చెయ్యి వేయలేదు! ఓటమిలోనే కదా, నిజంగా ఎవరైనా ఎవరి భుజం మీదైనా చెయ్యి వేయవలసింది!

"ఏంటి ఆలోచిస్తున్నారు యోగీజీ?" అన్నారెవరో నా భుజం మీద చేయి వేసి! ఆ చెయ్యి మోదీజీది అవకూడదా అని ఆశగా తల తిప్పి చూశాను. చెయ్యి మోదీజీది కాదు. నీతి ఆయోగ్ మీటింగ్‌కి వచ్చిన ఏక్‌నాథ్ షిందేది.



"మీరా!" అని నవ్వాను.

"అవును నేనే. మీరు ఎవరని అనుకున్నారు?" అని నవ్వారాయన.

"ఎవరనీ అనుకోలేదు. ఎవరై ఉంటారా అనుకున్నాను" అన్నాను.

"నేను రెండుసార్లు మిమ్మల్ని పిలిచాను. ఏదో ఆలోచనలో ఉన్నారు. అందుకే భుజం మీద చెయ్యి వేయగలిగాను... " అన్నారు షిందే.

"ఓ అదా... ఆలోచన కాదు. మీటింగ్‌కి వచ్చిన సీఎంలు ఎవరెవరా అని చూస్తున్నాను" అని అబద్ధం చెప్పాను.

షిందే నవ్వారు. "రానివాళ్లు ఎవరెవరా అని కదా చూడాలి యోగీజీ! మన వాళ్లంతా దాదాపుగా వచ్చినట్లే. వాళ్ల వైపు పంజాబ్ నుంచి భగవంత్ రాలేదు. తెలంగాణ నుంచి రేవంత్ రాలేదు. కర్ణాటక నుంచి సిద్దరామయ్య రాలేదు. జార్ఖండ్ నుంచి సొరేన్ రాలేదు. హిమాచల్ నుంచి సుఖ్విందర్ రాలేదు. తమిళనాడు నుంచి స్టాలిన్ రాలేదు. కేరళ నుంచి విజయన్ రాలేదు" అన్నారు.

"మమతాజీ వచ్చినట్లున్నారు కదా..." అన్నాను. మమత ఉన్న వైపు చూస్తూ.

"అవును వచ్చారు. తక్కినవాళ్లంతా తమ స్టేట్‌కు బడ్జెట్‌లో ఏమీ ఇవ్వలేదన్న నిరసనతో మీటింగ్ రావటం మానేస్తే, మమత ఒక్కరూ తన స్టేట్‌కు బడ్జెట్‌లో ఏమీ ఎందుకు ఇవ్వలేదో డైరెక్టుగా మోదీతోనే తేల్చుకోటానికి మీటింగ్ వచ్చారు..." అన్నారు షిందే నవ్వుతూ.

"అవునా!" అన్నాను.

మళ్లీ నా భుజం మీద చెయ్యి పడింది! ఇప్పుడైనా మోదీజీ అయుండకూడదా అని చూశాను. మోదీజీ కాదు. విష్ణుదేవ్ సాయ్. ఛత్తీస్‌గఢ్ సీఎం. ఆయన రెండో చెయ్యి షిందే భుజం మీద ఉంది.

"ఏంటి.. నాథులిద్దరూ సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నారు?" అన్నారు విష్ణుదేవ్ నవ్వుతూ. నాథులిద్దరూ అంటే ఏక్‌నాథ్, ఆదిత్యనాథ్ అని కావచ్చు.

ఇద్దరం నవ్వాం.

"మోదీజీని కలిశారా?" అని అడిగారు విష్ణుదేవ్.

"ఇంకా రానిదే!" అన్నారు షిందే.

"ఆయన వస్తారా! మనమే కదా ఆయన దగ్గరకు వెళ్లాలి..." అన్నారు విష్ణుదేవ్.

దూరాన్నుంచి – మోదీజీ ఎవరితోనో నవ్వుతూ మాట్లాడుతుండటం గమనించాను. నేను గమనించానని గమనించి వెంటనే ముఖం తిప్పేసుకున్నారు ఆయన!

ఓటమి మనిషిని ఇంతగా కానివాడిని చేస్తుందా? "డైరెక్టుగా మోదీతోనే తేల్చుకోటానికి మీటింగ్‌కి వచ్చారు..." అని మమత గురించి షిందే చెప్పటం గుర్తొచ్చి వెంటనే మోదీజీ దగ్గరకు వెళ్లిపోయాను.

"నమస్తే మోదీజీ..." అన్నాను.

అప్పుడు కూడా ఆయన నా భుజంపై చేయి వెయ్యలేదు. అసలు నా వైపే చూడలేదు.

"ఈ ఏడాది యూపీలో పది చోట్ల ఉప ఎన్నికలు ఉన్నాయి కదా..." అని ఎవరితోనో అన్నట్లుగా నాతో అని, పక్కన ఇంకెవరినో పలకరిస్తూ ముందుకు వెళ్లిపోయారు!!

బాధ్యత లేని 'బోగస్' గెలుపు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

కష్టపడి సంపాదించిన వాడికే డబ్బు విలువ తెలుస్తుందంటారు. విలువ తెలుసు కనుక దానిపట్ల బాధ్యత కూడా పెరుగుతుంది. దొంగ సొత్తుకూ, అక్రమ సంపాదనకూ ఈ సూత్రం వర్తించదు. డబ్బు సంపాదనే కాదు, విజయ సాధన కూడా ఇంతే. అది ఎన్నికల విజయమైనా మరే రకమైన విజయమైనా సరే. పోరాడి గెలిచిన వాడికి తనకు దక్కిన విజయం పట్ల గౌరవం ఉంటుంది. విజయ హేతువుల పట్ల వినమ్రత ఉంటుంది. బాధ్యత ఉంటుంది.

అన్ని రంగాల్లోనూ దొడ్డిదారి విజయాలు కూడా ఉంటాయి. ఎన్నికల్లో కూడా ఉంటాయి. పరోక్ష ఎన్నికల్లో ఇటువంటి దొడ్డిదారి విజయాల వికటాట్టహాసం మనకు తెలియనిది కాదు. కానీ ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల తీర్పును 'దొంగిలించడమ'నే సరికొత్త సాంకేతిక ప్రక్రియ రంగప్రవేశం చేసింది. ఈ పరిణామం పట్ల మనదేశంలోని మేధావుల్లో, ప్రజాస్వామ్య వాదుల్లో, అభ్యుదయ శక్తుల్లో ఆందోళన మొదలైంది. ఇటువంటి ఆందోళనే మహారాష్ట్రలోని కొంతమందిని ఒక దగ్గరకు చేర్చింది. వోట్ ఫర్ డెమోక్రసీ (వీఎఫ్‌డీ) అనే వేదిక తయారైంది.

వీఎఫ్‌డీ అనే వేదికపైకి కొందరు వ్యక్తులతోపాటు కొన్ని సంస్థలు కూడా చేరుకున్నాయి. దేశంలో జరిగిన మొన్నటి సాధారణ ఎన్నికల ఫలితాలు చాలామందిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఈ వేదిక కూడా మినహాయింపు కాదు. కానీ వీఎఫ్‌డీ మాత్రం ఆశ్చర్యంలోనే మునకేసి ఉండకుండా ఒక ముందడుగు వేసింది. ఎన్నికల ప్రక్రియను ఆసాంతం అధ్యయనం చేసి ఒక 225 పేజీల నివేదికను ఈమధ్యనే ఆ సంస్థ విడుదల చేసింది. ఈ నివేదికలో పొందుపరిచిన పలు అంశాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. మన ప్రజాస్వామ్య ప్రక్రియ పవిత్రతను సహేతుకంగా శంకిస్తున్నాయి.

ఈవీఎమ్‌ల పనితీరుపైనా, పారదర్శకతపైనా అనుమానాలు, అభ్యంతరాలు పాతవే. వీడీఎఫ్ కేవలం సందేహాలకు మాత్రమే పరిమితం కాకుండా పోలింగ్ సందర్భంగా, కౌంటింగ్ సందర్భంగా జరిగిన అవకతవకలను ఎత్తిచూపింది. ఎన్నికల ప్రక్రియకు ముందు ఎన్నికల సంఘంలో జరిగిన అసాధారణ మార్పులను ఎండగట్టింది. ప్రక్రియ ముగిసేవరకూ ఎన్నికల సంఘం అవలంభించిన ఏకపక్ష ధోరణిని నిర్ధారించింది. ఫలితాల ప్రకటనలోని అసమంజసత్వాన్ని వెలికి తీసింది.

సాధారణంగా పోలింగ్ ముగిసిన అనంతరం సాయంత్రం ఏడు లేదా ఎనిమిది గంటలకల్లా పోలింగ్ శాతాలను ఎన్నికల సంఘం ప్రకటించడం రివాజు. ఎక్కడైనా కొన్ని బూత్‌లలో పోలింగ్ ఆలస్యంగా జరిగితే అవి కూడా కలుపుకొని రాత్రి ఆలస్యంగా గానీ, అరుదుగా మరుసటిరోజు గానీ తుది పోలింగ్ శాతాన్ని ఈసీ ప్రకటిస్తూ వస్తున్నది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం గతంలో ఎన్నడూ కూడా ఒక శాతాన్ని మించిన అనుభవాలు లేవు. ఈసారి మాత్రం ఏడు దశల పోలింగ్‌లోనూ అసాధారణ పెరుగుదల నమోదైంది. కనిష్ఠంగా 3.2 శాతం నుంచి గరిష్ఠంగా 6.32 శాతం వరకు పెరుగుదల ఈ ఏడు దశల్లో కనిపించింది.

గరిష్ఠంగా నాలుగో దశ పోలింగ్‌లో 6.32 శాతం పెరుగుదల నమోదైంది. ఈ దశలోనే పోలింగ్ జరుపుకున్న ఆంధ్రప్రదేశ్‌లో 12.54 శాతం, ఒడిశాలో 12.48 శాతం పెరుగుదల కనిపించడంపై వీఎఫ్‌డీ విస్మయం వ్యక్తం చేసింది. మన చెవుల్లో పెద్దపెద్ద తామర పువ్వులుంటే తప్ప ఈసీ చేసిన ఈ దారుణమైన ఓటింగ్ పెంపును నమ్మడం కష్టం. పోలింగ్ ముగిసిన నాలుగు రోజుల తర్వాత, తుది పోలింగ్ శాతాన్ని ప్రకటించడం మరింత విభ్రాంతిని కలిగించే విషయం. ఇంత అసాధారణ స్థాయిలో పోలింగ్ శాతాల పెరుగుదలపై వచ్చిన సందేహాలకు ఇప్పటివరకు ఎన్నికల సంఘం సరైన వివరణ ఇవ్వలేదనే సంగతిని దృష్టిలో ఉంచుకోవాలి.

ఈవీఎమ్‌ల ట్యాంపరింగ్ జరిగితేనో, లేక పోలింగ్ జరిగిన ఈవీఎమ్‌ల బదులు కౌంటింగ్‌లో కొత్త మిషన్లు వచ్చి చేరితేనో తప్ప ఈ అసాధారణ పెరుగుదల సాధ్యంకాదని వీఎఫ్‌డీ అభిప్రాయపడింది. కనుక ఈ పెరిగిన ఓట్లను బోగస్ ఓట్లుగా అది పరిగణించింది. ఈవీఎమ్‌లలో ఏదో ఇంద్రజాలం జరిగిందన దానికి మరో దృష్టాంతాన్ని కూడా వీఎఫ్‌డీ నిర్ధారించింది. తుది



> వీఎఫ్‌డీ సంస్థ బోగస్‌గా పరిగణించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో ఎన్డీఏ గెలిచిన సీట్లను వాస్తవానికి ప్రతిపక్షాలు గెలవాల్సిన సీట్లుగా వర్గీకరించారు. రాష్ట్రాలవారీగా పెరిగిన బోగస్ ఓట్ల మొత్తాన్ని ఆ రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలకు సమానంగా విభజించిన అనంతరం ఆ సంఖ్య కంటే తక్కువ తేడాతో ఓడిపోయిన సమీప ప్రత్యర్థిని అసలైన విజేతగా వీఎఫ్‌డీ లెక్క కట్టింది. ఈ లెక్కన 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి ఓడిపోవాల్సింది.
>
> వీఎఫ్‌డీ గణిత సమీకరణం ప్రకారం ఒడిశాలో బీజేడీ, ఆంధ్రలో వైసీపీ అధికారంలోకి వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పోలైన ఓట్లలో 49 లక్షల పైచిలుకు ఓట్లను బోగస్‌గా ఆ సంస్థ పరిగణించింది. ఆ ఓట్లను మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల మధ్య సమంగా పంచితే ఇరవై ఎనిమిదవేలవుతుంది. అంతకంటే తక్కువ తేడాతో వైసీపీ ఓడిపోయిన నియోజకవర్గాల సంఖ్య 77. గెలిచిన 11 వీటికి జత చేస్తే మొత్తం 88. అంటే సింపుల్ మెజారిటీ.

ప్రకటన చేసిన పోలైన ఓట్లకూ, కౌంట్ చేసిన ఓట్లకూ మధ్య భారీ వ్యత్యాసాలు కనిపించాయి. కొన్నిచోట్ల కౌంట్ చేసిన ఓట్లు పెరిగాయి. మరికొన్ని చోట్ల తగ్గాయి. ఇదెలా సాధ్యమవుతుంది? ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 3,500 నుంచి 6,500 వరకు ఓట్లు కౌంటింగ్ సమయానికల్లా తగ్గిపోయాయి. ఇటువంటి నియోజకవర్గాలు దేశవ్యాప్తంగా 174 ఉన్నాయని వీఎఫ్‌డీ తెలియజేసింది.

వీఎఫ్‌డీ సంస్థ బోగస్‌గా పరిగణించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో ఎన్డీఏ గెలిచిన సీట్లను వాస్తవానికి ప్రతిపక్షాలు గెలవాల్సిన సీట్లుగా వర్గీకరించారు. రాష్ట్రాలవారీగా పెరిగిన బోగస్ ఓట్ల మొత్తాన్ని ఆ రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాలకు సమానంగా విభజించిన అనంతరం ఆ సంఖ్య కంటే తక్కువ తేడాతో ఓడిపోయిన సమీప ప్రత్యర్థిని అసలైన విజేతగా వీఎఫ్‌డీ లెక్కకట్టింది. ఈ లెక్కన 79 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి ఓడిపోవాల్సింది.

వీఎఫ్‌డీ గణిత సమీకరణం ప్రకారం ఒడిశాలో బీజేడీ, ఆంధ్రలో వైసీపీ అధికారంలోకి వచ్చి ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం పోలైన ఓట్లలో 49 లక్షల పైచిలుకు ఓట్లను బోగస్‌గా ఆ సంస్థ పరిగణించింది. ఆ ఓట్లను మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాల మధ్య సమంగా పంచితే ఇరవై ఎనిమిదవేలవుతుంది. అంతకంటే తక్కువ తేడాతో వైసీపీ ఓడిపోయిన నియోజకవర్గాల సంఖ్య 77. గెలిచిన 11 వీటికి జత చేస్తే మొత్తం 88. అంటే సింపుల్ మెజారిటీ.

వీఎఫ్‌డీ సంస్థ ఆషామాషీగా బోగస్ ఓట్ల సంఖ్యను నిర్ధారించలేదు. అనుమానించడానికి హేతుబద్ధమైన అనేక ఉదంతాలను అది ఉదహరించింది. షెడ్యూల్ ప్రకటనకు కొద్దిరోజుల ముందే అరుణ్ గోయల్ అనే కమిషనర్ ఎందుకు తప్పుకున్నారని ప్రశ్నించింది. షెడ్యూల్ ప్రకటనకు ఒకరోజు ముందు కమిషనర్లుగా ఇద్దరు అధికారులు చేరారు. వీరిలో ఒక అధికారి పూర్వాశ్రమంలో అమిత్‌షా దగ్గర అధికారిగా పని చేశారనీ, మరొక అధికారి ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి వద్ద పనిచేశారని ఆ సంస్థ వెల్లడించింది.

పోలింగ్ ముగిసిన వెంటనే పార్టీ ఏజెంట్లకు ఇవ్వాల్సిన 17–సి ఫామ్‌లను ఎంతమంది ఏజెంట్లకు ఇచ్చారో తెలపగలరా అని ఆ సంస్థ సవాల్ చేసింది. ఈవీఎమ్‌ల వారీగా ఫామ్ 17–సీలలో నమోదు చేసిన ఓటింగ్ వివరాలు కౌంటింగ్‌లో లెక్కించిన ఓట్లతో సరిపోల్చడానికి ఒక స్వతంత్ర అధ్యయనం జరగవలసిన అవసరం ఉన్నదని వీఎఫ్‌డీ అభిప్రాయపడింది.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు ఈ బోగస్ ఓట్ల బాగోతం ఒక భాగం మాత్రమే. తొలి అంకం వేరే ఉన్నది. కూటమి నేతలు – యెల్లో మీడియా సంయుక్తంగా సాగించిన విష ప్రచారం, కూటమి ఇచ్చిన మోసపూరితమైన హామీలు ఈ భాగం. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఏపీలో కూటమి చేసింది దుష్ప్రచారమేనని మొన్నటి యూనియన్ బడ్జెట్‌తో తేలిపోయింది. ఏపీలో ప్రారంభించిన ఈ సంస్కరణ దేశమంతటా జరగాలని కేంద్రం కోరుతున్నది. అందుకోసం రాష్ట్రాలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించింది.

జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రాష్ట్రం దివాళా తీసిందని, శ్రీలంకలా మారిందని రాసిన రాతలకూ, కూసిన కూతలకూ అంతే లేదు. మొన్న యూనియన్ బడ్జెట్‌కు ముందురోజు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే జగన్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణను కొనియాడటంతో యెల్లో కూటమి ముఖాన కళ్లాపి చల్లినట్టయింది. రాష్ట్రానికి 14 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో 10 లక్షల కోట్లని గవర్నర్ చేత చెప్పించారు. ఈ కుప్పిగంతులనూ, శ్వేతపత్రాల తప్పుడు తంతులనూ చీల్చి చెండాడుతూ వైసీపీ అధ్యక్షుడు ప్రెస్‌మీట్ పెడితే సమాధానం చెప్పడానికి ఇప్పటిదాకా ఏ యెల్లో మేధావీ ముందుకు రాకపోవడం గమనార్హం.

ఇసుక మీద నసిగిన వాగుడెంత?... రాజేసిన రాద్ధాంతమెంత? అప్పుడే మరిచిపోతామా? ఇసుక ధరలు అప్పటికంటే ఇప్పుడే ఎక్కువయ్యాయని ఊరూవాడా గగ్గోలు పెడుతున్నది. ఈ పబ్లిక్ టాక్‌ను అడ్రస్ చేయడానికి ఒక్క సర్కారీ సిపాయి కూడా ఇంతవరకు సాహసించలేదు. లిక్కర్ పాలసీ మీద వెళ్లగక్కిన ప్రచారం సంగతి సరేసరి. ఇప్పటివరకైతే అదే పాలసీ కొనసాగుతున్నది. దీన్నే కొనసాగిస్తారో, లేదంటే బెత్తెడు దూరానికో బెల్టు షాపు సుగంధాలు వెదజల్లిన తమ పాతకాలపు పాత పాలసీకి వెళ్తారో వేచి చూడాలి.

> జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, రాష్ట్రం దివాళా తీసిందని, శ్రీలంకలా మారిందని రాసిన రాతలకూ, కూసిన కూతలకూ అంతే లేదు. మొన్న యూనియన్ బడ్జెట్‌కు ముందురోజు ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే జగన్ ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణను కొనియాడటంతో యెల్లో కూటమి ముఖాన కళ్లాపి చల్లినట్టయింది. రాష్ట్రానికి 14 లక్షల కోట్ల అప్పు ఉన్నదని ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో 10 లక్షల కోట్లని గవర్నర్ చేత చెప్పించారు. ఈ కుప్పిగంతులనూ, శ్వేత పత్రాల తప్పుడు తంతులనూ చీల్చి చెండాడుతూ వైసీపీ అధ్యక్షుడు ప్రెస్‌మీట్ పెడితే సమాధానం చెప్పడానికి ఏ యెల్లో మేధావీ ముందుకు రాకపోవడం గమనార్హం.
>
> ఇసుక మీద నసిగిన వాగుడెంత?... రాజేసిన రాద్ధాంతమెంత? అప్పుడే మరిచిపోతామా? ఇసుక ధరలు అప్పటికంటే ఇప్పుడే ఎక్కువయ్యాయని ఊరూవాడా గగ్గోలు పెడుతున్నది. ఈ పబ్లిక్ టాక్‌ను అడ్రస్ చేయడానికి ఒక్క సర్కారీ సిపాయి కూడా ఇంతవరకు సాహసించలేదు. లిక్కర్ పాలసీ మీద వెళ్లగక్కిన ప్రచారం సంగతి సరేసరి. ఇప్పటివరకైతే అదే పాలసీ కొనసాగుతున్నది. దీన్నే కొనసాగిస్తారో, లేదంటే బెత్తెడు దూరానికో బెల్టు షాపు సుగంధాలు వెదజల్లిన తమ పాతకాలపు పాత పాలసీకి వెళ్తారో వేచి చూడాలి.

విషప్రచారాల ప్రస్తావనలోకి వెళ్తే దానికి అంతూదరీ ఉండదు. ఇక మోసపూరిత హామీల సంగతి మరో మహేంద్రజాల అధ్యాయం. ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగించడంతో పాటు సూపర్ సిక్స్ పేరుతో ఒక షట్సూత్ర వాగ్దాన మాలను ఓటర్ల మెడలో వేశారు. యువకులందరికీ నెలకు 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. బడికెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి 15 వేల రూపాయలిస్తామన్నారు. ప్రతి రైతుకూ ఏటా 20 వేల ఆర్థిక సాయమన్నారు. 19 నుంచి 59 సంవత్సరాల మధ్యనున్న ప్రతి మహిళకు నెలకు 1500 అందజేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితమన్నారు. ప్రతి మహిళకూ ఉచిత బస్సు ప్రయాణమని నమ్మబలికారు.

ఇప్పటివరకు ఇందులో ఒక్కటి కూడా ప్రారంభం కాలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా తెలియదు. ఇది షట్సూత్ర హామీ కాదు షడయంత్ర ప్రయోగమని తేలడానికి ఎంతోకాలం పట్టలేదు. సాక్షాత్తూ శాసనసభలోనే స్వయంగా ముఖ్యమంత్రే 'సూపర్ సిక్స్' తూచ్ అని ప్రకటించారు. పైగా ఇది సాధ్యంకాదనే విషయాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని కూడా ఎమ్మెల్యేలను కోరారు. విష ప్రచారంతో, తప్పుడు హామీలతో ఓట్లడగడం కూడా ఓట్లను దొంగిలించడం కిందే లెక్క. వంచన కిందే లెక్క. రెండు రకాలుగా చోరీ చేసిన ఓట్లతోనే గద్దెనెక్కారు కనుక వారికి ప్రజల పట్ల బాధ్యత లేదనే విషయాన్ని వారే నిరూపించుకుంటున్నారు.

బాధ్యతల నుంచి తప్పుకోవడానికీ, హామీల అమలు కోసం జనం వీధుల్లోకి రాకుండా ఉండటానికే రెడ్‌బుక్ వ్యూహాన్ని అమలు చేస్తున్నారని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. శాసనసభలో విపక్ష నేతపై సభానాయకుడు వాడుతున్న భాష, వేస్తున్న నిందలు చాలా దిగజారిన స్థాయిలో ఉంటున్నాయి. హామీలు అమలుచేయపోతే ఎక్కడ తిరుగుబాటు వస్తుందోనన్న భయం ఆయన్ను వెంటాడుతున్నట్టు కనిపిస్తున్నది. 'ఒక్క వేలు చూపి ఒరులను నిందించ వెక్కిరించు నిన్ను మూడు వేళ్లు' అనే తెలుగు నానుడిని ఆయన గుర్తు చేసుకుంటే మేలు.

చంద్రబాబుకు కాళ్లు కడిగి కన్యాదానం చేసిన మామగారు ఎన్టీ రామారావు ఆయన గురించి ఏమన్నారో గుర్తు చేసుకుందామా? ''చంద్రబాబు దుర్మార్గుడు... మేకవన్నె పులి, గాడ్సేనే మించినవాడు, అభినవ ఔరంగజేబు, అతడో మిడత. మూర్తీభవించిన పదవీకాంక్షాపరుడు, ప్రజాస్వామ్య హంతకుడు, కుట్రకు కొలువైనవాడు, గూడుపుఠాణీకే గురువు, మోసానికి మూలస్తంభం, గుండెల్లో చిచ్చుపెట్టినవాడు, గొడ్డుకన్నా హీనం, చీమల పుట్టలో పాములా చేరినవాడు... తమ్ముళ్లారా! చెల్లెళ్లారా! ఇదిగో మీ అన్నగా చెబుతున్నాను.'' ఇవన్నీ ఎన్టీఆర్ డైలాగులే. ఆన్ రికార్డ్!

vardhelli1959@gmail.com

పీడిత ప్రజల విముక్తి కోసం...

కమ్యూనిస్టు విప్లవోద్యమ అగ్రనాయకుల్లో ఒకరైన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి రహస్యజీవితం గడుపుతూ 1976 జూలై 28న అనారోగ్యంతో అమరులయ్యారు. భారత విప్లవ రాజకీయ రంగంలో 35 ఏళ్లకు పైగా వెలుగొంది 'టీఎన్'గా సుపరిచితులై పీడిత ప్రజల హృదయాలలో ఆయన శాశ్వత స్థానం సంపాదించారు.

కా॥ తరిమెల నాగిరెడ్డి 1917 ఫిబ్రవరి 11న అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో పుట్టారు. తాను భూస్వామ్య కుటుంబంలో జన్మించినా దేశంలో కొనసాగుతున్న ఫ్యూడల్ దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయటానికి, దోపిడీ పీడనలులేని సమ సమాజస్థాపనకు తన సర్వస్వాన్ని అర్పించి దేశ వ్యాప్తంగా విశేష ప్రజాదరణ పొందారు.



నేడు తరిమెల నాగిరెడ్డి వర్ధంతి

విద్యార్థి దశలోనే బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. బెనారసు విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘానికి అధ్యక్షునిగా 1939లో ఎన్నికైన తొలి ఆంధ్రుడు ఈయనే. బెనారసు విశ్వవిద్యాలయంలోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. లా చదువుకు స్వస్తిచెప్పి ఎం.ఏ. పట్టాతో విశ్వవిద్యాలయాన్ని వదలగానే యువకులను ఉద్యమాల్లోకి సమీకరించే కృషిని ప్రారంభించారు. కార్మికులు, రైతాంగం కొరకు ఉద్యమించారు. 1940లో 'యుద్ధం దాని ఆర్థిక ప్రభావం' అన్న చిన్న పుస్తకాన్ని ప్రచురించి నందుకు 23 ఏండ్ల యువకునిగా ఉన్నప్పుడే బ్రిటిష్ ప్రభుత్వం విధించిన ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

తన కంచుకంఠంతో పండిత పామరులను ఉర్రూతలూగించి కమ్యూనిస్టు విప్లవ రాజకీయాలను దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటులో ఆయన ఉపన్యాసాలను అధికార, ప్రతిపక్ష సభ్యులు ఆసక్తితో, శ్రద్ధతో వినేవారు.

భారత విప్లవోద్యమ రంగంలో కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ)తో కలిసి మన దేశ పీడిత ప్రజల విముక్తికి అవసరమైన సరైన విప్లవపంథాను రూపకల్పన చేయడంలో, ఈ విప్లవ పంథాను దేశమంతటా ప్రచారంచేసి వ్యాపింపచేయటంలో టీఎన్ చారిత్రాత్మకమైన పాత్ర నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆయన పాలకుల తీవ్రనిర్బంధానికి గురయ్యారు. అరెస్టులు, జైలు శిక్షలు, అజ్ఞాతవాసాలకు వెరువలేదు. ఆయన పైనా, మరో 60మందిపైనా పెట్టిన కుట్రకేసు విచారణ సందర్భంగా జైలులో ఉన్నప్పుడు (1970–72) ఆయన భారత ఆర్థిక వ్యవస్థపై 'తాకట్టులో భారత దేశం' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారు. దానిని కోర్టులో ఒక ప్రకటన రూపంలో చదివారు. సరైన మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణతో ఆ పుస్తకంలో ఆయన చేసిన నిర్ధారణలు నేటికీ అక్షరసత్యాలే. అవి కమ్యూనిస్టు విప్లవకారులకు, ప్రజాతంత్రశక్తులకూ భావి కార్యాచరణకు మార్గదర్శక సూత్రాలుగా పనిచేస్తాయి.

1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తన బావ సంజీవరెడ్డిని ఓడించి అనంతపురం శాసనసభ్యునిగా తొలిసారిగా ఎన్నికయ్యారు. 35 ఏళ్ళ వయస్సులోనే మద్రాసు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా తన రాజకీయ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించారు. 1969 మార్చిలో తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామాచేసి అసెంబ్లీలో సంచలనాత్మకమైన ఉపన్యాసాన్ని ఇచ్చారు. పాలకవర్గాలు దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకు తాకట్టు పెడ్తూ వారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధానాలను, భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను అనుసరిస్తున్నారని అన్నారు. దేశాభివృద్ధికంటే రక్షణ చర్యలకే ప్రాధాన్యతనిస్తూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని నివారించే చర్యలను అసెంబ్లీ, పార్లమెంటు చేపట్టకుండా ఈ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచే ప్రజావ్యతిరేక విధానాలను అవి అవలంబిస్తున్నాయని చెప్తూ ''జనాల్ని కదిలిస్తే తప్ప పాలకుల దోపిడీ, దౌర్జన్యాలు అంతం'' కావని వ్యాఖ్యానించారు.

1975లో డీవీతో కలిసి యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్) ను స్థాపించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తన జీవితకాలమంతటా అత్యున్నత విప్లవ ప్రమాణాలను పాటించారు. ఆయన స్మృతి నిరంతరం ప్రజలను విప్లవ కర్తవ్యోన్ముఖులను చేస్తూనే వుంటుంది.

సి. భాస్కర్ I యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)

ధర్మం దేవుని రూపం!

పూర్వం ఒక ముని ఉండేవారు. ఆయన అన్నింటినీ త్యజించిన వారు. తాను పరమజ్ఞాని అని అనుకునేవారు. ఒంటి పూటే భోజనం. అదీనూ చప్పిడి ఆహారమే. అబద్ధాలంటే అస్సలు గిట్టదు. అంతే కాదు, అబద్ధం చెప్పే వారింట అన్నం మెతుకు ముట్టరు. ఒకరోజు ఆయన ఒక ఊరుకు వెళ్ళారు. ఆ ఊళ్ళో నిజాయితీపరుడెవరని వాకబు చేశారు. అప్పుడు కొందరు ఓ బంగళా చూపిస్తూ... ఆ ఇంటి యజమాని ఎంతో నిజాయితీపరుడనీ, ధనవంతుడనీ, ఆయనకు నలుగురు పిల్లలనీ వివరాలు చెప్పారు. ముని ఆ ఇంటికి వెళ్లారు. యజమాని సాష్టాంగ నమస్కారం చేసి ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరాడు. ఆయన అణకువ, మాటల తీరు నచ్చిన ముని ఆతిథ్యం స్వీకరించడానికి ఒప్పుకున్నారు. అయితే అతడి నిజాయితీని పరీక్షించాలనుకున్నారు. 'నీ దగ్గర ఎంత డబ్బుంద'ని అడిగారు. అందుకు యజమాని తన దగ్గర ఇరవై రెండు వేల వరహాలు ఉన్నాయన్నాడు. పిల్లలు ఎంత మంది అన్న ప్రశ్నకు ఒక్కడే కొడుకన్నాడు. వయస్సు ఎంత అన్న ప్రశ్నకు 'నాలుగు సంవత్సరాల అయిదు నెలల ఏడు రోజుల పదకొండు గంటల'న్నాడు. అతని మాటలన్నీ విన్న మునికి కోపం వచ్చింది. 'నువ్వు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలు. కనుక నీ ఇంట ఆతిథ్యం స్వీకరిస్తే నా దీక్ష భగ్నమవుతంద'న్నారు. ఆ గృహస్థు 'స్వామీ నాకు అబద్ధం చెప్పడం రాదు, నేను చెప్పినవన్నీ ముమ్మాటికీ నిజం' అంటూ తన జమాపద్దుల పుస్తకాన్ని చూపించాడు. ఆ పుస్తకం ప్రకారం ఆయన వద్ద మిగిలి ఉన్నవి లక్ష వరహాలు. అది చూసిన ముని, 'మరి నువ్వు ఇరవై రెండు వేల వరహాలు ఉన్నాయన్నావుగా, అంటే నువ్వు చెప్పింది అబద్ధమేగా'అని ప్రశ్నించారు. అప్పుడు గృహస్థు 'స్వామీ, లక్ష వరహాలు ఉన్నా నేను ధర్మం చేసినవి ఇరవై రెండు వేలే. అది భగవంతునికి నేను అర్పించిన నైవేద్యం. అదే నా నిజమైన డబ్బు' అన్నాడు.

అందుకు ముని ఆశ్చర్యంతో 'నీకు నలుగురు పిల్లలని విన్నానే 'అన్నారు. 'నాకు నలుగురు కొడుకులు. కానీ వారిలో ఒక్కడే నేనేం చెప్పినా స్పందిస్తాడు. కనుక ఆ ఒక్కడే నా కొడుకు. మిగిలిన ముగ్గురూ ఈ భూమికి భారమే' అన్నాడు. మరి వయస్సు సంగతేమిటీ అని అడిగారు ముని. 'స్వామీ, నేను ఒక రోజుకి గంటన్నర మాత్రమే దైవప్రార్థన చేస్తున్నాను. మిగిలిన సమయమంతా ఈ శరీరం కోసం శ్రమిస్తున్నాను. అంటే భగవంతుడికి వెచ్చిస్తున్న సమయమే నా వయస్సు' అన్నాడు. అతని ప్రతి సమాధానంలోనూ దైవ స్ఫూరక నిజాయితీ ద్యోతకమవ్వడంతో సంతృప్తి చెందిన ముని ఆ ఇంట ఆతిథ్యం స్వీకరించారు. గృహస్థు మాటల అంతరార్థాన్ని గ్రహించలేని తాను జ్ఞానిని ఎలా అవుతాననే ఎరుక ఆయనలో అంకురించింది.

జ్యోతిర్మయం

– యామిజాల జగదీశ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాలపై ఆంక్షలా?

● డీజీపీకి మానవ హక్కుల వేదిక లేఖ


జీవన్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ప్రజాస్వామిక విప్లవ, ఉద్యమాలకు సంబంధించిన సమావేశాలపై చిక్కడపల్లి పోలీసులు ఆంక్షలు విధించడంపై పలు ప్రజా సంఘాలు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. శనివారం మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ వి.వసంతలక్ష్మి తెలంగాణ డీజీపీ జితేందర్‌కు లేఖరాశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశాలు నిర్వహించడానికి ముందుగా చిక్కడపల్లి పోలీసుల అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచించడంతో సుందరయ్య భవన్ ట్రస్ట్ యాజమాన్యం మీటింగ్ హాల్స్ బుక్ చేసుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై మానవ హక్కుల వేదిక కన్వీనర్ జీవన్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా గత 35 సంవత్సరాలకు పైగా ప్రజాస్వామ్యబద్ధంగా నడుపుకుంటున్న సభలు, సమావేశాలకు ఆంక్షలు విధించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పునరుద్ధరణకు కృషి చేస్తామని, పౌర స్వేచ్ఛను, పౌర హక్కులను కాపాడుతామని ప్రకటించిందని వారు గుర్తు చేశారు. ఈ విషయంలో డీజీపీ జోక్యం చేసుకోవాలని కోరారు.

రేవంత్ నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం సరికాదు

● కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడం సరికాదని, అభ్యంతరాలున్న పక్షంలో ఆ సమావేశంలో ప్రస్తావించడానికి ఉన్న అవకాశాన్ని కోల్పోయారని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ, పునరుత్పాదకశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పును సరిదిద్దుకోవాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 2010 బడ్జెట్‌లో కేవలం యూపీ, బిహార్ రాష్ట్రాల పేర్లు మాత్రమే ప్రస్తావించిందని వ్యాఖ్యానించారు. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యూపీఏ హయాంలో ఉమ్మడి ఏపీ రాష్ట్రానికి కేవలం ఆరు వేల కోట్ల రూపాయల గ్రాంటు ఇస్తే..ఎన్డీయే ప్రభుత్వంలో రూ.26 వేల కోట్లు ఇచ్చామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణకు అత్యధిక నిధులు కేటాయిస్తున్నట్టు వివరించారు. 'రాజకీయం చేయాలని అనుకుంటే ఎలా.. ఇప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు లేవు. గతంలో బీఆర్‌ఎస్ ఇలా చేస్తేనే..అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వారి స్థానం ఏమిటో ప్రజలు చూపించారు. సీఎం రేవంత్ నాకు బాగా తెలుసు. నన్ను కలిసినప్పుడు ఆయన కోరిన వాటిని వెంటనే పరిష్కరించా. ఆయన కృతజ్ఞత కూడా చెప్పారు' అని ప్రహ్లాద్ జోషి తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ కూడా రాజకీయం కోసం ఇలా అబద్ధాలు చెప్పిందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సీఎం ప్రయత్నించాలని లేనిపక్షంలో ఆయనకు కూడా బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందని వ్యాఖ్యానించారు. ట్రిపుల్ ఆర్ హైదరాబాద్‌కు గేమ్‌ఛేంజర్ అవుతుందన్నారు. ప్రభుత్వం భూమి కేటాయిస్తే మరిన్ని రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

కేంద్రానికి వ్యతిరేక తీర్మానం దుర్మార్గం

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం


అక్షయతో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్/గంగాధర (చొప్పదండి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేశారంటూ అసెంబ్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానం చేయడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ తీర్మానం చేసిందని ధ్వజమెత్తారు. శనివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.లక్షా 9 వేల కోట్ల నిధులు కేంద్రం నుంచి వచ్చేవే అయినప్పుడు.. తెలంగాణకు పైసా ఇవ్వలేదని ఎలా తీర్మానం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం రూ.2 లక్షల 91వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు, అప్పుల రూపేణా కేంద్రం రూ.లక్షా 9వేల కోట్ల నిధులిస్తోందని గుర్తుచేశారు. విభజన చట్టం హామీలపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చేస్తున్న ప్రచారంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్రాన్ని బదనాం చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎంకు ముఖం లేకనే నీతి ఆయోగ్ సమావేశానికి డుమ్మా కొట్టారని బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ చేసిన తప్పులే రేవంత్ చేస్తున్నారని ఆరోపించారు.

హాస్టల్‌లో చేర్పిస్తా.. చదుకుంటావా?

'హాస్టల్‌లో చేర్పిస్తా.. ఉన్నత చదువులు చదువుకుంటావా'అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఓ బాలికను ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చర్లపల్లి గ్రామ సమీపం నుంచి ఆయన వెళుతుండగా పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు కనిపించగానే తన కాన్వాయ్ ఆపేశారు. కారులోంచి దిగి కూలీల వద్దకు వెళ్లి వారితో కాసేపు మాట్లాడాడు. ఇందులో పదో తరగతి వరకు చదివి కూలీ పనులు చేస్తున్న బాలిక బోళ్ల అక్షయ గురించి ఆరా తీశారు. 'నీకు చదువు ఇష్టం లేదా?'అని ప్రశ్నించారు. తమ కుటుంబ పరిస్థితి బాగోలేక కూలి పనులు చేయాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే ఆయన అక్కడే ఉన్న బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని పిలిచి.. బాలికను కాలేజీలో చేర్పించాలని సూచించారు. అవసరమైతే హాస్టల్‌లో చేర్పించి మంచి విద్య అందేలా చూడాలని చెప్పారు. దీంతో అక్షయ.. బండి సంజయ్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది.

కులగణన హామీ నిలబెట్టుకోవాలి: జాజుల


సభలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, ఆదిలాబాద్: కులగణన సాధ్యం కాదని, ఓటరు గణన చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని బీసీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమగ్ర కులగణన సాధన యాత్ర బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% పెంచుతామని కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విషయాన్ని కాంగ్రెస్ మరిచిపోకూడదన్నారు. ఈ విషయంలో కప్పదాటు వైఖరి అవలంబిస్తే ఆ పార్టీని బీసీలు ఎప్పటికీ నమ్మరని, రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా ఆగస్టులో లక్ష మందితో హైదరాబాద్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు రూల్స్‌కు వ్యతిరేకం: ఆర్.కృష్ణయ్య



చిక్కడపల్లి (హైదరాబాద్): ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ గర్వంతో చేసిన వ్యాఖ్యలు సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. శనివారం అశోక్‌నగర్‌లో బాలలతకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పదవిలో కొనసాగుతూ బాధ్యతారహితంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ వ్యాఖ్యలు దివ్యాంగులనే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించే విధంగా ఉన్నాయన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

● ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి


ధర్నాలో అభివాదం చేస్తున్న కూనంనేని సాంబశివరావు, చెరుపల్లి సీతారాములు, చేనేత సంఘాల నాయకులు

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'మగ్గం నడవాలి – నేతన్న బతకాలి' నినాదంతో ధర్నా చేపట్టారు. వ్యవసాయరంగం తరువాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, చేనేత కార్మికులకు విద్యుత్, గ్యాస్ సబ్సిడీ ఇవ్వడంతోపాటు పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని వీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించి తగిన న్యాయం చేస్తామని కూనంనేని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ నేతలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యార్న్ డిపోలను ఏర్పాటు చేసి 20 శాతం సబ్సిడీని అందించి, వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని, పవర్‌లూమ్ టెక్స్‌టైల్స్ పార్కులను పూర్తి చేసి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలకు కావల్సిన వస్త్రాలతోపాటు బతుకమ్మ చీరల పథకాన్ని అమలు చేయాలన్నారు.

తాను చనిపోతే తల్లిని చూసేవారు లేరని హత్య

● ఆపై ఉరివేసుకుని కుమారుడి ఆత్మహత్య
● ఇద్దరికీ మానసిక, ఇతర అనారోగ్య సమస్యలు
● కొత్తగూడెం బూడిదగడ్డలో విషాదం


తుల్జాకుమారి


వినయ్‌కుమార్

కొత్తగూడెంఅర్బన్: తల్లీకొడుకులిద్దరూ మానసిక వ్యాధితో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో తాను మరణిస్తే తల్లిని చూసేవారు ఎవరూ ఉండరన్న ఆవేదనతో కుమారుడు తల్లిని హత్య చేసి.. ఆ తర్వాత తానూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో శని వారం ఈ విషాద ఘటన వెలుగు చూసింది. పట్టణంలోని బూడిదగడ్డ ప్రాంతానికి చెందిన తుల్జాకు మారి పాసి (59)కి హారతిపాసి, వినయ్‌కుమార్ పాసి(28) ఇద్దరు సంతానం. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా కూతురు హారతికి పదేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం తల్లీకొడుకులు మాత్రమే ఇంట్లో ఉంటున్నారు. తుల్జాకుమారి కొంతకాలంగా మానసిక రుగ్మతతో బాధపడుతోంది. వినయ్ కూడా అనారోగ్య సమస్యలతో బేకరీ లో పని మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. కూతురు హారతి కుటుంబం వారికి సమీపంలోనే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వినయ్‌కుమార్ ఇనుప రాడ్‌తో తల్లిని కొట్టి హత్యచేసి, తాను కూడా ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రక్తపుమడుగులో తుల్జాకుమారి..

అమ్మమ్మ, మేనమామకు టిఫిన్ ఇచ్చేందుకు హారతి కూతురు సునన్య శనివారం ఉదయం 10.30 గంటలకు తుల్జాకుమారి ఇంటికి వచ్చింది. ఆమె తలుపు తీసి చూడగా తుల్జాకుమారి రక్తపుమడుగులో పడి ఉంది. వినయ్‌కుమార్ ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక వెళ్లి తల్లిదండ్రులకు చెప్పగా.. వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, త్రీటౌన్ పోలీసులు చేరుకుని ఘటనను పరిశీలించారు. ఇనుపరాడ్ తో కొట్టడం వల్ల తుల్జాకుమారి తలకు తీవ్ర గాయ మై మృతి చెందిందని గుర్తించారు. మృతదేహాలకు పోస్టుమార్టమ్ నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. హారతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ 9వ భేటీలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ.

'వికసిత భారత్' సాకారంలో...
రాష్ట్రాలదే కీలక పాత్ర: మోదీ

న్యూఢిల్లీ: 2047 కల్లా వికసిత భారత్ కలను సాకారం చేసుకోవడంలో రాష్ట్రాలది ప్రధాన పాత్ర అని ప్రధాని నరేంద్ర మోదీ అభి ప్రాయపడ్డారు. రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెం దినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంద న్నారు. ''పేదరిక నిర్మూలనే మన లక్ష్యం కావాలి. గ్రామం మొదలుకుని రాష్ట్రస్థాయి దాకా ఆ దిశగా కార్యాచరణ ఉండాలి. ఇం దుకు ప్రతి జిల్లా, రాష్ట్రం 2047కు విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకోవాలి. జిల్లా, బ్లాక్, గ్రామ స్థాయి దాకా వికసిత్ భారత్ ఆకాంక్ష చేరాలి'' అని సూచించారు. నీతి ఆయోగ్ పాలక మండలి 9వ భేటీ శనివారం జరిగింది. కేంద్ర మంత్రులతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల గవర్నర్లు తదితరులు పాల్గొ న్నారు. భేటీకి సారథ్యం వహించిన మోదీ మాట్లాడుతూ దేశాభివృద్ధే లక్ష్యంగా పాల నలో కేంద్ర, రాష్ట్రాలు కలిసి సాగాలని అభి లషించారు. ''ఇది సాంకేతిక మార్పుల దశా బ్ది. ఎదిగేందుకు అపారమైన అవకాశాలు న్నాయి. వాటిని రాష్ట్రాలు అందిపుచ్చు కోవాలి. పెట్టుబడులను ఆకర్షించాలంటే శాం తిభద్రతలు, సుపరిపాలన, మౌలిక సదుపా యాలు చాలా కీలకం. జల వనరుల సమర్థ వినియోగానికి రివర్ గ్రిడ్లు ఏర్పాటు చేసుకో వాలి'' అని సూచించారు. ముఖ్యమంత్రులు తమ అవసరాలు, ప్రాథమ్యాలను వివరిం చారు. పేదరిక నిర్మూలన (జీరో పావర్టీ) లక్ష్యాలను సాధించిన గ్రామాలను పేదరికర హిత గ్రామాలుగా ప్రకటిస్తామని నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం మీడియాకు వెల్లడించారు. భేటీలో చర్చించిన విషయా లపై 45 రోజుల్లో 'విజన్ ఇండియా 2047' డాక్యుమెంట్‌ను సిద్ధం చేస్తామని తెలిపారు.

ఘోరంగా అవమానించారు

మాట్లాడుతుంటే మైక్ కట్ చేశారు: మమత



- నీతి ఆయోగ్ భేటీ నుంచి వాకౌట్
- పని చేసేది మేం, పెత్తనం మీదా?
- కేంద్రంపై బెంగాల్ సీఎం మండిపాటు
- నీతి ఆయోగ్ భేటీలకు రాబోనని ప్రకటన
- ఖండించిన కేంద్రం.. విపక్షాల సంఘీభావం
- హెడ్‌లైన్లలో నిలిచేందుకే వాకౌట్: బీజేపీ
- నితీశ్ గైర్హాజరు, సర్వత్రా అనుమానాలు

న్యూఢిల్లీ/కోల్‌కతా/పట్నా: నీతి ఆయోగ్ సమావేశం రాజకీయ దుమారానికి కారణం గా మారింది. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేం ద్ర మోదీ సారథ్యంలో జరిగిన ఈ భేటీలో తనకు ఘోర అవమానం జరిగిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాం గ్రెస్ అధినేత్రి మండిపడ్డారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ భేటీ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఢిల్లీలో, ఆ తర్వాత కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లా డారు. ఇతర సీఎంలకు 10 నుంచి 20 నిమి షాలు సమయమిచ్చి తనకు మాత్రం 5 నిమి షాలకే మైక్ కట్ చేశారని ఆరోపించారు. ''కేంద్రంపై పెద్దగా ఆశలు లేకపోయినా సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేయాలనే సదుద్దేశంతో భేటీకి వచ్చా. విపక్ష పాలిత రాష్ట్రాల నుంచి హాజరైన ఏకైక సీఎంను నేనే. ఆంధ్రప్రదేశ్ సీఎంకు 20 నిమిషాలిచ్చారు. గోవా, అసోం, ఛత్తీస్‌గఢ్ తదితర సీఎంలకు కూడా 10 నుంచి 12 నిమిషాల దాకా ఇచ్చారు. నన్ను మాత్రం ఐదు నిమిషాల కం టే మాట్లాడనివ్వలేదు. పైగా ఆ ఐదు నిమిషా ల్లోనూ పదేపదే బెల్లు కొడుతూ దారుణంగా అవమానించారు. భేటీని పర్యవేక్షించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పదేపదే బెల్లు కొట్టారు. పక్కనే కూర్చున్న మోదీ, కేంద్ర హోం మంత్రి సూచన మేరకే ఆయనలా చేశారు. దీనికి నిరసనగా వాకౌట్ చేశా'' అని వివరించారు. ఇకపై నీతి ఆయోగ్ భేటీలకు ఎప్పటికీ హాజరు కాబోనని ప్రకటించారు.

మైక్ కట్ చేయలేదు: నిర్మల

మమత ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చిం ది. ఆమెకు కేటాయించిన సమయం మేరకు పూర్తిగా మాట్లాడారని పేర్కొంది. ''నిజానికి అక్షరక్రమంలో మమత లంచ్ అనంతరం మాట్లాడాల్సింది. కానీ ఆమె అర్జెంటుగా కోల్ కతా తిరిగి వెళ్లాల్సి ఉందన్న బెంగాల్ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు అంతకుముందే ఏడో వక్తగా అవకాశమిచ్చాం. మమతకు కేటా యించిన సమయం పూర్తయిందని కేవలం అందరి ముందూ ఉన్న స్క్రీన్లపై కన్పించింది. అంతే తప్ప టైం అయిపోయిందంటూ ఎవరూ బెల్ కూడా మోగించలేదు'' అని వివ రణ ఇచ్చింది. మమత పూర్తి సమయం మేరకు మాట్లాడారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ''మధ్యలో మైక్ కట్ చేయడం నిజం కాదు. ఎవరెం తసేపు మాట్లాడుతున్నదీ మా ముందున్న స్క్రీన్లపై కనిపిస్తూనే ఉంది. కొందరు సీఎం లు కేటాయించిన సమయం కన్నా ఎక్కువగా మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు అదనపు సమయం కేటాయించాం. అంతే తప్ప ఎవ రికీ, ముఖ్యంగా బెంగాల్ సీఎంకు మైకు కట్ చేయలేదు'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

కేంద్రానిది రాజకీయ వివక్ష

విపక్ష పాలిత రాష్ట్రాల పట్ల కేంద్రం దారుణ మైన రాజకీయ వివక్ష కనబరుస్తోందని మమత ఆరోపించారు. ''ఈ వివక్ష కేంద్ర బడ్జెట్‌లో కూడా కొట్టొచ్చినట్టు కన్పించింది. ఈ వైనాన్ని భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలోనే లేవనెత్తా. వారికి కొన్ని రాష్ట్రాల పట్ల ప్రత్యేక శ్రద్ధ ఉంటే ఉండొచ్చు. వాటికి ఎక్కువ నిధులు కేటాయించడంపైనా నాకు అభ్యంతరం లేదు. కానీ బెంగాల్ తదితర రాష్ట్రాలపై మాత్రం ఎందుకిలా వివక్ష చూపు తున్నారని ప్రశ్నించా. దీనిపై సమీక్ష జర గాలని డిమాండ్ చేశా. అన్ని రాష్ట్రాల తర ఫునా భేటీలో మాట్లాడా'' అని తెలిపారు. ''నీతి ఆయోగ్‌కు ఎలాంటి ఆర్థిక అధికారా లూ లేవు. దానికి అధికారాలన్నా ఇవ్వాలి. లేదంటే ప్రణాళిక సంఘాన్నే పునరుద్ధరించా లి'' అని డిమాండ్ చేశారు. ''ఉపాధి హామీ వంటి పలు కీలక కేంద్ర పథకాల అమలును బెంగాల్లో మూడేళ్లుగా నిలిపేయడాన్ని భేటీలో ప్రస్తావించా. స్వపక్షం, విపక్షాల మధ్య కేంద్రం ఇలా వివక్ష చూపుతుంటే దేశం ఎలా నడుస్తుంది? అధికారంలో ఉన్నప్పుడు అందరి మేలూ పట్టించుకోవాలి'' అన్నారు.

అధికార, విపక్షాల పరస్పర విమర్శలు

కాంగ్రెస్‌తో పాటు పలు విపక్షాలు మమతకు సంఘీభావం ప్రకటిం చాయి. విపక్ష నేత అన్న ఒకే ఒక్క కార ణంతో ఏకంగా ముఖ్యమంత్రినే ఇం తగా అవమానించడం దారుణమని మండిపడ్డాయి. దీన్ని ఎంతమాత్రమూ అంగీకరించలేమని కాంగ్రెస్ పేర్కొంది. కేంద్రం తీరును తీవ్రంగా ఖండిస్తు న్నట్టు స్టాలిన్ (తమిళనాడు) సహా విపక్ష పాలిత రాష్ట్రాల సీఎంలు **అన్నారు. ఈ ఆరోపణలను బీజేపీ తోసి** పుచ్చింది. కేవలం మీడియాలో పతాక శీర్షికల్లో నిలిచేందుకే ముందుగా నిర్ణయించుకుని మరీ మమత ఇలా వాకౌట్ చేశారని కేంద్ర మంత్రులు అర్జు న్‌రాం మేఘ్వాల్, ప్రహ్లాద్ జోషీ తదిత రులు విమర్శించారు. బెంగాల్ పీసీసీ చీఫ్ అధీర్ రంజన్ చౌధరి మాత్రం మమత కావాలనే డ్రామా చేశారంటూ కొట్టిపారేయడం విశేషం.

"సహకారాత్మక సమాఖ్య వ్యవస్థ అంటే ఇదేనా? సీఎంతో ప్రవర్తించే తీరిదేనా? మన ప్రజాస్వామ్యంలో విపక్షాలు కూడా అంతర్గత భాగమని కేంద్రంలోని బీజేపీ సర్కారు అర్థం చేసుకోవాలి. శత్రువుల్లా చూడటం ఇకనైనా మానుకుంటే మంచిది"
- తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్

"మన దేశంలో పతాక శీర్షికలకు ఎక్కడం చాలా తేలిక. ఏకైక నీతి ఆయోగ్ భేటీలో పాల్గొన్న ఏకైక విపక్ష సీఎం నేనే అని ముం దుగా చెప్పాలి. బయటికొచ్చి, 'నా మైక్ కట్ చేశారు. అందుకే బాయ్‌కాట్ చేశా' అని చెప్పాలి. ఇక రోజంతా టీవీలు దీన్నే చూపి స్తాయి. పని చేయాల్సిన, చర్చించాల్సిన అవసరం లేదు. ఇదీ దీదీ తీరు!"
- బీజేపీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్



నితీశ్ అసంతృప్తి?

10 మంది సీఎంల గైర్హాజరు

నీతిఆయోగ్ భేటీకి విపక్ష ఇం డియా కూటమి సీఎంలతో పాటు పాలక ఎన్డీఏ సంకీర్ణంలో కీలక భాగస్వామి అయిన బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా డుమ్మా కొట్టడం విశేషం . ఆయన బదులు ఉప ముఖ్యమం త్రులు సమ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా పాల్గొన్నారు. ఆయన కోరుతు న్నట్టుగా బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్రం ఇటీవలే స్పష్టం చేయడం తెలిసిందే. దీనిపై అసంతృ ప్తితోనే భేటీకి నితీశ్ దూరంగా ఉన్నట్టు భావిస్తున్నారు. అయితే ఆయన గైర్హాజ రుకు పెద్ద ప్రాధాన్యమేమీ లేదని జేడీ(యూ) పేర్కొంది. గతంలో కూడా నితీశ్ పలుమార్లు నీతిఆయోగ్ భేటీకి గైర్హాజరయ్యారని గుర్తు చేసింది. కేంద్ర బడ్జెట్లో విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపారని ఆరోపిస్తూ తెలంగాణ, కర్నా టక తమిళనాడు, కేరళ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, జార్ఖండ్, పాం డిచ్చేరి సీఎంలు కూడా భేటీకి దూరంగా ఉన్నారు. ''10 రాష్ట్రాల సీఎంలు భేటీకి రాలేదు. అది ఆయా రాష్ట్రాలకే నష్టం'' అని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం అన్నారు. ''మమత సమయం పూర్తవగానే రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మైక్‌పై తట్టారు. వెం టనే ఆమె మాట్లాడటం ఆపేసి వాకౌట్ చేశారు'' అని ఆయన వివరించారు. బిహార్ అసెంబ్లీ సమావేశాల కారణం గా నితీశ్ రాలేకపోయారన్నారు.

డెమొక్రటిక్ అభ్యర్థిగా కమల

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ

- అభ్యర్థిత్వాన్ని నిర్ధారించే పత్రాలపై సంతకాలు
- వచ్చే నెల 1న హారిస్‌ను తమ నామినీగా ఎన్నుకోనున్న డెమొక్రటిక్ ప్రతినిధులు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పోటీ చేయబోతున్నట్లు దాదాపు తేలిపోయింది. డెమొక్రటిక్ పార్టీ నుంచి తన అభ్యర్థిత్వాన్ని నిర్ధారించే అధికారిక పత్రాలపై ఆమె సంతకాలు చేశారు. తమ అభ్యర్థిగా కమలా హారిస్ పేరును డెమొక్ర టిక్ పార్టీ తరఫున అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటివరకు పార్టీలో కమలా హారిస్ మినహా ఇతరులెవరూ అభ్యర్థిత్వం కోసం పోటీపడలేదు. డెమొక్రటిక్ నేషనల్ కమిటీ నిబంధనల ప్రకారం ఆగస్టు 1న పార్టీ ప్రతినిధులు వర్చువల్ సమావేశంలో తమ నామి నీని ఎన్నుకోవాల్సి ఉంటుంది. పార్టీలో ఇతరులు పోటీ పడకపోతే కమలా హారిస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం లాంఛనమే. అలాగే ఆగస్టు 7లోగా ఆమె తమ ఉపాధ్యక్ష అభ్యర్థిని(రన్నింగ్ మేట్) ఎంపిక చేసుకోవాల్సి ఉంది. షికాగోలో ఆగస్టు 19 నుంచి 22 వరకు డెమొక్ర టిక్ జాతీయ సదస్సు జరుగుతుంది.

నవంబర్ 5న జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై విజయం తనదేనని కమలా హారిస్ మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసం పొందడానికి, ప్రతి ఓటునూ సంపాదించడానికి కష్ట పడి పని చేస్తానని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రజలకు మరింత చేరువ య్యేలా ప్రచారం సాగిస్తానని, వారి మద్దతుతో రాబోయే ఎన్నికల్లో అద్భుతమైన విజయం సాధిస్తానని పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్లు జో బైడెన్ గత ఆదివారం ప్రకటించిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలా హారిస్ తెరపైకి వచ్చింది. ఆమె ప్రచారం కూడా ప్రారంభిం చారు. ఇప్పటికే 40కిపైగా రాష్ట్రాల డెమొక్రటిక్ ప్రతినిధులు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు.

ట్రంప్‌కు సమఉజ్జీగా...

న్యూయార్క్ టైమ్స్ పోల్ వెల్లడి

జో బైడెన్ నిష్క్రమణలో అర్ధాంతరంగా అమెరికా అధ్యక్ష రేసులోకి వచ్చినప్పటికీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అనూ హ్యంగా పుంజుకుంటున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రం ప్‌తో సమానంగా కమల ప్రజామోదాన్ని పొందుతున్నారని న్యూయార్క్ టైమ్స్– సియానా కాలేజ్ తాజా పోల్ పేర్కొంది. సర్వేలో పాల్గొన్న అమెరికా ఓటర్లలో 48 శాతం మంది ట్రంప్ వైపు మొగ్గగా, 47 శాతం మంది కమలా హారిస్‌కు మద్దతు తెలిపారు. ఇదే న్యూయార్క్ టైమ్స్ పత్రిక జూలై మొదటివారంలో నిర్వహిం చిన సర్వేలో బైడెన్‌పై ట్రంప్ ఏకంగా ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించారు. దీన్ని హారిస్ ఒక పాయింటుకు తగ్గించడం గమనా ర్హం. రిజిస్టర్డ్ ఓటర్లలో ట్రంప్‌కు 48 శాతం, హారిస్‌కు 46 శాతం మద్దతు లభించింది.

సొంత పార్టీల్లో సమాన మద్దతు

రిపబ్లికన్లలో ట్రంప్‌ను 93 శాతం మంది బలపరుస్తుండగా, కమలా హారిస్‌కు సైతం డెమొక్రాట్లలో 93 శాతం మద్దతు లభిం చడం విశేషం. శ్వేతజాతియేతర, యువ ఓటర్లలో బైడెన్‌కు పెద్దగా ఆదరణ ఉండేది కాదు. ఇప్పుడు హారిస్‌కు ఈ వర్గాల మద్దతు లభి స్తోందని సర్వే తెలిపింది. లాటిన్ అమెరికా మూలాలున్న ఓటర్లు, 30 ఏళ్ల లోపు ఓటర్లలో హారిస్‌కు 60 శాతం మద్దతు లభించింది.

సరిహద్దుల్లో పాక్ దుశ్చర్య..
తిప్పికొట్టిన బలగాలు

- ఒక పాకిస్తానీ హతం.. మరో ఇద్దరు పరారీ
- ఒక జవాను మృతి, కెప్టెన్ సహా నలుగురికి గాయాలు

న్యూఢిల్లీ/శ్రీశ్రీనగర్: సరిహద్దుల్లో పాకిస్తాన్ బోర్డర్ యాక్షన్ టీం(బ్యాట్) దాడికి చేసిన ప్రయత్నాన్ని భారత బలగాలు తిప్పి కొట్టాయి. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన ఎదురుకాల్పుల్లో ఒక పాకిస్తానీ యుడు హతం కాగా, మరో ఇద్దరు పీఓకేలోకి పరారయ్యారు. ఈ ఘటనలో ఒక జవాను నేలకొరగ్గా ఆర్మీ కెప్టెన్ సహా నలుగురు గాయపడ్డారు. శనివారం ఉదయం ప్రతికూల వాతావరణాన్ని అనువుగా మలుచుకుని బ్యాట్ సభ్యులు కుప్వారా జిల్లాలోని కామకారి సెక్టార్‌లో ఎల్‌వోసీని దాటి భారత భూభాగంలోకి ప్రవేశించారు. త్రెహగామ్ సెక్టార్‌లోని కుంకడి ఫార్వర్డ్ పోస్ట్‌పైకి గ్రెనేడ్ విసిరి, కాల్పులకు తెగబడ్డారు. ఆర్మీ బలగా లు దీటుగా స్పందించాయి. రెండు పక్షాల మధ్య దాదాపు నాలుగు గంటలపాటు కాల్పులు కొనసాగాయి. బ్యాట్‌లోని ఒక పాకిస్తానీ హతం కాగా, మరో ఇద్దరు పీవోకేలోకి పలాయనం చిత్తగించారు. ఆర్మీ కెప్టెన్ సహా తీవ్రంగా గాయపడిన ఐదుగురిని వెంటనే శ్రీనగర్‌లో ఆర్మీ బేస్ ఆస్పత్రికి తరలించారు. రైఫిల్ మ్యాన్ మోహిత్ రాథోడ్ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బ్యాట్‌లో సాధారణంగా సుశిక్షితులైన పాక్ ఆర్మీ స్పెషల్ ఫోర్సెస్‌తోపాటు ఉగ్రవాదులు సభ్యులుగా ఉంటారు. అమానవీయ చర్యల కు పాల్పడుతూ నియంత్రణ రేఖ వెంబడి ప్రశాంతతకు భంగం కలిగించడమే వీరి పని. కాగా, జమ్మూ ప్రాంతంలో ఉగ్ర ఘటనలు పెరిగిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది.

మోదీ కొత్త ప్రభుత్వంలో 14 ఉగ్రదాడులు: ప్రియాంక

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకల దాడులు పెరిగిపోవడంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన దాడిలో ఒక జవాను ప్రాణాలు కోల్పో వడం, మరో నలుగురు గాయపడటంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టాక 49 రోజుల్లో కశ్మీర్‌లో జరిగిన 14 ఉగ్రదాడుల్లో 15 సైనికులు అమరుల య్యా రన్నారు. ఉగ్రవాదం పీచమణిచేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు.

స్కూలుపై ఇజ్రాయెల్ దాడి..
చిన్నారులు సహా 30 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్: గాజాపై శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో 30 మంది పాలస్తీని యన్లు మరణించారు. హమాస్ కమాండ్ కం ట్రోల్ సెంటర్, ఆయుధ డిపో నడు స్తున్నాయనే అనుమానంతో డెయిర్ అల్ బలాహ్‌లో పాలస్తీనియన్లు తలదాచుకున్న బాలికల పాఠశాలపై ఇజ్రాయెల్ సైన్యం దాడికి పాల్పడింది. దాంతో పాఠశాల తరగతి గదులన్నీ శిథిలాల దిబ్బగా మారాయి. ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు సహా 30 మంది మృతి చెందగా 100 మంది గాయపడినట్లు అధికారులు తెలి పారు. జువైదా పట్టణం సహా సెంట్రల్ గాజాలోని పలు ప్రాంతాలపై శనివారం ఇజ్రాయెల్ దాడుల్లో నలుగురు చిన్నారులు సహా మరో 12 మంది ప్రాణాలు కోల్పో యారు. గతేడాది అక్టోబర్ 7న మొదలైన ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా 39,200 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య విభాగం అంటోంది.

వారి కలలు కల్లలేనా!?

- అమెరికాలో 2.50 లక్షల మంది డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ ఆందోళన
- వీరిలో సింహభాగం భారతీయులే..
- వీసా హోదా మార్చుకోకపోతే స్వదేశాలకే..

➤ ఇండియాలో జన్మించిన ప్రణీత 8 ఏళ్ల వయసులో తల్లిదండ్రులతో కలిసి అమె రికాకు వచ్చింది. క్లౌడ్ ఇంజనీరింగ్ చదివింది. శాశ్వత నివాస హోదా లేకపోవడంతో 15 ఏళ్లకుపైగా డిపెం డెంట్‌గా నివసిస్తోంది. అమెరికాలో ఉండాలంటే తరచుగా వీసాలు మార్చుకోవాల్సి వస్తోంది.

➤ జెఫ్రీనా 2005లో ఏడేళ్ల వయసులో కుటుంబంతో కలిసి హెచ్4(డిపెండెం ట్) వీసాపై అమెరికా వెళ్లింది. 2010లో ఆమె కుటుంబం గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. అదెప్పుడొస్తుం దో తెలియదు. జెఫ్రీనాకు 21 ఏళ్లు దాటడంతో ఇండియాకు వెళ్లిపోవాలి.

➤ రోషన్ పదేళ్ల వయసులో తల్లి, సోదరు డితో కలిసి హెచ్4 వీసాపై అమెరికా వచ్చాడు. 16 ఏళ్లు అక్కడే చదువుకు న్నాడు. సెమీకండక్టర్ల తయారీ కంపె నీలో చేరాడు. అమెరికాను తన సొంత దేశంగానే ఇన్నాళ్లూ భావించాడు. కానీ, అక్కడి ప్రభుత్వం అతన్ని గత నెలల్లో ఇండియాకు బలవంతంగా తిరిగి పంపించివేసింది.



ప్రణీత, జెఫ్రీన్, రోషన్ లాంటి పరిస్థి తిని అమెరికాలో 2.50 లక్షల మంది ఎదుర్కొంటున్నారు. వీరిలో చాలామంది భారతీయు లే. వీరంతా చిన్నవయసులో తమ కుటుంబ సభ్యులతో కలిసి చట్టబద్ధం గానే అమెరికాకు చేరుకున్నారు. కానీ, అమెరి కాలోనే శాశ్వతంగా ఉండే అవకాశం మాత్రం లేదు. వీసాలను మార్చుకోకపోతే 21 ఏళ్లు దాటగానే స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థి తి. వీరిని డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ అని పిలు స్తున్నారు. ఇలాంటి వారికి అమెరికాలో ఉం డేందుకు, ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కల్పించాలని అధికార డెమొక్రటిక్ పార్టీ భా విస్తుండగా, ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ మాత్రం అంగీకరించడం లేదు. బయటకు పంపించా ల్సిందేనని పట్టుబడుతోంది. సెనేట్‌లో రెం డు సార్లు వ్యతిరేకంగా ఓటు వేసింది.

ఎందుకీ సమస్య?

లాంగ్ టర్మ్ వీసా కలిగి ఉన్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి డిపెండెంట్‌గా అమెరికాకు వచ్చినవారు 21 ఏళ్ల వయసు వచ్చేదాకా అమెరికాలో ఉండేందుకు వీలుం ది. ఆ తర్వాత వీసా మార్చుకోకపోతే బయ టకు వెళ్లిపోవాల్సిందే. తల్లిదండ్రులకు/ కుటుంబ సభ్యులకు గ్రీన్‌కార్డు(శాశ్వత నివాస హోదా) లభిస్తే ఎలాంటి ఇబ్బంది లేదు. డిపెండెంట్లు కూడా అమెరికాలో నివ సించేందుకు అవకాశం ఉంది. కానీ, గ్రీన్‌కార్డు లభించడానికి ఇప్పుడు 15 ఏళ్లకు పైగా సమయం పడుతోంది. ఈలోగా డిపెం డెంట్లకు 21 ఏళ్ల వయసు దాటేస్తోంది. దాం తో వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తోంది.

ప్రతిభావంతులను వదులుకుంటారా?

డిపెండెంట్లను బయటకు పంపించడాన్ని డెమొక్రటిక్ పార్టీ నాయకులు తీవ్రంగా వ్యతి రేకిస్తున్నారు. చట్టాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. అమెరికాలో జన్మించకపోయినా ఇక్కడే పెరిగి, పెద్ద చదువులు చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు కూడా చేస్తున్న ప్రతిభా వంతులను వదులుకోవడం తెలివైన పని కాదని అంటున్నారు. దేశ అభివృద్ధికి వారి సేవలు అవసరమని చెబుతున్నారు. ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను మరో దేశం కోసం ధారపోయడం ఏమిటని వాదిస్తున్నారు. డాక్యుమెంటెడ్ డ్రీమర్స్‌కు అమెరికాలో నివ సించే, ఉద్యోగాలు చేసుకొనేందుకు వీలు కలి ్పంచే బైపార్టిషన్ అమెరికాస్ చిల్డ్రన్స్ యాక్ట్ పెండింగ్‌లో ఉంది. ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చేలోగా తమకు చట్టబద్ధమైన నివాస హోదా కల్పించాలని డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ కోరుతున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

దేశంలో సాధారణ స్థితికి వరిసాగు



సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా విస్తరించిన రుతు పవనాలు, జోరుగా కురుస్తున్న వర్షాలతో వరి సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరుకుంటోందని కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. గతేడాది ఇదే సమ యానికి వరి 23.7 మిలియన్ హెక్టార్లలో సాగవగా, ఈ ఏడాది జూలై 27 నాటికి 21.5 మిలియన్ హెక్టార్లలో సాగైందని పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే కాస్త తక్కువే అయినప్పటికీ ఐదేళ్ల సగటుతో పోలిస్తే 2.2 శాతం మేర అధికమేనని తెలిపింది. ఈ ఏడాది మొత్తంగా 40.15 మిలియన్ హెక్టార్లలో వరి సాగు కానుందని అంచనా వేసింది. ఇక వేరుశెనగ, సోయాబీన్, పొద్దు తిరుగుడు వంటి నూనెగింజల సాగు గత ఏడాది కంటే 3.8 శాతం ఎక్కువగా, 17.16 మిలియన్ హెక్టార్లలో సాగయ్యాయని వివరించింది. పప్పుధాన్యాల సాగు సైతం 14 శాతం మేర పెరిగి, 10.2 మిలియన్ హెక్టార్లలో సాగైందని వెల్లడించింది.

నాసా ప్రయోగానికి 'గగన్‌యాన్' వ్యోమగామి

ఐఎస్ఎస్‌కు పంపించనున్న నాసా



న్యూఢిల్లీ: భారత్, అమెరికా ఉమ్మడిగా అంతరిక్ష ప్రయోగాలు చేపట్టే దిశగా ముందడుగు పడింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రయో గంలో పాలుపంచుకొనేందుకు 'గగనయాన్' మిషన్ వ్యోమగామి ఒకరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రా నికి(ఐఎస్ఎస్) వెళ్లనున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గగన్‌యాన్ ప్రయోగం కోసం నలుగురు వ్యోమగాములు శిక్షణ పొందుతున్న సంగతి తెలిసిందే. వీరిలో ఒకరిని ఐఎస్ఎస్‌కు పంపిచనున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలియజేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ గతేడాది అమె రికాలో పర్యటించారు. ఉమ్మడి అంతరిక్ష ప్రయోగాలపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చర్చించారు. ఉమ్మడి స్పేస్ మిషన్లలో భాగంగా 2024లో భారత వ్యోమ గామిని ఐఎస్ఎస్‌కు పంపిస్తామని బైడెన్ ఈ సందర్భంగా ప్రకటించారు. మరో వైపు గగన్‌యాన్ మిషన్ కోసం భారత వైమానిక దళం నుంచి ఎంపిక చేసిన నలు గురు వ్యోమగాములకు ప్రస్తుతం బెంగళూరులోని ఇస్రో ఆస్ట్రోనాట్స్ ట్రైనింగ్ కేం ద్రంలో శిక్షణ ఇస్తున్నారు.

వచ్చే నెల మోదీ ఉక్రెయిన్ పర్యటన!



న్యూఢిల్లీ: భారత్–ఉక్రెయిన్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకొనే దిశగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఉక్రెయిన్‌లో శాంతి కోసం ప్రపంచ దేశాలు కృషి చేస్తున్న నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 23, 24 తేదీల్లో ఉక్రెయిన్‌లో పర్యటించే అవకాశాలు న్నాయని దౌత్య వర్గాలు శనివారం వెల్లడించాయి. ప్రతిఏటా ఆగస్టు 24న ఉక్రెయిన్ జాతీయ దినో త్సవం నిర్వహిస్తారు. అదే రోజు మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించి, అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ పర్యటన తర్వాత మోదీ పోలండ్‌కు వెళ్తారని సమాచారం. ఇదే జరిగితే నాలుగు దశాబ్దాల తర్వాత పోలండ్‌లో పర్యటించిన మొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టిస్తారు. అయితే, మోదీ ఉక్రెయిన్ పర్యటనపై భారత ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు.

బహిష్కరణకు గురైన వ్యక్తి హోంమంత్రా?

అమిత్ షాపై మండిపడ్డ శరద్‌పవార్



సాక్షి, న్యూఢిల్లీ: 'అవినీతికి కింగ్ పిన్'అంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా తనపై చేసిన వ్యాఖ్యలపై ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ తీవ్రంగా మం డిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు అమిత్ షాను గుజ రాత్ నుంచి బహిష్కరించిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ..అటువంటి వ్యక్తి ఇప్పుడు దేశానికి ముఖ్యమైన హోం శాఖకు మంత్రి అయ్యారంటూ విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మనం ఎటు వెళ్తున్నామో ప్రజలు ఆలోచించాలన్నారు. అమిత్ షా దేశాన్ని తప్పుడు మార్గంలో తీసుకెళ్తున్నారని ఆరోపించారు. 2010లో సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో అమిత్ షా రెండే ళ్లపాటు గుజరాత్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. అయితే, 2014లో ఈ కేసు నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డారు. ఇటీవల పుణేలో జరిగిన ఓ కార్యక్ర మంలో అమిత్ షా.. ప్రతిపక్షాలు తమపై అవినీతి ఆరోపణలు చేస్తున్నాయని, అయితే దేశ రాజకీయాల్లో అతిపెద్ద అవినీతి రారాజు శరద్ పవార్ అంటూ వ్యాఖ్యానించడం తెల్సిందే.

గొప్ప కార్యాలు సాధించేందుకే పుట్టారు!

కేజ్రీవాల్‌పై సునీతా కేజ్రీవాల్



యమునానగర్: అరవింద్ కేజ్రీవాల్‌కు భగవంతుడి అనుగ్రహం ఉందని, గొప్ప కార్యాలను సాధించేం దుకే ఆయన పుట్టారని భార్య సునీత కేజ్రీవాల్ అన్నారు. '1968 ఆగస్టు 16న అరవింద్ కేజ్రీవాల్ పుట్టారు. ఆ రోజు కృష్ణ జన్మాష్టమి. ఇది యాదృ చ్ఛికం కాదు. ఆయన ద్వారా దేవుడు ఏదో చేయిం చాలని అనుకుంటున్నాడని భావిస్తున్నా' అని ఆమె పేర్కొన్నారు. మూడు నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా ఇవ్వొద్దని హరియాణ ప్రజలను కోరారు. శనివారం సునీత హరియా ణాలో సదౌరాలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. పాఠశాలలు, ఆసుపత్రుల స్థితిగతులను మార్చడం, మొహల్లా క్లినిక్‌లు, ఉచిత విద్యుత్.. ఇవి ఆప్‌తోనే సాధ్యమన్నారు. హరియాణా పుత్రుడు కేజ్రీవాల్‌తోనే ఇవి సాధ్యమని చెప్పారు. తప్పుడు కేసులో తన భర్తను బీజేపీ జైలుకు పంపిందని ఆరోపించారు. 'మోదీ.. కేజ్రీవాల్‌ను కాదు హరియాణా పుత్రుడిని జైల్లో పెట్టారు. నేను మీ కోడ లిని. ఈ అవమానాన్ని మీరు సహిస్తారా? నిశ్శబ్దంగా ఉంటారా? కేజ్రీవాల్ ఒక సింహం. ఆయన మోదీ ముందు మోకరిల్లరు' అని సునీత అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

- లోయలోకి దూసుకెళ్లిన టాటా సుమో
- ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. టాటా సుమో వాహనం లోయలోకి దూసుకెళ్లడంతో ఐదు గురు బాలలు సహా ఒకే కుటుంబానికి చెందిన 8 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు ఉన్నారు. కిష్టవర్ నుంచి తిరిగి వస్తుండగా డాక్సుమ్ ఏరి యాలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసు అధి కారులు చెప్పారు. వేగంగా దూసుకొచ్చిన టాటా సుమో అదుపు తప్పి లోయలో పడిపో యిందని, 8 మంది అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. ఈ ఘటనలో వాహనం పూర్తిగా ధ్వంసమైందని అన్నారు.

కోచింగ్ సెంటర్‌లోకి వరదనీరు..
ఇద్దరు విద్యార్థులు మృతి, ఒకరు గల్లంతు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నిర్వహిస్తున్న యూపీఎస్సీ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ఇద్దరు విద్యార్థులు చనిపోగా మరొ కరు గల్లంతయ్యారు. సెంట్రల్ ఢిల్లీ ప్రాంతంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. దీంతో, ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నడుస్తున్న రావ్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లోకి వరద ప్రవే శించింది. దీంతో కొందరు విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. వరదతో బేస్‌మెంట్ పూర్తిగా నిండిపోయినట్లు సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని నీటిని బయటకు తోడారు. సహాయక చర్యల్లో ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు లభించాయి. గల్లంతైన మరో విద్యార్థి జాడ కోసం గాలిస్తున్నామని అధికారులు తెలిపారు.



ఉగ్ర బొగత

ఎడతెరిపిలేని వర్షాలతో ములుగు జిల్లా వాజేడు మండల పరిధి చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం శనివారం ఉగ్రరూపం దాల్చింది. గుట్టలపై కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో జలపాతం హోరున శబ్దం చేస్తూ కిందకు దూకుతోంది. పర్యాటకులు జలపాతాన్ని తిలకించేందుకు నిర్మించిన గోడతోపాటు స్నానాల కొలను వరద నీటిలో మునిగిపోయాయి. జలపాతం సమీపంలోని పగోడ కిందినుంచి వరద ప్రవహిస్తోంది. ఇప్పటికే అధికారులు జలపాతం సందర్శనను నిలిపివేయగా, ముందస్తుగా ఫ్లెక్సీ ఏర్పాటుచేసి సిబ్బందిని కాపలా ఉంచారు. - వాజేడు

కృష్ణా.. తుంగభద్ర పోటాపోటీ

- శ్రీశైలం ప్రాజెక్టులోకి గంటగంటకూ పెరుగుతున్న వరద
- ప్రాజెక్టులోకి 4.12 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- నాగార్జునసాగర్‌కు 52,599 క్యూసెక్కుల నీరు
- తుంగభద్ర డ్యామ్ 33 గేట్లు ఎత్తివేత.. 1.58 లక్షల క్యూసెక్కులు దిగువకు
- నేడు శ్రీశైలానికి మరింత వరద పెరిగే అవకాశం



గేట్లు ఎత్తి తుంగభద్ర డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా పరీవాహక ప్రాంతం (బేసిన్)లో మూడురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, ప్రధాన ఉపనది తుంగభద్ర పోటాపోటీగా వరదెత్తుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటలకు జూరాల నుంచి 3.12 లక్షల క్యూసెక్కుల కృష్ణా జలాలు.. సుంకేశుల నుంచి 99,736 క్యూసెక్కుల తుంగభద్ర జలాలు వెరసి శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,12,280 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటినిల్వ 866.4 అడుగుల్లో 127.59 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు.. పూర్తినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 88 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి భారీ వరద ప్రవాహం వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు కుడి కేంద్రంలో ఏపీ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 18,480 క్యూసెక్కులు.. ఎడమగట్టు కేంద్రంలో తెలంగాణ జెన్‌కో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా, తుంగభద్రల నుంచి భారీ వరద వస్తుండటంతో సోమవారానికి శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. సోమవారంగానీ లేదా మంగళవారం ఉదయంగానీ శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తే అవకాశముంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 52,599 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 507.80 అడుగుల్లో 127.97 టీఎంసీలకు చేరుకుంది. సాగర్ నిండాలంటే ఇంకా 184 టీఎంసీలు అవసరం. మహారాష్ట్ర, కర్ణాటకలలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయలో వరద ఉధృతి మరింత పెరిగింది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి చేరుతున్న వరదను చేరుతున్నట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1.21 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో.. 33 గేట్లు ఎత్తేసి, విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 1.58 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో మంత్రాలయం వద్ద తుంగభద్రనది ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ఇక్కడ వరద 311.25 మీటర్ల(సముద్రమట్టానికి)కు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసి.. పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. సుంకేశుల బ్యారేజీలోకి 1,02,100 క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులు వదులుతూ, గేట్లు ఎత్తి దిగువకు 99,736 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింత పెరుగుతుందని అధికారవర్గాలు తెలిపాయి.

శనివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధాన పాయలో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1,705	129.72	1,693.37	77.05	2,38,000	3,00,000
నారాయణపూర్	1,615	37.64	1,608.56	29.20	3,00,000	3,00,064
ఉజ్జయిని	1,630	117.64	1,616.73	76.90	72,502	0
జూరాల	1,045	9.66	1,041.83	7.74	3,02,000	3,16,308
తుంగభద్ర	1,633	105.79	1,631.46	99.66	1,21,456	1,58,457
శ్రీశైలం	885	215.81	866.4	127.59	4,12,280	74,258
నాగార్జునసాగర్	590	312.05	507.80	127.97	55,599	6,253
పులిచింతల	175	45.77	103.05	1.05	59	50

మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్

స్నేహితుడి పెళ్లికి దుబాయ్ వెళ్తుండగా బెంగళూరులో అరెస్ట్ చేసిన పోలీసులు

- తాపీగా 52 రోజుల తర్వాత 'పులివర్తి' కేసులో ఏ–37గా చేర్చడంపై విస్మయం
- ఘటన సమయంలో కలెక్టర్, జేసీ సమక్షంలో స్ట్రాంగ్ రూంలోనే ఉన్న మోహిత్‌రెడ్డి
- ముందస్తు బెయిల్‌పై సోమవారం విచారణ.. కోర్టుకిచ్చిన హామీని ఉల్లంఘించిన పోలీసులు



తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని పోలీసులు శనివారం సాయంత్రం అక్రమంగా అరెస్ట్ చేశారు. దుబాయ్‌లో స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ఆయన్ను బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. పోలింగ్ తర్వాత రోజు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో పులివర్తి నాని ఉద్రిక్తతలు రేకెత్తించిన ఘటనకు సంబంధించి మోహిత్‌రెడ్డిని ఏ–37గా చేర్చారు. నిజానికి ఆ సమయంలో మోహిత్‌రెడ్డి వర్సిటీలోని స్ట్రాంగ్ రూంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర ఎన్నికల అధికారుల వద్ద ఉండటం గమనార్హం. సీసీ కెమెరాల సాక్షిగా ఇదే విషయం నిర్ధారణ అయింది. కేసు నమోదు సమయంలోనూ మోహిత్‌రెడ్డి పేరు ఎక్కడా లేదు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఘటన జరిగిన 52 రోజుల అనంతరం రాజకీయ కక్షతో మోహిత్‌రెడ్డి పేరును కేసులో చేర్చారు. ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్‌పై కోర్టులో సోమవారం విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో అరెస్ట్ చేయబోమని కోర్టుకు నివేదించిన పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నాని రాజకీయ కక్షలో భాగంగానే తనపై ప్రత్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కేసులో ఇరికించి అక్రమ అరెస్టుతో పైశాచిక ఆనందం పొందుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాటకమని తేలినా కక్ష సాధింపా?

తనపై హత్యాయత్నం జరిగిందని నాడు స్విమ్స్‌లో చేరి.. చేతులు, కాళ్లకు బ్యాండేజ్ కట్లతో చేసిన హడావుడి అంతా నాటకమని తేలింది. ఆ వ్యక్తి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఎక్కడా గాయాల్లేవని ఎక్స్‌రే, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ ద్వారా స్పష్టమైంది. ఆ రిపోర్టులు ఇటీవలే బయటపడ్డాయి. మొత్తానికి ఆ రోజు అంతా డ్రామా నడిచిందని తేటతెల్లమైంది. ఆ నాటకం వల్ల ఇప్పటికే 37 మందిని జైలు పాలు చేశారు. అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకా ఎంత మందిని శిక్షిస్తారు? తప్పుడు కేసులు పెట్టి అమాయకులను మానసిక క్షోభకు గురి చేయడం దారుణం. ఆ వ్యక్తి గాయాలన్నీ 'కట్టు' కథలే అని తేలినప్పటికీ, చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గం.

విదేశాల్లో చదివిన వాడిని వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు

నా కొడుకు వయస్సు 25 ఏళ్లు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా జీవితంలోకి వచ్చాడు. అక్రమ కేసులో అరెస్ట్ చేయించారు. విదేశాల్లో చదివిన నా కొడుకుని వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు. నేను విద్యార్థి దశ నుంచే ఉద్యమాలతో పెరిగినవాడిని. నాకంటే మించి నా కొడుకు ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు ఎలా ఉంటాయో ఈ ప్రభుత్వానికి, ఈ పోలీసు అధికారులకు రుచి చూపిస్తారు. ప్రజల పక్షాన ఏ స్థాయి పోరాటానికైనా నా పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నాం.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, చంద్రగిరి

సీటుకు నోటు!

నచ్చిన వారిని నియమిస్తూ టీడీపీ నేతల వసూళ్ల పర్వం

రెవెన్యూ, పోలీసు శాఖల్లో పోస్టింగ్‌లకు పైరవీలు, మామూళ్లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


భద్రాచలంలో గోదావరి వరద ప్రవాహం

గోదావరి మళ్లీ మహోగ్రరూపం

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరుతో పోటెత్తి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- భద్రాచలం వద్ద 53.6 అడుగులకు చేరిన వరద మట్టం.. మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- కూనవరం వద్ద ప్రమాదకర స్థాయిలో శబరి ప్రవాహం.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- నేడు కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకూ ప్రమాదకరస్థాయిలో గోదావరి ప్రవహిస్తుందని సీడబ్ల్యూసీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్/భద్రాచలం: గోదావరి పరీవాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రెండురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి, వాగులు, వంకలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. దీంతో గోదావరి నది శనివారం మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజ్‌లోకి 5,39,200 క్యూసెక్కులు చేరుతుండగా, 85 గేట్లు పూర్తిగా ఎత్తేసి అంతేస్థాయిలో దిగువకు నీటిని వదిలేస్తున్నారు. తుపాలకుగూడెం(సమ్మక్క బ్యారేజ్)లోకి 9,75,910 క్యూసెక్కులు చేరుతుండగా..అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దుమ్ముగూడెం(సీతమ్మసాగర్) బ్యారేజ్‌లోకి 13,95,637 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్దకు 14,36,573 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో రాత్రి 12 గంటల సమయానికి వరద మట్టం 53.6 అడుగులకు చేరుకుంది. దీంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.(గోదావరి చరిత్రలో 1986, ఆగస్టు 16న భద్రాచలం వద్దకు గరిష్టంగా 27.02 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు వరద మట్టం 75.6 అడుగులుగా నమోదైంది). ఏపీలో విలీనమైన కూనవరం వద్ద శబరినది ఉధృతి మరింత పెరిగింది. వరద మట్టం 41.35 మీటర్ల(సముద్రమట్టానికి)కు చేరుకోవడంతో కూనవరం వద్ద అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం 6 గంటలకు 11,87,497 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో 48 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి 13,29,774 క్యూసెక్కులు చేరుతుండగా.. 13,20,274 క్యూసెక్కులను 175 గేట్లు పూర్తిగా ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. బ్యారేజ్ వద్ద నీటి మట్టం 14 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేశారు. మధ్య గోదావరి బేసిన్‌లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఆదివారం కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం బ్యారేజ్ వరకూ గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని బేసిన్ పరిధిలోని రాష్ట్రాలను కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అప్రమత్తం చేసింది.

భద్రాచలం ఏజెన్సీలో...

భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకరస్థాయిలో ప్రవహించడంతో ఏజెన్సీలోని అన్ని మండలాల్లో ప్రధాన రహదారులపైకి నీరు చేరి రవాణా స్తంభించింది. దీంతో భద్రాచలం నుంచి అన్ని వైపులా రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని కొన్ని కాలనీలలో స్లూయిజ్‌ల లీకేజీతోపాటు, ఇక్కడ వరద నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయలేదు. దీంతో వరదంతా కాలనీల్లోకి చేరడంతో అధికారులు ఆ ప్రాంత వాసులను ఖాళీ చేయించి పునరావాస శిబిరాలకు తరలించారు. ఐటీడీఏ పీఓ రాహుల్ బాధితులను పరామర్శించి పునరావాస శిబిరంలో గల వసతులపై ఆరా తీశారు.

శ్రీరాంసాగర్‌కు నిలకడగా వరద

ఎగువ గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు సైతం స్వల్పంగా వరద పెరిగింది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, 30,554 క్యూసెక్కుల వరద వస్తుండడంతో నిల్వలు 31.26 టీఎంసీలకు చేరాయి. కడెం ప్రాజెక్టుకు 5806 క్యూసెక్కులు వస్తుండడంతో ప్రాజెక్టులో 6.14 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 7,120 క్యూసెక్కులను కిందకు విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, 12,931 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో అంతే స్థాయిలో వరదను కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడారం బరాజ్‌కు పంపింగ్ చేస్తున్నారు.

తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి...

చర్ల: తాలిపేరు ప్రాజెక్టుకు మళ్లీ వరదనీరు పోటెత్తుతోంది. శనివారం ఉదయం 7 గంటలకు 13 గేట్లు ఎత్తిన అధికారులు.. మధ్యాహ్నం 12 గంటలకు మొత్తం 25 గేట్లు ఎత్తి 93,120 క్యూసెక్కుల చొప్పున వరదనీటిని విడుదల చేస్తున్నారు. అయితే రాత్రికి మరింతగా వరద ఉధృతి పెరగగా 8 గంటలకు 1,27,717 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నారు.

పంపింగ్ ప్రారంభం

▶ మొదటి పేజీ తరువాయి

నందిమేడారం, మిడ్‌మానేరు జలాశయాల్లోకి ఎత్తిపోస్తున్నారు. ఆగస్టు 2లోగా కాళేశ్వరం పంప్‌హౌస్‌లను ఆన్ చేయకుంటే 50వేల మంది రైతులతో కలిసి తామే ఆన్ చేస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటం జారీ చేసిన నేపథ్యంలో పంపింగ్ ప్రారంభం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు దెబ్బతిని ఉండడంతో వాటిలో నీటి నిల్వలు చేయరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ కోరిందని, దీంతో ఈ మూడు జలాశయాల నుంచి నీళ్లను పంపింగ్ చేసి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలించడం సాధ్యం కాదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బదులిచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌కు నీటిని తరలిస్తామని ప్రకటించారు. మంత్రి ప్రకటన మేరకు నీటిపారుదల శాఖ శనివారం నుంచే పంపింగ్ ప్రారంభించింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా భారీ వర్షాలతో వస్తున్న వరదలతో శనివారం 17.34 టీఎంసీలకు నిల్వలు చేరాయి. 14,358 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. నంది, గాయత్రి పంపుహౌస్‌ల ద్వారా శనివారం ఎత్తిపోతలు ప్రారంభించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గ్రావిటీ కాలువ ద్వారా తరలివస్తున్న నీటిని ధర్మారం మండలం నందిమేడారం వద్ద ఉన్న నంది పంప్‌హౌస్ ద్వారా నందిమేడారం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు.


జలకళతో ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు

మొత్తం 7 పంపులు ఉండగా, 4 పంప్‌లను ఆపరేట్ చేస్తూ 13,076 క్యూసెక్కులను తరలిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఒక మోటారును ఆన్‌చేసిన అధికారులు.. సాయంత్రం 6గంటల వరకు మరో మూడు విద్యుత్ మోటార్లు రన్ చేశారు. నందిమేడారం రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద గల గాయత్రి పంప్‌హౌస్‌లోకి అంతే స్థాయిలో 13,076 క్యూసెక్కులను తరలిస్తున్నారు. గాయత్రి పంప్‌హౌస్‌లోని నాలుగు బాహుబలి పంపుల ద్వారా నీళ్లను గ్రావిటీ కాల్వలోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి ఆ నీళ్లు మిడ్‌మానేరుకు తరలిపోతున్నాయి. నీటి పంపింగ్ ప్రారంభం కావడంతో మడుగు, గంగాధర, బోయినపల్లి మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో మధ్యమానేరుకు నీటిని ఎత్తిపోస్తున్నామని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు.

సూపర్ సిక్స్ మొదట్లోనే డకౌట్



- ఏపీ సీఎం చంద్రబాబు శ్వేతపత్రం కాదది.. సాకుపత్రం
- ఏపీ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విడుదల చేసింది శ్వేతపత్రం కాదని, అది ఒక సాకు పత్రమని ఆ రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా కుంటి సాకులతో అన్నీ అసత్యాలు వల్లించారని, ప్రజలను తప్పుదారి పట్టించాలని తప్పుడు లెక్కలు చూపించారని ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అసలు శ్వేతపత్రానికే అర్థం మార్చడని, రాష్ట్రాభివృద్ధి కోసం తామేం చేయబోతున్నామో చెప్పకుండా.. కేవలం గత ప్రభుత్వంపై నిందలు, అన్నింటికీ బాధ్యులను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్వేతపత్రాల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు సీఎంగా పని చేశానని పదే పదే వల్లించే చంద్రబాబు.. సంపద సృష్టించడం తనకు మాత్రమే తెలుసని గొప్పగా ప్రచారం చేసుకొని, ఇప్పుడు తమ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలను అడుగుతానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బాబు వైఖరి చూస్తుంటే.. 'మీరంతా కొండను ఎత్తి, నా నెత్తిపై పెట్టండి. నేను దాన్ని మోస్తాను' అన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. చివరకు గవర్నర్‌తో కూడా అబద్ధం చెప్పించారని విమర్శించారు. రాష్ట్ర పరిపాలన కోసం రూ.2 లక్షల 50 వేల కోట్లు అవసరం ఉంటే ఆదాయం రూ.2 లక్షల 40 వేల కోట్లని.. రెగ్యులర్ జీతభత్యాలు, పెన్షన్లు, సబ్సిడీలు, పీడీఎస్, అప్పులకు వడ్డీలు ఏటా రూ.10 వేల కోట్లు అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని, ఏం చేయాలని ప్రజలను ప్రశ్నిస్తే ఎలా అని నిలదీశారు. అలాంటప్పుడు ఏటా దాదాపు లక్షన్నర కోట్ల వ్యయమయ్యే పథకాలను ఎలా ప్రకటించారని దుయ్యబట్టారు. వాటిని అమలు చేయడం సాధ్యం కాదని తెలిసి.. శ్వేతపత్రాల పేరుతో సాకు పత్రాలు విడుదల చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్నికల ముందు అట్టహాసంగా ప్రకటించిన సూపర్ సిక్స్.. తొలి ఓవర్‌లోనే డకౌట్ అయిందని బుగ్గన ఎద్దేవా చేశారు. తల్లికి వందనం కింద ప్రతి పిల్లాడికి రూ.15 వేలు, 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ఏటా 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి, రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం.. వీటన్నింటి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. బడులు తెరిచి రెండు నెలలు కావస్తున్నా, తల్లికి వందనం అమలు చేయడానికి డేటా లేదని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఒత్తిడి తట్టుకోలేక మెడికో ఆత్మహత్య


శిరీష

కరీంనగర్‌క్రైం: ఎంబీబీఎస్ చదవడం కష్టంగా ఉందని మానసిక ఒత్తిడికి గురైన ఓ యువతి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. కరీంనగర్‌లో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కోమళ్ల ప్రహ్లాదరావు–పద్మజ దంపతులు నగరంలోని ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్నారు. కూతురు కోమళ్ల శిరీష(20) కూడా అదే కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతోంది. అయితే చదువు కష్టంగా ఉందని పలుమార్లు శిరీష తల్లిదండ్రులకు చెప్పింది. ఎన్నిసార్లు చెప్పినా తల్లిదండ్రులు వినిపించుకోలేదు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురైన శిరీష శనివారం ఉదయం కళాశాల నుంచి వచ్చి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. తల్లి పద్మజ మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు ఉరేసుకొని ఉండటాన్ని చూసి ఆందోళనకు గురైంది. స్థానికుల సహాయంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే శిరీష మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రహ్లాదరావు ఫిర్యాదు మేరకు కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 28 । జూలై । 2024



.. బదిలీలు షురూ

హెచ్ఎండీఏ ప్రణాళికా విభాగంలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్ డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న పలువురు ప్లానింగ్ అధికారులను ప్రభుత్వం వివిధ విభాగాలకు బదిలీ చేసింది. -12లో

30 నుంచి ఇంటింటి సర్వే

గ్రేటర్ నగరంలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుంది. -12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/23.0

రానున్న 24 గంటల్లో నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు పడవచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.



బోనాల్లో డ్యాన్స్ వేసేవాణ్ని

- ఆ జ్ఞాపకాలు ఎంతో మధురం
- సినీ నటుడు ప్రియదర్శి

'నేను పెరిగింది హైదరాబాద్ పాతబస్తీలో. చిన్నప్పటి నుంచి లాల్ దర్వాజా బోనాలు చూస్తూ పెరిగాను. పోతరాజు వేషంలో డ్యాన్స్ చేసేవాళ్లని చూస్తుంటే సంతోషంగా ఉంటుంది. డ్రమ్స్, మ్యూజిక్, డ్యాన్స్ చూస్తుంటే బాడీలో ఒక వైబ్రేషన్ వస్తుంటుంది. ఇప్పుడు సినిమాల్లోకి వచ్చాక డైరెక్టుగా బోనాల్లో పాల్గొనలేకపోతున్నాను గాని.. లాల్ దర్వాజా, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ.. ఇలా అమ్మవార్ల బోనాల ఉత్సవాలను టీవీలో చూస్తుంటాను.. చాలా సంతోషంగా ఉంటుంది' అని సినీ నటుడు ప్రియదర్శి అన్నారు. సహాయ, కామెడీ పాత్రలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి.. నగరంలో బోనాల పండగ జోరుగా జరుగుతున్న సందర్భంగా 'సాక్షి'తో తన అనుభవాలను ఇలా పంచుకున్నారు.

'నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నేను గమనిస్తున్నది ఏంటంటే.. బోనాల తర్వాత మనకు తప్పకుండా వర్షం వస్తుంది. ఈ విషయాన్ని నేను ఏళ్ల తరబడి చూస్తున్నాను. బోనాల సమయంలో తప్పనిసరిగా వర్షం రావడం మంచిగా అనిపిస్తుంది. హైదరాబాద్‌లో అన్ని కులాలు, మతాల వారు బోనాల ఉత్సవాలను ఎంతో సంబరంగా జరుపుకోవడం సంతోషంగా ఉంటుంది. నేను చిన్నప్పుడు బోనాల్లో డ్యాన్స్ చేసేవాణ్ని. పోతరాజు వేషధారణల మధ్య డ్యాన్స్ చేయడమంటే నాకు చాలా ఇష్టం. అలాగే హైదరాబాద్‌లో యాదవ సోదరులు సదర్ ఉత్సవాలని ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. అవి కూడా నాకెంతో ఇష్టం.. నేను పాల్గొనేవాణ్ని. 'సేవ్ ద టైగర్స్' వెబ్ సిరీస్‌లో నేను ఘంటా రవి పాత్ర చేస్తున్నప్పుడు ఇలాంటివన్నీ బాగా రిఫరెన్స్‌గా వాడుకున్నా. సెలబ్రిటీ అయ్యాక బోనాలు, సదర్ ఉత్సవాల్లో డైరెక్టుగా పాల్గొనలేకపోతున్నాను. తప్పదు.. కొన్నింటిని త్యాగం చేయాల్సిందే. సంక్రాంతి పండగను ఆంధ్రప్రదేశ్‌లో ఎంత ఘనంగా జరుపుకుంటారో హైదరాబాద్‌లోనూ అంతే గ్రాండ్‌గా జరుపుకొంటారు. తెలంగాణలో సమ్మక్క– సారక్క, కొండగట్టు అంజన్న, యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి, మల్లన్న జాతర.. ఇలాంటివన్నీ సంస్కృతికి నిదర్శనం'. హిందువుల పండగలనే కాదు... నాకు అన్ని పండగలూ ఇష్టమే. ప్రత్యేకించి రంజాన్, బక్రీద్ సమయంలో ముస్లిం స్నేహితులని కలవడం.. వారు పెట్టే ఖీర్ (పాయసం) తినడం చాలా హ్యాపీగా ఉండేది' అన్నారు ప్రియదర్శి. – సాక్షి, సినిమా డెస్క్

శివారుకో దారి!

ఓఆర్ఆర్ వరకు పలుచోట్ల రోడ్లు

- త్వరలో హెచ్ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో..
- రూ.1057 కోట్లతో 49 రహదారులు



సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు హైదరాబాద్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన నేపథ్యంలో.. త్వరలోనే పలు ప్రాంతాల్లో 49 రోడ్లు నిర్మించనున్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ అనే వ్యత్యాసం లేకుండా అన్ని ప్రాంతాల్లో వీటిని నిర్మించనున్నారు. హైదరాబాద్ రోడ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్మించబోయే వీటి అంచనా వ్యయం దాదాపు రూ. 1057 కోట్లు. రెండు ప్యాకేజీలుగా వీటిని నిర్మించనున్నారు. మొదటి ప్యాకేజీలో 24 పనుల అంచనా వ్యయం రూ.486 కోట్లు కాగా, రెండో ప్యాకేజీలోని 25 పనుల అంచనా వ్యయం దాదాపు రూ. 571 కోట్లు. వెరసీ.. రూ.1057 కోట్ల విలువైన పనులకు త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు. వీటిలో కొన్ని పనులకు గతంలోనే టెండర్లు పిలిచినా ఆ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో వాటిని కూడా వీటిలో చేర్చారు.

నగరానికి కొత్త సొగసులు..

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచీ హైదరాబాద్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండటం తెలిసిందే. ఓవైపు అభివృద్ధి పనులతోపాటు మరోవైపు ముంపు సమస్యలు తప్పించే నాలాల ఆధునికీకరణ పనులు, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మూసీ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే జీహెచ్ఎంసీకి రూ. 3, 056 కోట్ల నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించడం తెలిసిందే. సీఎం ఆలోచనలకనుగుణంగా ఓఆర్ఆర్ వరకు తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీసీయూఆర్)గా హైదరాబాద్‌కు కొత్త సొగసులద్దేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కొత్తగా నిర్మించబోయే రోడ్లు విశాలంగా ఉండటంతోపాటు ఫుట్‌పాత్‌లు తదితర సదుపాయాలుంటాయి. వీటిలో శివారు ప్రాంతాల్లోని రోడ్లతోపాటు నగరంలోని రోడ్లు కూడా కొన్ని ఉన్నాయి.

ఈ మార్గాల్లో రోడ్లు..

ఒకటో ప్యాకేజీలో: ఇంజాపూర్ రోడ్– మునగనూర్ రోడ్, వనస్థలిపురం రోడ్– ఓల్డ్ హయత్‌నగర్ రోడ్(వయా సాహెబ్‌నగర్ రోడ్), బడంగ్‌పేట– నాదర్‌గుల్ రోడ్, తొర్రూరు–నాగార్జునసాగర్ రోడ్, ప్రభుత్వోన్నత పాఠశాల– కోకాపేట, ఇన్నర్ రింగ్‌రోడ్– డీఎల్ఆర్ఎల్ కాలనీ(వయా టీకేఆర్ కాలేజీరోడ్), అమీన్‌పూర్ విలేజ్– మియాపూర్ హెచ్ఎంటీ కాలనీ, రాజ్‌భవన్ రోడ్– ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, బేగంపేట రైల్వేస్టేషన్ లింక్‌రోడ్– బ్రాహ్మణవాడి రైల్వేట్రాక్, కుత్బుల్లాపూర్ రోడ్– పైపులైన్ రోడ్, బాపూఘాట్ బ్రిడ్జి–పీఅండ్‌టీ కాలనీ (ఈసానది తూర్పువైపు, బాచుపల్లి వీవీఆర్ కాలేజ్– నిజాంపేట పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బైరాగిగూడ– నార్సింగి, గొల్లపల్లి నేషనల్ హైవే జంక్షన్– ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్ (పెద్ద గోల్కొండ), ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ జంక్షన్–ఆక్టోపస్, ఘట్‌కేసర్‌లో శివారెడ్డి గూడ–మాధవరెడ్డి బ్రిడ్జి, యమ్నంపేట ఫ్లై ఓవర్–నాగారం డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీ, ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్– చేవెళ్ల రోడ్ (వయా కిస్మత్‌పూర్), కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం– ఆర్అండ్‌బీ రోడ్, దర్గా– ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, యమ్నంపేట– పోచారం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్, ఫర్మాయిష్ హోటల్– తారామతి బారాదరి (వయా కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్స్), బడంగ్‌పేట ప్రధాన రహదారి– తుర్కయాంజాల్(వయా నాదర్‌గుల్).

రెండో ప్యాకేజీలో: ఆర్‌సీఐ క్రాస్‌రోడ్స్– శ్రీశైలం హైవే, మల్లాపూర్ క్రాస్‌రోడ్– కుర్మల్‌గూడ, కుర్మల్‌గూడ– నాదర్‌గుల్, ఫైరింగ్ కట్ట– ఎన్టీఆర్ విగ్రహం రోడ్, ఎన్టీఆర్ విగ్రహం రోడ్– దమ్మాయిగూడ రోడ్, ఎన్టీఆర్ విగ్రహం– డంపింగ్‌యార్డ్, ఎన్టీఆర్ విగ్రహం– జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో వంపుగూడ రోడ్, రాంపల్లి క్రాస్‌రోడ్– సర్వేనెంబర్ 421, సర్వేనెంబర్421– యమ్నంపేట (నాగారం మున్సిపల్ సరిహద్దు వరకు), చర్లపల్లి– ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్ (వయా కరీంగూడ), చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ ఆఫీస్– రాంపల్లి జంక్షన్, దమ్మాయిగూడ–నాగారం రోడ్, చేరియాల జేఎన్ఎన్‌యూఆర్ఎం హౌసింగ్ కాలనీ–అహ్మద్‌గూడ, శంషాబాద్ రైల్వేక్రాసింగ్–ధర్మగిరి రోడ్, శంషాబాద్ బస్టాప్– రాళ్లగూడ రోడ్, దొండుపల్లి జంక్షన్–ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్, కొత్తూరు రైల్వే క్రాసింగ్–కుమ్మరిగూడ జంక్షన్, కొత్తూరు వైజంక్షన్–వినాయకస్టీల్, ఎన్‌హెచ్44– రాంరెడ్డినగర్ ఇండస్ట్రియల్ ఏరియా, (పేట్ బషీరాబాద్ హెచ్‌టీ లైన్), హనుమాన్ టెంపుల్– అపర్ణ హిల్ పార్క్, హనుమాన్ టెంపుల్– మిథిలానగర్, ప్రగతినగర్–మహదేవపురం వెటర్నిటీ హాస్పిటల్.

పాతబస్తీకి పండగొచ్చింది

నేడు వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు

- అమ్మవారి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రులు

చార్మినార్/చాంద్రాయణగుట్ట: పాతబస్తీకి ఉత్సవ కళ వచ్చింది. బోనాల పండగతో ఉత్సాహం ఉట్టిపడుతోంది. ఆషాఢమాసం బోనాల జాతరలో భాగంగా ఆదివారం లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి దేవాలయం, మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర అమ్మవారి దేవాలయం సహా అన్ని ప్రధాన ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు తదితరులు అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేస్తారని ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

భక్తులకు వసతులు కల్పించాలి: ఆమ్రపాలి

లక్డీకాపూల్: బోనాల ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శనివారం జోనల్, డిప్యూటీ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం జరగనున్న బోనాల ఉత్సవాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో గ్రేటర్‌లో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నేడు, రేపు మద్యం దుకాణాలు బంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల ఉత్సవాల సందర్భంగా ఆది, సోమవారాల్లో మద్యం దుకాణాలు, బార్‌లు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ నెల 30వ తేదీ మంగళవారం వైన్స్ యథావిధిగా తిరిగి తెరుచుకుంటాయని పేర్కొన్నారు.







లాల్‌దర్వాజా సింహవాహిని దేవాలయం వద్ద శనివారం రాత్రి భక్తుల సందడి (ఇన్‌సెట్‌లో) సింహవాహిని అమ్మవారు

విద్యుద్దీపాల కాంతుల్లో మెరిసిపోతున్న అమ్మవారి ఆలయం

తండ్రీ కొడుకుల డ్రగ్స్ దందా

కాస్మొటిక్ వ్యాపారంలో పెడ్లర్లతో పరిచయం

- రాజస్థాన్ నుంచి నగరానికి హెరాయిన్ సరఫరా
- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- రూ.12 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: ఇద్దరు తండ్రీ కొడుకులు కలిసి చేస్తున్న డ్రగ్స్ దందాకు రాచకొండ పోలీసులు ముగింపు పలికారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో మాదక ద్రవ్యాల వ్యాపారంలోకి అడుగుపెట్టిన ఇరువురు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. శనివారం ఎల్బీనగర్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) డీసీపీ మురళీధర్‌తో కలిసి కమిషనర్ జి.సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన హనీఫ్ షాకు ఎనిమిది మంది సంతానం. స్థానికంగా స్క్రాప్ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదాయం తక్కువగా ఉండటంతో తన మూడో కుమారుడైన సిద్దిక్ షాతో కలిసి కాస్మొటిక్ వ్యాపారాన్ని ప్రారంభించాడు. మొదట్లో వ్యాపారం బాగానే నడిచినా.. ఆశించినంత ఆదాయం రాలేదు. దీంతో కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో వైద్య అవసరాల కోసం చట్టబద్ధమైన నార్కోటిక్ డ్రగ్స్ సాగుకు అనుమతి ఉంది. ఈ క్రమంలో కాస్మోటిక్స్ వ్యాపార కార్యకలాపాలలో భాగంగా హనీఫ్ షాకు రాజస్థాన్‌లోని డ్రగ్ పెడ్లర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. దీంతో తండ్రీ కొడుకులు ఇద్దరూ కలిసి ప్రతాప్‌గఢ్ జిల్లాలోని రత్లాం ప్రాంతంలో మాదక ద్రవ్యాల సరఫరాదారు మోంటు నుంచి రూ.6 లక్షల పెట్టి వంద గ్రాముల హెరాయిన్‌ను కొనుగోలు చేశారు.
- ఈ హెరాయిన్ పొట్లాన్ని భద్రంగా ల్యాప్‌టాప్ బాగులో పెట్టుకొని ప్రైవేట్ బస్సులో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. బాలాపూర్ గ్రామంలోని ఇమాన్ ఎన్‌క్లేవ్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా మహేశ్వర్ ఎస్ఓటీ, బాలాపూర్ పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.13 వేల నగదుతో పాటు రూ.12 లక్షల విలువ చేసే వంద గ్రాముల హెరాయిన్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మోంటు పరారీలో ఉన్నాడు.

భార్యాభర్తల చీటింగ్

సాక్షి, సిటీబ్యూరో: అమెరికా కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ ఇప్పిస్తామని మోసం చేసిన భార్యభర్తలను సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) పోలీసులు శనివారం అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మాదాపూర్‌కు చెందిన పాలడుగు రఘురాం, పాలడుగు సునీత భార్యభర్తలు. వీరికి సైబరాబాద్‌కు చెందిన చాట్ల సంజీవ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో సంజీవ్ కుమారుడికి స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ సీటు ఇప్పిస్తామని పాలడుగు దంపతులు సంజీవ్‌ను నమ్మించారు. అమెరికాలోని వైట్ హౌస్‌లో పనిచేసే సుమంత్ అనే వ్యక్తి తమకు బాగా పరిచయమని, ఇతను అడ్మిషన్ ఇప్పిండంలో మనకు సహాయం చేస్తాడని మాయమాటలు చెప్పారు. అడ్మిషన్‌కు కొంత ఖర్చు అవుతుందని చెప్పి, రూ.3.25 కోట్లను వసూలు చేశారు.

- అడ్మిషన్ కోసం అమెరికా వెళ్లి సుమంత్‌ను కలిసి వస్తామని చెప్పి డబ్బు తీసుకొని భార్యభర్తలిద్దరూ కలిసి అమెరికాకు కాకుండా మైసూర్‌కు చెక్కేశారు. కొత్త సిమ్ కార్డును తీసుకొని యూఎస్‌లో ఉన్నామని బాధితుడిని నమ్మించి వాట్సాప్ చాట్‌లో మాత్రమే సంభాషించేవారు. నకిలీ అడ్మిషన్ పత్రాలను సృష్టించి, సంజీవ్‌కు పంపించారు. తీరా అవి నకిలీ పత్రాలను తెలిపోవడంతో డబ్బు వెనక్కి ఇవ్వాలని రఘురాంను సంప్రదించగా తప్పించుకొని తిరిగే వాడు. దీంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులు ఆశ్రయించాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు రఘురాం, సునీతలను అరెస్టు చేశారు.

ఖాతాదారుకు తెలియకుండా రూ.40 కోట్లు బదిలీ

సత్వరం స్పందించిన ఇండస్ఇండ్ బ్యాంక్

- 11 ఖాతాల్లోని రూ.32.89 కోట్లు ఫ్రీజ్
- ముగ్గురిపై కేసు నమోదు చేసిన సైబరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఖాతాదారుకు తెలియకుండా రూ.40 కోట్ల నగదును మ్యూల్ అకౌంట్లలోకి మళ్లించాడు ఓ బ్యాంక్ మేనేజర్. దీంతో మేనేజర్ సహా ముగ్గురిపై సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో ఇండస్ఇండ్ బ్యాంక్‌లో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీకి ఖాతా ఉంది. బ్యాంక్ అంతర్గత ఆడిట్‌లో భాగంగా ఈ అకౌంట్ నుంచి శంషాబాద్‌లోని మధురానగర్ బ్రాంచ్‌కు రూ.15 కోట్లు, రూ.25 కోట్లుగా రెండు విడతల్లో రూ.40 కోట్ల నగదు బదిలీ అయినట్లు బ్యాంకు ప్రతినిధులు గుర్తించారు. ముంబైలోని ప్రధాన కార్యాలయం అనుమతి లేకుండా అనధికారికంగా ఈ నగదు బదిలీ జరిగినట్లు తేలడంతో వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంతా పథకం ప్రకారమే..

రూ.40 కోట్ల నగదుతో ఈ ఏడాది జులై మొదటి వారంలో కొత్తగా తెరిచిన ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలోకి బదిలీ అయింది. ఇక్కడి నుంచి దేశంలోని జాతీయ, ప్రైవేట్ బ్యాంకుల్లోని 20 వేర్వేరు ఖాతాలకు బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో బ్రాంచ్ మేనేజర్‌తో పాటు మరో ఇద్దరి ప్రమేయం ఉందని ప్రాథమిక విచారణలో సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. ఈ అనుమానాస్పద లావాదేవీలపై బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగా అతని బ్యాంక్‌కు రావడం మానేశాడు. అప్పటి నుంచి అతను పరారీలోనే ఉన్నాడు. ఖాతాదారుకు తెలియకుండా డబ్బు ఎలా మళ్లించారనే కోణంలో దర్యాప్తు సాగుతోందని సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు తెలిపారు.

సత్వర స్పందనతో రికవరీ..

అనధికారిక నగదు బదిలీని గుర్తించిన బ్యాంకు ప్రతినిధులు సత్వరమే స్పందించి నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీసీఆర్పీ) ద్వారా సైబర్ మోసాన్ని ఫిర్యాదు చేశారు. దీంతో మహారాష్ట్ర సైబర్ పోలీసులు దేశంలోని 11 బ్యాంకు ఖాతాలకు బదిలీ అయిన రూ.32.89 కోట్లను ఫ్రీజ్ చేశారు. లేకపోతే మహారాష్ట్రలో సైబర్ మోసాల్లో ఇది అతిపెద్ద కేసుగా నిలిచేది. నిందితులు మరో రూ.4.24 కోట్ల నగదును వివిధ ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన రూ.2.87 కోట్ల నగదును గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో డ్రగ్స్ కలకలం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో శనివారం డ్రగ్స్ పట్టివేత ఘటన కలకలం రేపింది. లక్ష్మీగూడ ఫ్రెండ్స్ కాలనీలోని ఓ ఇంట్లో నార్కోటిక్స్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించగా.. 90 గ్రాముల డ్రగ్స్ బయటపడింది. గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సమాచారం. ముంబైకి చెందిన ఓ యువకుడితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నిందితులు పట్టుబడిన ఇల్లు ఇదే

15 రోజుల్లో పోలీసులకు చిక్కిన మందుబాబులు

2,483 మంది



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ పోలీసులు మందుబాబుల నిషా దింపేస్తున్నారు. నిరంతరం డ్రంకెన్ డ్రైవ్ (డీడీ) తనిఖీలు చేపడుతున్నారు. గత 15 రోజుల్లో (ఈ నెల 12 నుంచి 26 వరకు) కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 2,483 మంది మందుబాబులను పట్టుకున్నారు. వీరిపై ఛార్జ్‌షీట్లు దాఖలు చేసి సంబంధిత న్యాయస్థానాల్లో హాజరుపరిచారు. దీంతో 158 మంది నిషాచరులకు కోర్టులు 1 నుంచి 15 రోజుల పాటు జైలు శిక్షలు విధించాయి. 12 మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ (డీఎల్)లు 3 నుంచి 6 నెలల పాటు సస్పెండ్ చేశారు. రూ.34.02 లక్షల జరిమానాలు విధించాయి. ఈ క్రమంలో శుక్రవారం (ఈ నెల 26) నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నగర పరిధిలో 298 మంది మందుబాబులు పట్టుబడగా.. వీరిపై మోటార్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు. 70 మందికి కోర్టులు 2 నుంచి 8 రోజుల పాటు జైలు శిక్షలు విధించాయి.

టెలీమెడిసిన్ సేవలు షురూ



సాక్షి, సిటీబ్యూరో: అమెరికా వైద్యులతో భారతీయులకు నేరుగా సేవలందించే లక్ష్యంగా 'టెలీ మెడిసిన్ సర్వీస్' ప్రారంభమైంది. 'మై అమెరికన్ డాక్టర్, సెకండ్ ఓపీనియన్' పేరిట వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. రోగులకు అందుతున్న వైద్యం గురించి స్పష్టత ఇచ్చేందుకు, ఇక్కడి చికిత్స సరైనదేనా అనే అనుమానాలను నివృత్తి చేసేందుకు తాము ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామని ఎమర్జెన్సీ మెడిసిన్ నిపుణుడు, మై అమెరికన్ డాక్టర్ సీఈవో డా.రాజ్ నార్ల తెలిపారు. భారత్‌లో అందుతున్న సేవలు ఎంతో అత్యున్నతమైనవని, అయితే.. కొందరు విదేశాల్లో చికిత్స పొందేందుకు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇలాంటి వారికోసం ముందుగానే వారి వ్యాధికి సంబంధించి ఎలాంటి సేవలు అవసరపడతాయో నిర్ధారించుకునేందుకు తమ సేవలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. పైగా అమెరికాలో ఇలాంటి సేవలు అందించే సంస్థల కన్నా చాలా తక్కువ ఫీజుతోనే అనేక రకాల సేవలు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. కార్యక్రమంలో కో ఫౌండర్ డాక్టర్ దీపక్ థామస్, ఐసీయూ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాజన్ గార్గ్, అడిక్షన్ మెడిసిన్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్ డాక్టర్ యోగి గుండం రాజ్, డాక్టర్ డేనియల్ ఫ్రెడ్‌మాన్ పాల్గొన్నారు.

30న తాగునీటి సరఫరాలో అంతరాయం



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్–1 పైపులైన్‌కు పటాన్‌చెరులోని వాల్వ్యూ జోన్ వద్ద వద్ద జంక్షన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో మంగళవారం (ఈ నెల 30న) ఉదయం 6 నుంచి మరుసటి రోజు బుధవారం ఉదయం 6 గంటల వరకు పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. సుమారు 24 గంటల పాటు బీహెచ్ఈఎల్ టౌన్ షిప్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పటాన్ చెరు ఇండస్ట్రియల్ ఏరియా. పటాన్‌చెరు, ఆర్సీపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్ పేట్, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో పూర్తిగా అంతరాయం, మరి కొన్ని ప్రాంతాల్లో లో-ప్రెజర్ తో నీరు సరఫరా ఉంటుంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు సూచించారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న చిరంజీవులు తదితరులు

30న బీసీ మేధావుల సదస్సు

పంజగుట్ట: బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన తాజ్ కృష్ణ హోటల్‌లో 'కుల జన గణన – స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంపు'పై సదస్సు నిర్వహించనున్నట్లు ఫోరం కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని నిర్వాహకులు ప్రొఫెసర్లు ఐ.తిరుమలి, ఎస్.సింహాద్రి, బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావుతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌లో కుల జనగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఎన్నికలకు సిద్ధవుతున్నట్లుగా సమాచారం వస్తుందని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించి వారి జనాభా ఎక్కువ ఎక్కడుందో అక్కడ బీసీలకే సీట్లు కేటాయించి, ఎన్నికలు పూర్తికాగానే వెంటనే కుల జనగణన చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై సదస్సులో చర్చిస్తామని తెలిపారు. బీసీ మేధావులు, బీసీ ప్రజా ప్రతినిధులు అందరిని ఆహ్వానిస్తామని అదే రోజు కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదగిరి, పిడికిలి రాజు, పర్వతం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శునకాలకు జనసంచారం ప్రాంతాల్లో ఆహారం పెట్టొద్దు



ఎమ్మెల్యే కాలనీవాసులతో సమావేశమైన జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు

బంజారాహిల్స్: జన సంచారం ప్రాంతాల్లో వీధి కుక్కలకు ఆహారం పెట్టొద్దని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ వెంటర్నరీ డీడీ చక్రపాణి సూచించారు. ఎమ్మెల్యే కాలనీలోని వేంకటేశ్వర హౌజ్ బిల్డింగ్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో కాలనీవాసులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సుమారుగా 50కి పైగా వీధి కుక్కలు ఉన్నాయని, చాలామంది వాటికి ఎక్కడపడితే అక్కడ వాటికి ఆహారం పెడుతుండడంతో ఇబ్బందులు తలెత్తుతాయని, అలా కాకుండా జనాలు లేని ప్రాంతాల్లో ఆహారాన్ని పెట్టాలని సూచించారు. కాలనీలోని కుక్కలన్నింటికీ స్టెరిలైజేషన్ చేశామని పేర్కొన్నారు. సమావేశంలో వెటర్నరీ విభాగం ఏడీ వివేకానంద, వెటర్నరీ డాక్టర్ నస్రీన్, వేంకటేశ్వర హౌజ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

పంజగుట్ట: దేశంలో ప్రతీ 5 నిమిషాలకు గర్భాశయ కేన్సర్‌తో ఒకరు చనిపోతున్నారని దీనిపై అవగాహన పెంచుకోవాలని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ప్రభావతి అన్నారు. సోమాజిగూడలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేణుకపూర్, గైనకాలజిస్ట్ డాక్టర్ జమునాదేవితో కలిసి గర్భాశయ కేన్సర్ అవగాహన కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ అసోసియేషన్ 75వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో లక్షమంది యువతులను గర్భాశయ కేన్సర్ నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ అంటే కేవలం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పిస్తారని అనుకుంటున్నారని, తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిల్లల్ని ఎలా పెంచాలి, పెంచడంలో తల్లిదండ్రుల మనస్తత్వం ఎలా ఉండాలి, ట్రాన్స్‌జెండర్స్ ఆరోగ్య సమస్యలు చికిత్స అన్నీ చేస్తుంటామని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 114 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాలు ఇచ్చామని ఈ యేడు మొత్తం లక్ష మందిని ఈ వ్యాధి నుంచి కాపాడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యుడు సుహాస్ రావు పాల్గొన్నారు.



అవగాహన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

టైలర్ ట్రిక్స్ యాప్‌తో డిజైనర్లకు ఎంతో మేలు



యాప్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఫిలింనగర్: ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలోని మహిళలతో పాటు కొత్తగా వస్తున్న వారికి టైలర్ ట్రిక్స్ మొబైల్ యాప్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని టైలర్ ట్రిక్స్ సంస్థ చైర్మన్ లావణ్య–కిరణ్ అన్నారు. ఫిలింనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ఈ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం డిజైనింగ్, ఫ్యాషన్ రంగంలోని మహిళలకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరింత మెరుగైన డిజైన్లను తేలికగా వినియోగదారులకు అందించేందుకు ఈ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ శివ సుబ్రమణ్యం, లైఫ్ కోచ్ రమా రావి, వియ్ హబ్ చైర్మన్ రమాదేవి, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీకి మంచి డిమాండ్

బంజారాహిల్స్: సైబర్ సెక్యూరిటీకి మంచి డిమాండ్ ఉందని విద్యార్థులు ఆ దిశగా కూడా ఆలోచిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సైబర్ సెక్యూరిటీ సీఈవో శ్రీరామ్ బిరదవోలు అన్నారు. బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌తో పాటు వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న కాలంలో సైబర్ సెక్యూరిటీలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, విద్యార్థులు వినూత్నంగా ఆలోచించడంతో పాటు సరికొత్త టెక్నాలజీ నేర్చుకునేందుకు ఆసక్తి చూపాలన్నారు. అదేవిధంగా ఎక్కడ హ్యాకథాన్‌లో నిర్వహించినా, ఎక్కడ వర్క్‌షాప్‌లు పెట్టిన వాటిని సందర్శించాలని కొత్త విషయాలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుల్తాన్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, సీఎస్ఈ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సయ్యద్ షబ్బీర్ అహ్మద్, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మహిపాల్ సింగ్ రావత్, రిజిస్ట్రార్ నర్సింహారావు పాల్గొన్నారు.




ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సైబర్ సెక్యూరిటీ సీఈవో శ్రీరామ్ బిరుదవోలు

పబ్లిక్ స్కూల్‌లో 'రసాస్–ది ఎసెన్స్ ఆఫ్ లైఫ్'

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'రసాస్–ది ఎసెన్స్ ఆఫ్ లైఫ్' పేరిట శనివారం నిర్వహించిన ప్రతిభాదర్శన్ కార్యక్రమం ఆకట్టుకున్నది. మనిషిలోని నవరసాలకు సంబంధించి బావోద్వేగాలను నాలుగో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన తీరు అబ్బురపరిచింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మిథుమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా తమలోని నైపుణ్యాన్ని వెలికితీశారన్నారు. పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ రౌద్ర రసానికి బదులు కరుణ, హాస్య రసాలను ఉపయోగించి విద్యార్థుల్లో మార్పును తీసుకురావచ్చన్నారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు.



విద్యుత్ షాక్‌తో నర్సు మృతి



సౌమ్య (ఫైల్)

ఖైరతాబాద్: గదిలో హీటర్ పెట్టుకునే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై యువతి మృతిచెందిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కరీంనగర్‌కు చెందిన కె.సౌమ్య (20) ఖైరతాబాద్‌లో నివాసం ఉంటూ వాసవీ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. శుక్రవారం సాయంత్రం డ్యూటీకి వెళ్లాల్సి ఉండగా సౌమ్య స్నేహితుడు ప్రశాంత్ ఆమెకు ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానంతో రాత్రి 7.30గంటల ప్రాంతంలో గదికి వచ్చి తలుపు తట్టగా తీయలేదు. దీంతో స్థానికుల సాయంతో తలుపులు తెరిచి చూడగా గదిలో బాత్‌రూం పక్కనే సౌమ్య హీటర్ మీదపడి అచేతనంగా కన్పించింది. వెంటనే హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ఆమెను హాస్పిటల్‌కు తరలించగా డ్యూటీ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గదిలో హీటర్ స్విచ్‌ఆన్ చేసి బకెట్‌లో వేసే క్రమంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మృతిచెంది ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. శరీరంపై హీటర్ వల్ల కాలిన గాయాలు ఉన్నాయి. ఈ మేరకు మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బోనాలకు ఆలయాల ముస్తాబు

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ముస్తాబైన బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని ఇందిరానగర్ పోచమ్మ ఆలయం

బంజారాహిల్స్: ఆదివారం జరగనున్న బోనాల వేడుకలకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు రానున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నానికే నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాలకు రంగులతో పాటు విద్యుద్దీపాలు, బంతిపూల హారాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయాల ప్రాంగణాలు, పరిసరాల్లో జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు దెబ్బతిన్న ఫ్లోరింగ్, బండలు, ప్రహరీలకు మరమ్మతులు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో చెత్తాచెదారాన్ని పూర్తిగా ఎత్తేశారు. బోనాలు సమర్పించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆలయాల వద్ద తొక్కిసలాట జరగకుండా బారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గపరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 135 అమ్మవారి ఆలయాలు ఉండగా రూ.52 లక్షల చెక్కులను ఇటీవలే ఆలయ నిర్వాహకులకు అందజేశారు. వీటిని బోనాల నిర్వహణకు ఖర్చు చేయనున్నారు.

భారీ బందోబస్తు..

బోనాల సందర్భంగా ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, సైఫాబాద్, ఖైరతాబాద్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పికెటింగ్‌తో పాటు ప్రతి ఆలయం వద్ద పోలీస్ పహారా పెంచారు. ఇప్పటికే రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల కదలికలపై దృష్టిపెట్టారు. ఆలయ నిర్వాహకులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేసి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో..

వెంగళరావునగర్ : బోనాల వేడుకలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. వెంగళరావునగర్ కాలనీలో శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం, జీటీఎస్ కాలనీలోని జీటీఎస్, మధురానగర్‌లోని కట్ట మైసమ్మ, యాదగిరినగర్‌లోని రేణుకా ఎల్లమ్మ , వీడియోగల్లీలోని బంగారు మైసమ్మ, యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలోని మైసమ్మ తదితర ఆలయాలను ముస్తాబు చేశారు. వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ శనివారం పలు ఆలయాలకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా విద్యుత్, తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆలయ కమిటీ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాల్‌రాజ్, కిట్టు, బాలు రజక, జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డీజీపీని కలిసిన శ్రీనివాసరాజు

బంజారాహిల్స్: తెలంగాణ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జితేందర్‌ను నలంద విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనివాసరాజు లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. సమర్థుడైన అధికారి డీజీపీగా రావడంపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

చిన్నారులపై నేరాలను అరికట్టాలి



బంజారాహిల్స్: చిన్నారులపై నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మానసిక నిపుణురాలు, సామాజిక కార్యకర్త శైలజ అన్నారు. ప్రపంచ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ వారు ఎదుర్కొనే ఇబ్బందులను పసిగట్టాలని సూచించారు. చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించకుండా కఠిన శిక్షలు పడేలా చేయడం యువత ముందున్న కర్తవ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో నిపుణులు, యువతీ యువకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్–2024 పోటీలను రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి, ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జగదీష్, అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఐఫోన్ అప్పగింత

బంజారాహిల్స్: దాసరి అనిశ్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి శనివారం ఉదయం కళాశాలకు వెళ్లే క్రమంలో తన ఐఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ మోలీరాంకు ఈ మొబైల్ దొరికింది. ఓ కాల్ రాగా ఈ ఫోన్ ఎవరిదని పోలీసులు ప్రశ్నించారు. దీంతో అనిశ్‌కు సంబంధించిన ఫోన్‌గా గుర్తించారు. వెంటనే అనిశ్ తల్లి కృష్ణప్రియ నంబర్ తీసుకుని ఆమెకు ఫోన్ చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి ఆమె కుమారుడు పోగొట్టుకున్న ఐఫోన్‌ను అందజేశారు. దీంతో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ మోలీరాంను అభినందించారు.

ఒకరి అరెస్టు

బంజారాహిల్స్: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ ఎక్సైజ్ సీఐ కే వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరిలో నివసించే చల్లా వినయ్ కుమార్ (25) ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. మత్తుకు బానిసై ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కుతూ ఇటీవల ధూల్‌పేట నుంచి 300 గ్రాముల డ్రై గంజాయిని తీసుకువచ్చి వెంకటగిరిలో అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



ఫిలింనగర్: వినాయకనగర్ బస్తీలోని శ్రీఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 26 నుంచి 30 వరకు శ్రీ వినాయకనగర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం కలశరాధన, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఆదివారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. 30న శ్రీఈదమ్మ, శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, బోనాల సమర్పణ ఉంటాయని, అదే రోజు రాత్రి తొట్టెల ఊరేగింపు కూడా ఉంటుందని తెలిపారు.

ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ మేలు



స్టోర్ ఆవిష్కరణలో హీరోయిన్ సంయుక్తా మీనన్, మధుయాష్కీ గౌడ్

పంజగుట్ట: సహజ వనరులకు విఘాతం కలిగించి వెలికి తీసే డైమండ్స్ కన్నా ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ఎంతో మంచివని, అవి కూడా సహజమైన డైమండ్స్‌కు ఏ మాత్రం తీసిపోవని సినీ హీరోయిన్ సంయుక్త మీనన్ అన్నారు. పంజగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన లాడియా ల్యాబ్ గ్రోన్ డైమండ్ స్టోర్‌ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌తో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా లాడియా డైరెక్టర్ వేములూరి అఖిల్ మాట్లాడుతూ నగరంలో ఇది తమ రెండో స్టోర్ అని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

కొటక్ మహీంద్ర బ్యాంక్ పేరిట మోసం

వెంగళరావునగర్: కొటక్ మహీంద్ర బ్యాంక్ పేరిట కస్టమర్‌ను మోసగించి నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్పీఆర్‌హిల్స్ నివాసి ఏ.ప్రకాశ్‌గౌడ్ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. కొన్ని రోజుల కిందట ఓ వ్యక్తి అతనికి ఫోన్ చేసి, అమీర్‌పేట కొటక్ బ్యాంక్‌లో ఖాతా ఉందా అని అడగగా ప్రకాశ్‌గౌడ్ ఉందన్నాడు. ఓటీపీలు ఏమీ పంపలేదు. లింక్‌లు ఏమీ ఓపెన్ చేయలేదు. అయినప్పటికీ ఈనెల 25న రూ.12 వేల వరకు క్రెడిట్ కార్డులోని నగదు డెబిట్ అయ్యాయి. దీంతో బాధితుడు శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ..

మసీదు పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీర్స్ కాలనీకి చెందిన మహ్మద్ జులైద్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 25న తన బైక్‌ను మసీదు పక్కన పార్క్ చేసి సాయంత్రం వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో శనివారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై మాజీ ఉద్యోగి వేధింపులు

వెంగళరావునగర్: మహిళను వేధిస్తున్న బ్యాంక్ మాజీ ఉద్యోగిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఎస్పీఆర్‌హిల్స్‌లో నివసించే మహిళ గతంలో ప్రైవేట్ ఉద్యోగం చేసింది. అప్పుడు ఇండస్ ఇండ్ బ్యాంక్ నుంచి రూ.4 లక్షల రుణం తీసుకుంది. అయితే ఉద్యోగం పోవడంతో ఈఎంఐలు సరిగ్గా చెల్లించలేకపోయింది. ఇటీవల గణేశ్ అనే వ్యక్తి మహిళకు ఫోన్ చేసి తాను ఇండస్‌ఇండ్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నానని ఈఎంఐ చెల్లించాలని కోరగా ఇటీవల రూ.15,300 అతనికి ఫోన్ పే ద్వారా చెల్లించింది. అయితే ఆ నగదును అతడు బ్యాంక్‌లో చెల్లించలేదు. దీంతో బ్యాంక్‌లో విచారించగా గణేశ్ పేరుతో ఫోన్ చేసే వ్యక్తి పేరు నవీన్‌కుమార్ అని ప్రస్తుతం తమ బ్యాంకులో పని చేయడంలేదని తెలియజేశారు. కాగా గణేశ్ అలియాజ్ నవీన్‌కుమార్ వేరే నెంబర్లతో ఆమెకు, తన భర్తకు తరచూ ఫోన్ చేస్తూ దుర్భాషలాడుతూ భార్య భర్తల మధ్య గొడవలు పెడుతున్నాడు. అంతటితో ఆగకుండా బాధితురాలి చెల్లికి కూడా ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నాడు. దాంతో ఆమె శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ చైర్‌పర్సన్ నియామకం



పూజలు నిర్వహిస్తున్న నూతన కమిటీ సభ్యులు

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ శ్రీపోచమ్మ విజయదుర్గా ఆలయ చైర్‌పర్సన్‌గా గొంటి లక్ష్మీ శ్రీనివాసయాదవ్ నియామకమయ్యారు. శనివారం ఆలయంలో కార్యవర్గ సభ్యులకు కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ అభినందనలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు టి.శైలజ, దుబ్బ వరలక్ష్మి, ఏతరి నారాయణ, చెన్నోజి శ్రీనివాస్, ఆడల వీరస్వామి, నేతలు గొంటి శ్రీనివాసయాదవ్, వనం శ్రీనివాసయాదవ్, శరత్‌గౌడ్, చిన్న ముదిరాజ్, హరి, సాయినాథ్‌యాదవ్, ఆలయ పూజారి రఘుచరణ్ పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



శ్రీనగర్‌కాలనీ: బోరబండ బస్టాప్ వద్దనున్న ఆదివారం నిర్వహించనున్న పోచమ్మ ఆలయ బోనాల జాతరకు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి హాజరుకానున్న నేపథ్యంలో ఏసీపీ వెంకటరమణ, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, సీఐ వీరశేఖర్ శనివారం భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ భరత్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ర్యాలీ చేపడుతున్న జాస్మిన్ హైస్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జాస్మిన్ హైస్కూల్ చైర్మన్ జగన్నాథం అన్నారు. రాజీవ్‌నగర్‌కాలనీలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కల వల్ల కలిగే ఉపయోగాలు, పర్యావణంలో జరిగేమార్పులను వివరించి స్థానికులకు మొక్కలు అందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బోనాల వేడుకలు





వేడుకల్లో శ్రీసాయిసరస్వతి నికేతన్ చిన్నారులు

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతీ విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేషధారణలతో హాజరయ్యారు. అనంతరం విద్యార్థినులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలువురు విద్యార్థులు నాటకాల ద్వారా పండగ విశిష్టతను తెలియజేశారు. టీచర్లు, స్టూడెంట్స్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్కూల్ నిర్వాహకులు శిరీష, భవానీశంకర్ తెలంగాణాలో అతిపెద్ద పండుగ, రాష్ట్ర పండుగైన బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, టీచర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

లక్డీకాపూల్: ఆరోగ్య పరిక్షణపై మరింత అవగాహన అవసరమని సర్జికల్ ఆంకాలజీ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ చిన్నబాబు సుంకపల్లి అన్నారు. బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో గ్రేస్ ఫౌండేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీ, ఫ్రాన్సిస్ అల్యూమినీ అసోసియేషన్ సహకారంతో గర్భాశయ కేన్సర్ వ్యాక్సినేషన్ టీకా డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గర్భాశయ కేన్సర్, నివారణ, ముందస్తు టీకా ప్రాముఖ్యతను విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా జోసెఫ్, కరస్పాండెంట్ సీనియర్ కార్మాలి, వైస్ ప్రిన్సిపాల్ సీనియర్ షెర్లీ, ఫ్రాన్సిస్ అలుమ్‌నే టీం సభ్యులు, డాక్టర్ ప్రమీల సుంకవల్లి, గ్రేస్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భవ్య భారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

– స్వామి బోధమయానంద



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ: భవ్యభారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని హైదరాబాద్ రామకృష్ణ మఠం మాజీ అధ్యక్షుడు స్వామి బోధమయానంద పేర్కొన్నారు. ఆధునిక సవాళ్లకు సనాతన పరిష్కారాలను చూపేందుకు స్వామి వివేకానంద బోధనలు తోడ్పడతాయన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో శనివారం జాతీయ విద్యా సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, రామకృష్ణ మఠం మాజీ అధ్యక్షుడు స్వామి బోధమయానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 600 పాఠశాలలు, విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, స్వామీజీలు ఈ దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు నచ్చిన కోర్సును ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. 18 ఏళ్లకు ప్రధానిని ఎన్నుకునే హక్కు వస్తుందని, కానీ నచ్చిన కోర్సు ఎంపిక చేసుకునే హక్కు మాత్రం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారతాన్ని సాధించాలంటే విద్యాసంస్థలు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా తాము ఎంతో ప్రయోజనం పొందామని వారు పేర్కొన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

– రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

మన్సూరాబాద్: ఫొటో అండ్ వీడియోగ్రఫీలో వస్తున్న నూతన టెక్నాలజీని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను శనివారం ఆయనతో పాటు భవనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, వ్యవస్థాపక అధ్యక్షుడు సంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఫొటో టెక్ అధినేత అభిమన్యు రెడ్డి, శైలేందర్, జయమాధురి, తులసి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న వాణి విదేహ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్ లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను మిస్ యూనివర్స్ ఏపీ ఫస్ట్ రన్నరప్ 2024 వాణి విదేహ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడ చేనేతకారులు ఏర్పాటు చేసిన వస్త్రోత్పత్తులను తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ.. 29వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

నోరో వైరస్‌తో జాగ్రత్త

సాక్షి, సిటీబ్యూరో: నోరో వైరస్ గురించి ఎక్స్(ట్విట్టర్) వేదికగా జీహెచ్ఎంసీ నగర ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించింది. కలుషిత నీరు, ఆహారం వల్ల ఈ వైరస్ సోకే అవకాశం ఉన్నందున వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించింది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసుకోవాలని తెలిపింది. చలిజ్వరం, వాంతులు, విరేచనలు, నీరసం, కడుపునొప్పి, డీహైడ్రేషన్ వ్యాధి లక్షణాలని తెలిపింది.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి



కేంద్రమంత్రుల చిత్రపటాలను దహనం చేస్తూ..

ఉస్మానియా యూనివర్సిటీ: బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం మొండి చేయి చూపినందుకు నిరసనగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు రాజీనామా చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రానికి ఒక్క రూపాయికూడా ప్రకటించనందుకు నిరసనగా మంత్రుల చిత్రపటాలను దహనం చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకరాలేకపోయిన మంత్రులను తెలంగాణలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షులు మెడ శ్రీను, అభి, వినయ్‌కుమార్, శివ, సుమన్‌గౌడ్, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆగస్టు 29 నుంచి ఎలక్ట్రిక్ ఎక్స్‌పో

బంజారాహిల్స్: సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ ట్రేడర్స్ అసోసియేషన్ (సెటా) ఆగస్టు 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ ఎక్స్‌పో నిర్వహిస్తోందని, జాతీయ స్థాయిలో పేరొందిన ఎలక్ట్రిక్ కంపెనీలు, బ్రాండ్‌లు ఇందులో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ ఎక్స్‌పో ఇదేనని సెటా అధ్యక్షుడు సురేష్‌జైన్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎక్స్‌పోలో సుమారు 180 వరకు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెక్రటరీ జీత్‌సేథ్, ఉపాధ్యక్షుడు బిజూపంచారత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ ప్లానింగ్‌లో

బదిలీలు షురూ..

- ఆన్ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి స్థానచలనం
- త్వరలో అంతర్గత బదిలీలు
- జోన్ల విస్తరణ దిశగా అడుగులు..
- ప్లానింగ్ విభాగం బలోపేతంపై సర్కార్ దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ప్రణాళికా విభాగంలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు ప్లానింగ్ అధికారులను ప్రభుత్వం వివిధ విభాగాలకు బదిలీ చేసింది. అలాగే ఆయా స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించింది. త్వరలో పూర్తిస్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. ప్లానింగ్ విభాగంలో ఘట్‌కేసర్ జోన్ అధికారిగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్ మెట్రో రైల్‌కు బదిలీ చేశారు. శంషాబాద్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న రాంరెడ్డి కొత్తగా ఏర్పాటైన హైడ్రాకు బదిలీ అయ్యారు. అలాగే శంకర్‌పల్లి జోన్‌లో పనిచేస్తున్న కోటేశ్వర్‌రావు అనే మరో అధికారిని కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేశారు. అలాగే వారి స్థానంలో జీహెచ్ఎంసీ నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, హైదరాబాద్ మెట్రో రైల్ నుంచి రాజశేఖర్, కరీంనగర్ నుంచి సుభాష్ అనే మరో ముగ్గురు అధికారులు హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. మరోవైపు అసిస్టెంట్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సుమిత్ర హెచ్‌ఎండీఏ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ కాగా, ఆమె స్థానంలో జీహెచ్ఎంసీ నుంచి రాహుల్ అనే మరో అధికారి హెచ్‌ఎండీఏకు బదిలీ అయ్యారు. అలాగే జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ప్రసాద్‌రావు, మల్లికార్జున్‌రావు అనే మరో ఇద్దరు అధికారులు చీఫ్ ప్లానింగ్ అధికారులుగా హెచ్‌ఎండీఏకు రానున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను విడుదల చేసింది. బదిలీ అయిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధులు చేరనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిని ట్రిబుల్ ఆర్ వరకు విస్తరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రణాళికా విభాగంలో ఆన్ డెప్యూటేషన్‌పై పని చేస్తున్న వారిని బదిలీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం సంస్థాగతంగా ప్లానింగ్‌తో సహా అన్ని విభాగాలను బలోపేతం చేయనున్నట్లు సమాచారం.

జోన్‌ల విస్తరణ..

ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల పరిధిలో సుమారు 7,200 చదరపు కిలోమీటర్ల వరకు హెచ్‌ఎండీఏ విస్తరించింది. ట్రిపుల్ ఆర్ వరకు పరిధి పెంచడం వల్ల మరో 3000 చదరపు కిలోమీటర్లు అదనంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్లానింగ్ విభాగం పరిధి కూడా పెరగనుంది. ఇందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరుతూ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లలోనే ఫైళ్ల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది. పనిభారం వల్ల అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కొత్త వారిని నియమిస్తే తప్ప ట్రిపుల్ ఆర్‌కు అనుగుణంగా జోన్ల విస్తరణ సాధ్యం కాదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రణాళికా విభాగంలో శంకర్‌పల్లి, ఘట్‌కేసర్, మేడ్చల్, శంషాబాద్ జోన్లు ఉన్నాయి. లే అవుట్లు, భవన నిర్మాణాలు, ఆక్యుపెన్సీలు, టీడీఆర్‌లు, ఎల్‌ఆర్‌ఎస్‌లు తదితర అనుమతులన్నీ ప్రస్తుతం ఈ నాలుగు జోన్ల నుంచే లభిస్తున్నాయి. దశాబ్దకాలంగా హెచ్‌ఎండీఏ పరిధి అనూహ్యంగా నాలుగు రెట్లు పెరిగింది. కానీ ఇందుకు అనుగుణంగా జోన్లు, ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మాత్రం పెరగలేదు. ప్రస్తుతం ఉన్న 4 జోన్లను 6 నుంచి 8కి పెంచడంతో పాటు అదనపు సిబ్బంది నియామకం కూడా చేపట్టాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉన్న 4 జోన్లను 8కి పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశారు.

అభివృద్ధి సమంగా..

హైదరాబాద్ మహానగర విస్తరణ వల్ల హెచ్‌ఎండీఏ బాధ్యతలు మరింత పెరగనున్నాయి. తాజా బడ్జెట్‌లోనూ ప్రభుత్వం నగర శివారు ప్రాంతాల్లో టౌన్‌షిప్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో కొత్తగా టౌన్‌షిప్‌ల కోసం ప్రణాళికలను రూపొందించడం, లే అవుట్లను సిద్ధం చేయడం వంటి కార్యక్రమాల్లో ప్రణాళికా విభాగం కీలకంగా పని చేయాల్సిన ఉంటుంది. అలాగే రోడ్లు, రవాణా, మౌలిక సదుపాయాల విస్తరణ, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయడం వంటి ప్రాజెక్టులను హెచ్‌ఎండీఏ చేపట్టనుంది. ఇందుకు అనుగుణంగా హెచ్‌ఎండీఏను మరింత బలోపేతం చేయనున్నారు. 'భవిష్యత్తు అవసరాల మేరకు నగర నిర్మాణం కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసే విధంగా హెచ్‌ఎండీఏ కార్యాచరణ ప్రణాళికలు ఉంటాయని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

మోడల్ ఎఫ్‌సీఐగా మార్చేందుకు నిర్ణయం

చర్లపల్లి ఎఫ్‌సీఐని సందర్శించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంపీ ఈటల



చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎఫ్‌సీఐని సందర్శిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

కుషాయిగూడ: చర్లపల్లి భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి శనివారం సందర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన చర్లపల్లి ఎఫ్‌సీఐని కేంద్ర ప్రభుత్వం మోడల్ ఎఫ్‌సీఐగా తీర్చిదిద్దాలన్న నేపథ్యంలో మంత్రి ఎఫ్‌సీఐ పర్యటనకు వచ్చారు. ఎఫ్‌సీఐని సందర్శించిన ఆయన గోదాం స్థితిగతులను తెలుసుకున్నారు. లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన చర్లపల్లి ఎఫ్‌సీఐని భవిష్యత్తులో మోడల్ ఎఫ్‌సీఐగా మార్చడంపై ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ ప్రభాకర్, జిల్లా, ఏరియా మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎఫ్‌సీఐ శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు మంత్రి, ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌సీఐలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు నార్త్ ఇండియాలో కార్మికులకు అందజేస్తున్న అన్ని రకాల బెనిఫిట్స్‌ను సౌత్‌లోనూ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక్ యూనియన్ సెంట్రల్ కమిటీ సభ్యులు టి.ఐలయ్య, ఎం.నర్సింహ, కె.శ్రీనివాస్, బి.మల్లేశ్‌తో పాటు ప్రతినిధులు జి.ఐలయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాం

– తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహించడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కోఠి డీఎంఈ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బరిగల రమేష్, పల్లం ప్రవీణ్, లాలుప్రసాద్ రాథోడ్, నరహరి మాట్లాడారు. గత పదేళ్లు బదిలీలు లేక వైద్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. జీఓ 80 ప్రకారం.. 4 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వైద్యులను 40 శాతానికి మించకుండా ప్రభుత్వం బదిలీలు చేపట్టడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. బదిలీలపై గుర్తింపులేని కొన్ని వైద్య సంఘాలు చేసిన ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంతేగాకుండా బదిలీలు జరిగే క్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య విధాన పరిషత్, డీఎంఈలలో ఉద్యోగులను సీనియార్టీలలో, కొన్ని క్యాడర్లలో తప్పిదాలు జరిగాయని, వాటిని వెంటనే గుర్తించి కమిషనర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా డాక్టర్ల బదిలీలు అన్ని క్యాడర్లలో నిర్వహించారన్నారు. జీఓ నంబర్–3171ల మల్టీజోన్ 1, 2లలో జోనల్ బదిలీలలో నర్సింగ్, ఇతర సిబ్బంది సీనియార్టీ దృష్టిలో జాప్యం జరిగినందున దాన్ని గుర్తించి బదిలీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ రావూఫ్, డాక్టర్ రాథోడ్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు..

- మాదాపూర్‌లోని శిల్పారామం ఆంపి థియేటర్‌లో సాయంత్రం 5.30గంటలకు కువైట్‌కి చెందిన నాట్యవేద చల్లా వేదవల్లి ప్రసాద్ అధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది.
- ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఉదయం పాత బస్తీలోని పల ఆలయాల్లో బోనాల సంబరాలు జరుగుతాయి. ఉత్సవాల్లో ఆయా దేవాలయాల్లో అమ్మవార్లకు మంత్రులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి అధ్వర్యంలో మహంకాళి దేవాయం, పోచమ్మ దేవాలయాల్లో బోనాల వేడుక జరుగుతుంది.
- ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారకోపన్యాసం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది.

అంతరిక్షంలో అద్భుతాలెన్నో..

- రాష్ట్రపతి నిలయంలో అవుట్ రిచ్ కార్యక్రమం
- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎన్ఆర్ఎస్‌సీ



చంద్రయాన్ విశేషాలను తెలుసుకుంటున్న పాఠశాలల విద్యార్థులు

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహకారంతో ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థుల కోసం శనివారం అవుట్ రిచ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ జి.కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా.ఏపీజే. అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపగ్రహాల ద్వారా ప్రదేశాన్ని ట్రాక్ చేయడం, గ్లోబల్ నావిగేషన్ సపోర్ట్ సిస్టమ్, శాటిలైట్ సర్వర్ల ద్వారా ఏటీఎంల పనితీరు, వాతావరణ ఉపగ్రహాల ద్వారా వాతావరణ నివేదికలు, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా తుఫాన్ల సమాచారం తదితర అంశాల గురించి పాఠశాలల విద్యార్థులకు వివరించారు. కేవీ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ చంద్రయాన్–3 చంద్రుడిపై విజయవంతంగా దక్షిణ ధ్రువం వైపు ల్యాండింగ్ సందర్భంగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పరిపాలనాధికారి రజనీప్రియ, సుమారు మూడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'లాల్‌దర్వాజ' నిధులను

కొత్త అకౌంట్‌లో డిపాజిట్ చేయండి

- దేవాదాయ శాఖ అధికారులకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశం
- సింగిల్ జడ్జి తుది తీర్పు మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ బోనాలను ఆచారాల మేరకు ఎప్పటిలాగే ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ కొత్త బ్యాంక్ అకౌంట్ తెరిచి రెండు రోజుల్లో వచ్చిన ఆదాయాన్ని అందులో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు స్పష్టం చేసింది. ఆ అకౌంట్‌ను అతనే నిర్వహించాలని చెప్పింది. మరోసారి ఇరు పక్షాల వాదనలు వినాలని సింగిల్ జడ్జిని ఆదేశిస్తూ.. నిధులపై అందులో తీర్పు మేరకు చర్యలు ఉంటాయని వ్యాఖ్యానించింది. దేవాదాయ అధికారులతో కుమ్మక్కై కొందరు లాల్‌దర్వాజ శ్రీసింహవాహిని మహంకాళి ఆలయ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ భక్తుడు గోవింద్‌కుమార్ 2023 నవంబర్ 17న కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై విచారణ జరిపిన అసిస్టెంట్ కమిషనర్.. నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరుగుతున్నట్లు ఫిబ్రవరి 1న నివేదిక అందజేశారు. అయినా దీనికి కారకులైన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గోవింద్ హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 'ఫిబ్రవరి 1న దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ప్రకారం అధికారులు చర్యలు చేపట్టాలి. లాల్‌దర్వాజా శ్రీసింహవాహిని మహంకాళి ఆలయ నిధులు దుర్వినియోగం కాకుండా కొత్త బ్యాంక్ అకౌంట్ తెరవాలి. జూలై 28, 29 తేదీల్లో జరిపే బోనాల పండగ సమయంలో సేకరించే నిధులు కొత్త అకౌంట్‌లో అధికారులు డిపాజిట్ చేసేలా చర్యలు చేపట్టాలి' అని ఈ నెల 12న ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ సింహవాహిని మహంకాళి ఆలయ ట్రస్ట్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రస్ట్ వాదనలు వినకుండా తీర్పు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసింది. మరోసారి విచారణ జరిపి ఇరుపక్షాల వాదనలు వినాలని సింగిల్ జడ్జిని ఆదేశించింది.

ప్రతిభ ఎవరి సొత్తు కాదు

- హైకోర్టు న్యాయమూర్తి సుధ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిభ ఎవరి సొత్తు కాదని విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యతను సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుధ అన్నారు. అంబేద్కర్ లా కాలేజీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మ్యూట్ కోర్టు పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 16 బ్యాచీలు పాల్గొనగా పెండెకంటి లా కాలేజీ హైదరాబాద్‌కు ప్రథమ బహుమతి, అంబేద్కర్ లా కాలేజీ వైజాగ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. విజేతలకు బహుమతులు అందజేసిన ఆమె మాట్లాడుతూ సాధారణ, పేద, మధ్య తరగతి ప్రజలకు సక్రమంగా న్యాయం అందేలా యువ న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. మ్యూట్ కోర్టుల ద్వారా విద్యార్థులకు కోర్టులో జరిగే కార్యక్రమాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధికాయాదవ్, సీనియర్ ప్రొఫెసర్ మహేంద్రకుమార్ బండారి, ప్రొఫెసర్ కె.వి.ఎస్.శర్మ, అంబేద్కర్ విద్యా సంస్థల కార్యదర్శి వివేక్‌వెంకటస్వామి, సహాయ కార్యదర్శి రమణ, డైరెక్టర్ రిషికాంత్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాలు

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులు, లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ, పీజీ, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరగనున్నాయి. ఆయా కోర్సుల్లో తెలంగాణలోని స్టడీ సెంటర్లలో చేరేందుకు విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను www.braouonline.in; www.braou.ac.inలో పొందొచ్చని అధికారులు వెల్లడించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు కూడా ఆగస్టు 18 లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. సమాచారం కోసం 7382929570/580, 040–23680290/291/294/295 టోల్‌ఫ్రీ నెం.18005990101లో సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ శాఖలో పోస్టింగ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇస్తూ జిల్లా రెవెన్యూశాఖాధికారి శనివారం ఆదేశాలు జారీ చేశారు. 8 మంది తహసీల్దార్లు, 23 మంది నాయబ్ తహసీల్దార్లు, 13 మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 36 మంది సీనియర్ అసిస్టెంట్లకు కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలతో పాటు రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ ఆఫీసుల్లో పోస్టింగ్‌లు కేటాయించారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం)లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిని ప్రేమ పేరుతో, ఇతర మహిళలను ఇతర విధాలుగా వేధించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సోమభరత్ భాగోతం వెల్లడైన నేపథ్యంలో జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల్ని గుర్తించేందుకు, వాటి పరిష్కారానికి కమిషనర్ ఆమ్రపాలి చర్యలు చేపట్టారు. ఇందుకుగాను ముగ్గురు మహిళా అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఐటీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, పరిపాలన విభాగం అడిషనల్ కమిషనర్ జి.నళినీపద్మావతి, హెల్త్ విభాగం అడిషనల్ కమిషనర్ ఎస్.పంకజను కమిటీ సభ్యులుగా నియమించారు. దీంతోపాటు మరో రెండు కమిటీలను ఆమ్రపాలి నియమించారు. జోన్ల పరిధిలో హార్టికల్చర్, తదితర పనులు త్వరితంగా జరిగేందుకు ఎంపానెల్ కోసం తగిన అర్హతలున్న కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్టులను ఎంపిక చేసేందుకు విధివిధానాల రూపకల్పనకు కమిటీని ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, యూబీడీ అడిషనల్ కమిషనర్ డా.ఎస్.సునందరాణి, చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నను ఈ కమిటీ సభ్యులుగా నియమించారు. నగర వ్యాప్తంగా ఎక్కువకాలం మన్నికగా ఉండేలా సుందరీకరణ పనులు చేపట్టేందుకు, సదరు పనుల్ని జోన్ల వారీగా గుర్తించేందుకు ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్లు అనురాగ్‌జయంతి, అపూర్వ్ చౌహాన్, ఆర్.ఉపేందర్‌రెడ్డితో మరో కమిటీని నియమించారు.

30 నుంచి ఇంటింటి సర్వే

- జీఐఎస్ మ్యాపింగ్‌లో భాగంగా..
- ప్రజలు సహకరించాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే జూలై 30 నుంచి ప్రారంభం కానుంది. తొలుత ఉప్పల్, హయత్‌నగర్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో ఈ సర్వే జరగనుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. ఈ సర్వేలో భాగంగా శాటిలైట్ సర్వే పూర్తి కాగా, డ్రోన్ సర్వే జరుగుతోంది. మరోవైపు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, వనరుల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన ఈ సర్వేకు ఇళ్లలో నివసిస్తున్నవారు, యజమానులు సహకరించాల్సిందిగా కోరారు. సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలన్నారు. పట్టణ నిర్వహణ, అభివృద్ధి పనుల కోసం తప్ప ఈ సర్వేను ఇతరత్రా వినియోగించబోమని, సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల అన్ని ఆస్తులు, యుటిలిటీల వివరాలు కచ్చితంగా మ్యాపింగ్ చేయడం వల్ల భౌగోళికంగా గుర్తించడం సులభమవుతుందని, సమాచారం పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఆస్తిపన్నుకు సంబంధించి ప్రజల సమస్యల పరిష్కారంలోనూ ఇది ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభం కాగలవని పేర్కొన్నారు. హై రిజల్యూషన్ మ్యాపింగ్ వల్ల రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొన్నారు.

- ఇంటింటికీ సర్వే కోసం వచ్చే సిబ్బందికి దిగువ సమాచారం అందించి సహకరించాలని కోరారు.
- భవన నిర్మాణ అనుమతి వివరాలు
- చివరిసారి చెల్లించిన ఆస్తిపన్ను రసీదు
- నల్లా బిల్లు
- విద్యుత్ బిల్లు
- యజమాని ఐడీ వివరాలు
- ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాలకు)

ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు వాత

రూ.80 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

సిటీ కోర్టులు: ప్రయాణికుడి లగేజీని అందించడానికి 17 రోజుల సమయం తీసుకున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ తీరును హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ తప్పుబట్టింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని స్పష్టం చేసింది. 17 రోజులపాటు ప్రయాణికుడు పడిన వేదన, సౌకర్యానికి పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పింది. లగేజీ లేకపోవడంతో కొనుగోలు చేసిన వస్తువులకు రూ.50 వేలు, పరిహారంతో పాటు కోర్టు ఖర్చులకు మరో రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్–1 కమిషన్ అధ్యక్షులు బి.ఉమా వెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి.లక్ష్మీ ప్రసన్న, డి.మాధవీలతతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

వివరాల్లోకి వెళ్తే..

నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ జావేద్ అఖ్తర్ జైది.. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో గతేడాది జూన్ 27న జెద్దా నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించారు. తన బ్యాగులను చెకిన్ లగేజీలో వేశారు. అయితే విమానం హైదరాబాద్ చేరినా అందులో ఆయన బ్యాగులు కనిపించలేదు. దీంతో ఇండిగో నిర్వాహకులకు ఫిర్యాదు చేయగా 12 గంటల్లో బ్యాగులను అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే 12 గంటలు కాదు కదా.. 24 గంటలు గడిచినా ఆ బ్యాగులను అందిచలేదు. ఆ బ్యాగులను 17 రోజులు తర్వాత వారికి అందజేసింది. నిత్యం వాడుకునే అన్ని వస్తువులు ఆ బ్యాగుల్లో ఉండటంతో అఖ్తర్ జైది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అవసరమైన వస్తువులను తిరిగి కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తన లగేజీ అందించడానికి 17 రోజుల సమయం పట్టిందంటూ ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కమిషన్ బాధితుడికి పరిహారం చెల్లించాలంటూ తీర్పు ఇచ్చింది.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతన బకాయిలు చెల్లించండి

లక్డీకాపూల్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులతో పాటు గౌరవ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఫిబవరి, జూలై మాసాల్లోనే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు పదవీ కాలం ముగిసిందన్నారు. ఇప్పటికైనా బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో చాంబర్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్దార్థ, కార్యదర్శి మందిపాల్ వెంకట్, సలహాదారు పపుస్కూరు అశోక్‌రావు తదితరులు ఉన్నారు.



'జిమ్‌క్వీన్ 2024'..

స్పోర్టోపియా వేదికగా 2 రోజుల పాటు జిమ్నాస్టిక్స్ టోర్నీ

13 రాష్ట్రాల నుంచి 600 మంది జిమ్నాస్టులు హాజరు..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గాడియం స్కూల్ స్పోర్టోపియా వేదికగా నిర్వహిస్తున్న 'జిమ్‌క్వీన్ 2024' జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో అథ్లెట్‌ల నైపుణ్యాలు అలరిస్తున్నాయి. దేశంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో 13 రాష్ట్రాల నుంచి 600 మంది జిమ్నాస్టులు పాల్గొంటున్నారు. శనివారం ప్రారంభ వేడుకల్లో మెదక్ పార్లమెంటు సభ్యులు, తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేలా జాతీయ క్రీడాకారులను తయారుచేస్తున్న గాడియం స్పోర్టోపియా అద్భుత క్రీడా వేదికని రఘునందన్ రావు అన్నారు. గాడియం చైర్మెన్ నిత్యానంద రెడ్డి, వ్యవస్థాపకులు కీర్తి రెడ్డి, సీఈఓ రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.









పారిస్‌లో స్టార్స్

సాక్షి, సిటీబ్యూరో: పారిస్ వేదికగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన 2024 ఒలింపిక్ పోటీలకు దేశం నుంచి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ పోటీలను తిలకిచడానికి నగరం నుంచి మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా పారిస్ వెళ్లారు. కుటుంబ సభ్యులు సురేఖ, రామ్‌చరణ్, ఉపాసనతో పాటు మనుమరాలు క్లీంకారతో తీసుకున్న ఫొటోలను సోషల్ యాప్‌లో పోస్ట్ చేస్తూ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ప్రముఖ వ్యాపారవేత్త, ఫ్యాషన్ ఐకాన్ సుధారెడ్డి కూడా పారిస్ ఒలింపిక్స్‌లో మెరిశారు. అయితే 117 మందితో కూడిన భారత ఒలింపిక్ క్రీడాకారుల బృందంలో నగరం నుంచి నలుగురు మహిళా అథ్లెట్లు పాల్గొంటున్నారు. అంతేకాకుండా భారత జాతీయ ఫ్లాగ్ బేరర్‌గా తెలుగమ్మాయి పీవీ సింధూ నాయకత్వం వహించడం విశేషం. జాతీయ జెండా రంగులతో రూపొందించిన చీరతో పీవీ సింధూ షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

ఒడ్డున చేరే అలల్లాంటివి వారి జీవితాలు.. ఐనప్పటికీ ఎగిసిపడే కెరటాల్లా తెరచాపలై దూసుకుపోతోంది వారి చైతన్యం. చాలామందికి సెయిలింగ్ అంటే ఏంటో కూడా సరిగా తెలియని తరుణంలో.. ఇదే సెయిలింగ్‌లో నేషనల్ చాంపియన్‌లుగా నిలుస్తున్నారు ఆ అక్కాచెల్లెళ్లు.. పేదరికం అడ్డంకి కాకుండా యాచ్ క్లబ్ అందిస్తున్న సహకారంతో రసూల్‌పుర ఉద్భవ్ స్కూల్లో 8, 10 తరగతులు చదువుతున్న కొమరవెల్లి దీక్షిత, కొమరవెల్లి లాహరిలు టాప్ సెయిలింగ్ సిస్టర్స్‌గా రాణిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగానే కాకుండా భారత్ తరపున విదేశాల్లోనూ సెయిలింగ్ పోటీల్లో పాల్గొంటూ దేశ కీర్తికి భవిష్యత్ వారధులుగా నిలుస్తున్నారు. వివిధ క్రీడల్లో నగరానికి చెందిన సానియా మీర్జా, సైనా నెహ్వాల్, పీవీ సింధూ, నిఖత్ జరీనా రాణించినట్టే.. రానున్న కాలంలో సెయిలింగ్ క్రీడకూ ఈ అక్కాచెల్లెళ్లు కేరాఫ్ అడ్రస్‌గా మారతారేమో.. - సాక్షి, సిటీబ్యూరో

సెయిలింగ్ సిస్టర్స్..

తెర చాపలపై రాణిస్తున్న అక్కా చెల్లెళ్లు..



- ప్రతిష్టాత్మక సెయిలింగ్ పోటీల్లో జాతీయ స్థాయి పతకాలు..
- లండన్, కొరియాలో దీక్షిత, నేషనల్స్‌లో లహరి రాణింపు..
- విద్య, సెయిలింగ్‌లో యాచ్ క్లబ్ సహాయం

లహరి విజయాలు-పతకాలు..

- బంగారు పతకం- ఆప్టిమిస్ట్ బాలికల విభాగం, మొదటి వైఏఐ నార్త్ ఈస్ట్ రెగట్టా 2023.
- వెండి పతకం- ఆప్టిమిస్ట్ బాలికల విభాగం, వైఏఐ 3వ సికింద్రాబాద్ క్లబ్ యూత్ రెగట్టా 2023.
- కాంస్యం- ఆప్టిమిస్ట్ వైఏఐ యూత్ నేషనల్స్ 2022.
- కాంస్యం- ఆప్టిమిస్ట్ 2వ వైఏఐ నార్త్ ఈస్ట్ రెగట్టా 2024.
- వెండి పతకం- ఆప్టిమిస్ట్ బాలికల విభాగం 2వ వైఏఐ నార్త్ ఈస్ట్ రెగట్టా 2024.

ముంగ్గురు ఆడపిల్లలున్న కుటుంబం అది. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితులు.. సామాన్య జీవనమే గగనమైన తరుణంలో అనితర సాధ్యమైన సెయిలింగ్ పోటీల్లో చాంపియన్‌లుగా నిలుస్తున్నారంటే ఆ అక్కాచెల్లెల్ల ఆత్మ స్థైర్యమేంటో ఊహించవచ్చు. వీరి సామర్థ్యాలను గుర్తించిన నగరంలోని యాచ్ క్లబ్ వ్యవస్థాపకులు సుహేమ్ షేక్ వారి విద్యతో పాటు సెయిలింగ్ శిక్షణకు సహకారం అందిస్తున్నారు. అందివచ్చిన సహకారాన్ని వినియోగించుకుంటూ..

ఈ హైదరాబాదీ సెయిలర్లు జాతీయ స్థాయిలో పతకాల పంట పండించారు. సౌత్ కొరియా, భారత్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో దీక్షిత కొమురవెల్లి పోటీపడింది. ప్రస్తుతం లండన్ వేదికగా జరుగుతున్న మరో అంతర్జాతీయ సెయిలింగ్ పోటీల్లో పతకం కోసం పోరాడుతోంది. ఈ మధ్యనే జరిగిన ఓ ప్రమాదంలో చెయి విరగడంతో లండన్ వేదికగా ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ పోటీలకు వెళ్లలేకపోయానని లహరి బాధను వ్యక్తం చేసింది. అయితే కొన్ని రోజుల క్రితమే నగరం వేదికగా జరగిన 15వ మాన్‌సూన్ రెగట్టా పోటీల్లో అదే గాయంతోనే పోటీ చేసి అందరి ప్రశంసలను పొందింది చెల్లి. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న మొదటమ్మాయి కూడా సెయిలింగ్‌లో ప్రవేశముంది. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల సెయిలింగ్‌ను కొనసాగించలేకపోయిందని తల్లి కవిత తెలిపింది. పిల్లల చదువులు, సెయిలింగ్ శిక్షణతో పాటే తనకు కూడా యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో వంట వండటానికి ఉద్యోగమిచ్చి ఉపాధి అవకాశాన్ని కల్పించారని సంతోషాన్ని వ్యక్తం చేసింది.

దీక్షిత విజయాలు-పతకాలు

- కాంస్యం- అప్టిమిస్ట్ బాలికల విభాగం వైఏఐ జూనియర్ నేషనల్స్ 2022.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం 14వ మాన్‌సూన్ రెగట్టా 2023.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం వైఏఐ 3వ సికింద్రాబాద్ క్లబ్ యూత్ రెగట్టా 2023.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం వైఏఐ యూత్ నేషనల్స్ 2023.
- వెండి పతకం- అప్టిమిస్ట్ వైఏఐ జూనియర్ నేషనల్స్ 2023.
- వెండి పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం వైఏఐ జూనియర్ నేషనల్స్ 2023.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం సెయిల్ ఇండియా 2024.
- వెండి పతకం- అప్టిమిస్ట్ 2వ వైఏఐ నార్త్ ఈస్ట్ రెగట్టా 2024.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం 2వ వైఏఐ నార్త్ ఈస్ట్ రెగట్టా 2024.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం వైఏఐ 4వ సికింద్రాబాద్ క్లబ్ యూత్ రెగట్టా 2024.
- బంగారు పతకం- అప్టిమిస్ట్ బాలికల విభాగం 15వ మాన్‌సూన్ రెగట్టా 2024.





- పబ్స్ నుంచీ టూర్స్ దాకా చెట్టాపట్టాల్
- జిమ్ వర్కవుట్స్‌కైనా, నైట్ పార్టీస్‌కైనా..
- అం'తరాలు' తుంచుకుంటూ.. ఆంతర్యాలు పంచుకుంటూ
- ఫ్రెండ్లీ పేరెంటింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత
- నేడు ఇంటర్నేషనల్ పేరెంట్స్ డే

డ్రెస్సింగ్ స్టైల్స్‌లో గానీ.. అదిరిపోయే స్టెప్స్‌లో గానీ మాకు మేమే సాటి అన్నట్టుగా కనిపిస్తున్నారు.. డ్యాన్స్ ఫ్లోర్ మీద వారిద్దరినీ చూస్తే కళ్లు తిప్పుకోలేకపోయారు..'హేయ్, నీకు తెలుసా? వాళ్లిద్దరూ మామ్ అండ్ సన్ అట'... అంటూ వింతగా చెప్పుకుంటున్నారు. నగరంలో ఇలాంటి నృత్యాలు నిత్య కృత్యాలుగా మారుతున్నాయి. అహాలను వదిలేస్తున్న తల్లిదండ్రులు, పిల్లలకు నమ్మలేనంత స్నేహాల్ని పంచుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

నేను తండ్రిని కాబట్టి నా మాట వినాలి.. నేను తల్లిని కాబట్టి నాకు విలువ ఇవ్వాలి.. అంటూ పిల్లల మీద అజమాయిషీ చేస్తే.. చెల్లుబాటయ్యే కాలం కాదిది. పిల్లలపై పెత్తనం చెలాయించాలని కాకుండా వాళ్లలో తమ పట్ల స్నేహమనే విత్తనం మొలకెత్తాలని తల్లిదండ్రులు తపిస్తున్నారు. దానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి.

నేర్పుగా.. నేస్తంగా..

'పిల్లలతో గ్యాప్ ఉండకూడదంటే స్నేహం చేయాలి. వీలైనంత వరకూ వారితో ఆటలు, పాటలతో సరదాగా గడుపుతా' అంటున్నారు బంజారాహిల్స్‌లో నివసించే ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ సుచిర్ ఇండియా అధినేత లయన్ డా.వై.కిరణ్. వ్యాపార వ్యవహారాలతో బిజీగా గడిపే ఆయన తన కుమార్తెలు రూపాలీ, దీప్‌శిఖలతో గడిపే సమయం మాత్రం అమూల్యం అంటారు. 'పిల్లలకు ఏ రకమైన మంచి నేర్పాలన్నా నేస్తంగా మారడం ఒక్కటే మార్గం' అని స్పష్టం చేస్తున్నారు. ఆయనలాగే చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తాము ఏదైనా నేర్పడానికి నేస్తాలుగా మారడాన్నే ఏకైక మార్గంగా ఎంచుకుంటున్నారు.



తండ్రి కిరణ్‌తో కుమార్తెలు రూపాలీ, దీప్‌శిఖ

సన్నిహితమైతేనే..హితం..

'మా అబ్బాయి విధాన్‌కి నన్ను మించిన ఫ్రెండ్ ఎవరూ లేరు' అంటూ సగర్వంగా చెబుతారు ఈస్ట్ మారేడ్‌పల్లి నివాసి సుశీలా బొకాడియా. పబ్స్‌లో కావచ్చు, పేజ్ త్రీ పార్టీస్‌లో కావచ్చు.. ఈ తల్లీ కొడుకులు ఇద్దరూ సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తుంటారు. పిల్లల పట్ల స్నేహహస్తం చాస్తున్న ఆధునిక తల్లిదండ్రుల వైఖరికి సుశీల అచ్చమైన నిదర్శనంగా నిలుస్తారు. 'తన వ్యక్తిగత విషయాలు నాతో పంచుకునేటప్పుడు నన్ను క్లోజ్ ఫ్రెండ్‌లా భావిస్తాడు' అని చెబుతారామె. ఖచ్చితంగా ఇలాంటి భావన తమ పిల్లల్లో స్థిరపడడానికే పేరెంట్స్ ఇలా తమను తాము మలచుకుంటున్నారని చెప్పొచ్చు.



తల్లి సుశీలా బొకాడియాతో విధాన్

స్నేహసిరి.. ఉభయకుశలోపరి..

'మా అబ్బాయితో స్నేహం వల్ల నాకు వయసు రోజు రోజుకూ తగ్గిపోతున్నట్టు అనిపిస్తోంది' అని చెప్పారు లోయర్ ట్యాంక్ బండ్ నివాసి అలీసాగర్. ఆరుపదుల వయసుకు చేరువలో అలీ సాగర్ (58).. తన వయసులో సగం కూడా లేని కుమారుడు అమ్మార్ (28)తో కలిసి దాదాపు అన్ని సరదాలూ పంచుకుంటారు. 'పబ్స్‌కి వెళతాం, షటిల్ ఆడతాం, మూవీస్, వెబ్ సిరీస్ చూస్తూ వాటి గురించి బోల్డ్‌గా చర్చించుకుంటాం..' అంటూ చెప్పుకుంటూ పోయే అలీసాగర్ మాటల్ని ఆపొచ్చేమో గానీ.. ఆయన తన కుమారుడితో కలిసి చేసే బైక్ టూర్స్‌ను మాత్రం ఆపలేం. నగరం నుంచి బెంగుళూర్, ముంబయి.. తదితర నగరాలకు ఇద్దరూ కలిసి బైక్స్‌పై ఝామ్మని దూసుకుపోతుంటారు. హిందుస్తాన్ రాయల్ బుల్లెటీర్స్ క్లబ్ సభ్యులు కూడా. తరాలకు అతీతంగా వర్ధిల్లుతున్న ఈ స్నేహం.. పెద్దవాళ్లకు వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంటే.. యువతకు అవసరమైన పరిణితిని అందిస్తోంది.



తండ్రి అలీ సాగర్‌తో కొడుకు అమ్మార్

మాస్ డ్యాన్సర్.. పోలకి

- ఊ అంటావా...మార్ ముంత వరకూ
- అనేక హిట్ సాంగ్స్‌కి మాస్ స్టెప్పులు
- ఏజాస్ మాస్టర్ పరిచయంతో ఇండస్ట్రీకి
- రణ్‌వీర్ కపూర్ బాగా ప్రోత్సహించారు
- 'సాక్షి'తో కొరియోగ్రాఫర్ పోలకి విజయ్

పుష్ప-1 లో ఊ అంటావా మావా... ఊహూ అంటావా మావ.. పుష్ప-2 లో పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్.. డబుల్ ఇస్మార్ట్ శంకర్ చిత్రంలో మార్‌ముంత చోడ్ చింత.. మ్యాడ్ చిత్రంలో కళ్లజోడు కాలేజీపాప.. కాలేజ్ పోతున్నది.. కోట బొమ్మాళి చిత్రంలోని లింగిడి, లింగిడి.. ఇలాంటి పాటలు వింటుంటే స్టెప్పులు వేయాలనే ఆలోచన తప్పక వస్తుంది.. అలాంటి పాటలకు కొరియోగ్రఫీ చేసింది ఎవరో కాదు.. మన తెలుగబ్బాయే.. ఎటువంటి బ్యాక్‌గ్రౌండ్ లేదు.. కష్టేఫలి అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని టాలీవుడ్ టు బాలీవుడ్‌కు పాగా వేసిన మన తెలుగు కొరియోగ్రాఫర్ పోలకి విజయ్ డెడికేషన్‌కి టాలీవుడ్ అగ్రహీరోలు ఫిదా అవుతున్నారు. స్టెప్పులు వేస్తే.. క్లాస్ టు మాస్ జనాలు ఉర్రూతలూగేలా చేస్తున్న పోలకి విజయ్ జీవితం ఓ ఇన్‌స్పిరేషన్‌లా ఉంటుంది.. ఈ నేపథ్యంలో విజయ్ 'సాక్షి'తో పంచుకున్న పలు ఆసక్తికర విషయాలు. - శ్రీనగర్ కాలనీ



నేను పుట్టింది శ్రీకాకుళం జిల్లా పలాస. చిన్నతనంలోనే అమ్మ నాన్న చనిపోయారు. అమ్మమ్మ, తాతమ్మల దగ్గరే పెరిగాను. చిన్నతనం నుండే నటన అంటే ఇష్టం. ఆర్టిస్ట్ అవుదామనే కల ఉండేది. కానీ డ్యాన్స్‌లు సైతం బాగా వేసేవాడిని. అలా నటన, డ్యాన్స్‌లలో స్వతహాగా మంచి ప్రావీణ్యం సంపాదించుకున్నాను. అమ్మమ్మ, తాతయ్యలకు భారం కాకూడదని బతుకుదెరువు కోసం హైదరాబాద్ వచ్చాను. కానీ ఇక్కడ ఎవరూ తెలియదు. ఎవరిని కలవాలో తెలియదు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ.. కష్టేఫలి అనేది నమ్మాను. ఎన్నికష్టాలు వచ్చినా నా ప్రయాణాన్ని ఆపలేదు. పనులు చేస్తూ జీవనం గడుపుతూ అక్కడక్కడా నాకు తెలిసిన డ్యాన్స్‌లు వేసేవాడిని.

ఏజాస్ మాస్టర్ పరిచయం..

పని, డ్యాన్స్‌లు తప్ప వేరే వ్యాపకం ఉండేది కాదు.. అలా నా అభిలాషను మెచ్చి ఓ అజ్ఞాతవ్యక్తి ఓ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కి తీసుకువెళ్లాడు. ఏజాస్ మాస్టర్ స్వర్ణలత మాస్టర్ అసిస్టెంట్. అలా డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరాను. చాలా మెళకువలు నేర్చుకున్నాను. నన్ను ఇన్‌స్టిట్యూట్‌కి తీసుకెళ్లిన ఆ అజ్ఞాతవాసి మరలా కనిపించలేదు.

డ్యాన్సర్‌గా ఇండస్ట్రీకి..

డ్యాన్స్‌లో మంచి పట్టు సాధించాక 2015లో తెలుగు సినీ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో కార్డ్‌ను తీసుకున్నాను. సినిమాల్లో డ్యాన్సర్‌గా చేసే సమయంలో తోటిడ్యాన్సర్స్ నీలో మంచి టాలెంట్ ఉంది. కొరియోగ్రాఫర్‌గా చేయమని సలహా ఇచ్చారు. కొన్ని డ్యాన్స్ విడియోస్ చేశాక 'బేబి' చిత్ర దర్శకుడు సాయిరాజేష్ నిర్మాణంలోని సంపూర్ణేష్ బాబు 'కొబ్బరిమట్ట' చిత్రంలో అవకాశం వచ్చింది. ఆ తర్వాత నేను పుట్టిన పలాస పేరుతో కరుణసాగర్ దర్శకత్వంలోని 'పలాస' చిత్రంలో నాదీ నక్కిలీసు గొలుసు పాటకు కొరియోగ్రఫీ చేశాను. ఈ పాటకు మంచి పేరు వచ్చింది. అలా కొరియోగ్రాఫర్‌గా స్థానాన్ని నిలబెట్టుకున్నాను.

పుష్పతో మరోమెట్టు..

దర్శకుడు సుకుమార్, హీరో అల్లు అర్జున్ పుష్ప చిత్రంలో అవకాశం ఇచ్చారు. ఊ అంటావా పాటకు కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్యతో కలిసి చేశాను. ఈ పాట దేశంతోపాటు అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందింది. పుష్ప-2లో పుష్ప, జాతర పాటకూ కొరియోగ్రఫీ చేశాను. రవితేజ, శర్వానంద్, విజయ్‌దేవరకొండ, నాని చిత్రాలకు కొరియోగ్రఫీ చేశాను. రీసెంట్ రామ్ 'డబుల్ ఇస్మార్ట్‌శంకర్'లో మార్‌ముంత చోడ్‌చింతకు కోరియోగ్రఫీ చేశా. యూట్యూబ్‌లో సంచలనంగా మారింది.


బాలీవుడ్‌లో అవకాశం..

హీరో రణ్‌వీర్ కపూర్ నటిస్తున్న 'తు ఝూతీ మైన్ మక్కర్' చిత్రంలోని పాటకు కొరియోగ్రఫీ చేశాను. రణ్‌వీర్ కపూర్ బాగా ప్రోత్సహించారు. అంతేకాకుండా నాకు నచ్చిన బెస్ట్ మాస్టర్ లారెన్స్ మాస్టర్‌కి 'రుద్రుడు' చిత్రంలో కొరియోగ్రఫీ చేశాను. ఈ అనుభవం జీవితంలో మరువలేనిది.

చిరంజీవికి కొరియోగ్రఫీ నా ఆశయం



చిన్నతనం నుండి నా గాడ్‌ఫాదర్ చిరంజీవి. ఆయన డ్యాన్సులు చూసి పెరిగాను. 'ఇంద్ర' చిత్రాన్ని 22సార్లు చూశాను. కేవలం దాయి దాయి దామ్మ పాట కోసమే చూశాను. ఆ పాటకు కొరియోగ్రఫీ చేసిన లారెన్స్ మాస్టర్‌కి కొరియోగ్రఫీ చేయడం సంతోషంగా ఉంది. కానీ నా గాడ్‌ఫాదర్ చిరంజీవికి కొరియోగ్రఫీ చేయాలన్నది నా ఆశయం. ఆ దిశగా అడుగులు వేస్తున్నాను. డ్యాన్స్‌పై ఇష్టంతో ఈ స్థాయికి వచ్చాను. గుర్తుండిపోయే కొరియోగ్రాఫర్‌గా ప్రజల మదిలో ఉంటూ మరో లక్ష్యం దిశగా నా ప్రయాణాన్ని కొనసాగించి విజయాన్ని సాధిస్తాను. మీ దీవెనలే నాకు కొండత బలమని నమ్ముతూ.. అందరికీ నా కృతజ్ఞతలు..



లైవ్ కాన్షియస్ ప్రచారంలో రణ్‌వీర్..

సాక్షి, సిటీబ్యూరో: ఇంటి అలంకరణ ఉత్పత్తులకు పేరొందిన డీ డెకార్‌కు చెందిన చేతన ఫ్యాబ్రిక్ బ్రాండ్ సన్ సార్.. జీవితంలో ప్రతి క్షణాన్నీ అత్యంత శ్రద్ధతో, ఆనందంగా జీవించాలనే సందేశాన్ని అందిస్తూ లైవ్ కాన్షియస్ పేరిట ప్రచార చిత్రాన్ని రూపొందించింది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన అందించే ఈ ప్రచార చిత్రంలో తమ బ్రాండ్ అంబాసిడర్ బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన ఆకర్షణ అని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్‌తో సహా 50 మెట్రో, నాన్ మెట్రో నగరాల్లో తమ బ్రాండ్ అందుబాటులో ఉందని వివరించారు.



తండా నుంచి ఐఐటీ దాకా...

మధులత

ఈ ఫొటో చూడండి...

దారి కూడా సరిగ్గా లేని ఒక మారుమూల గిరిజన తండా. అబ్బాయిల సంగతి ఎలా ఉన్నా తండా దాటి పై చదువులకు వెళ్లడం అనేది అమ్మాయిలకు అంత సులువేమీ కాదు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గోన్యానాయక్ తండాకు చెందిన బదావత్ రాములు, సరోజ దంపతులు 'మా అమ్మాయి చదివింది' చాలు అని ఎప్పుడూ రాజీ పడలేదు.

'నువ్వు ఎంత పెద్ద చదువు చదివితే మాకు అంత సంతోషం' అనేవాళ్లు తమ కూతురు మధులతతో. ఈ మాటలు మధులతకు బలమైన టానిక్‌లా పనిచేశాయి. 'ఏదో ఒకటి సాధించి తల్లిదండ్రుల కలను నిజం చేయాలి' అని బలంగా అనుకునేలా చేశాయి. రాములు, సరోజ దంపతుల చిన్న కూతురు మధులత. పెద్ద కూతురు మంజుల, రెండో కూతురు మమతను డిగ్రీ వరకు చదివించారు. మూడో తరగతి వరకు వీర్నపల్లి సర్కారు బడిలో చదివిన మధులత నాలుగో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు సిరిసిల్ల సంక్షేమ హాస్టల్లో ఉంటూ గీతానగర్ జిల్లా పరిషత్ స్కూల్‌లో చదువుకుంది. సారంపల్లి గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో తొమ్మిది నుంచి పదవ తరగతి వరకు చదువుకుంది. ఇంటర్‌మీడియట్‌లో 939/1000 మార్కులు సాధించింది. ఇంటర్‌మీడియట్‌లో మంచి మార్కులు రావడంతో తన మీద తనకు నమ్మకం బలపడింది. ఆ నమ్మకం వృథా పోలేదు. అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా భావించే జేఈఈ (అడ్వాన్స్‌డ్)లో ఆల్ ఇండియా స్థాయిలో 824 ర్యాంకు సాధించింది. మధులతకు సంబంధించి ఇదొక అపురూప విజయం. ఎందుకంటే...ఆమె కుటుంబ నేపథ్యం. తల్లిదండ్రులు నిరక్షరాస్యులు, పేదవాళ్లు.

'మా బిడ్డ గొప్ప చదువులు చదువుతుంది' అనే నమ్మకం తప్ప వారి దగ్గర ఏమీ లేదు. అయితే తల్లిదండ్రుల ప్రోత్సాహం, తన మీద పెట్టుకున్న ఆశలు మధులతను ముందుకు నడిపించాయి. 'నీ దగ్గర లేని దాని గురించి ఆలోచించకు. ఉన్న దాని గురించి దృష్టి పెట్టు' హైస్కూల్ రోజుల్లో తాను చదివిన మంచి మాట మధులతకు బాగా గుర్తుండి పోయింది. పేదరికం తప్ప తన దగ్గర ధనం లేకపోవచ్చు, కాని విద్య రూపంలో విలువైన నిధి ఉంది. ఆ నిధి పైనే ప్రత్యేక దృష్టి పెట్టింది మధులత. ఏదో సాధించాలనే తపనతో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు.

ఖరీదైన కోచింగ్‌లు లేకపోయినా సొంతంగా ఆల్ ఇండియా స్థాయిలో 'జేఈఈ'లో ర్యాంక్ తెచ్చుకునేలా చేసింది. పట్నా ఐఐటీలో సీటు సాధించిన మధులతకు ఉన్నత చదువుపై ఆసక్తి ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ఆమెను ఇంటికే పరిమితం అయ్యేలా చేశాయి. ఇక ఏమీ చేయలేక, పై చదువులకు వెళ్లలేక తండాలో మేకలు కాయడం మొదలుపెట్టింది మధులత. మధులత దీన పరిస్థితిపై 'సాక్షి'లో ప్రచురితమైన 'ఐఐటీకి వెళ్లలేక మేకల కాపరిగా' కథనం చూసి స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి మధులత చదువుకు అయ్యే ఖర్చులు మొత్తం భరిస్తామని ప్రకటించారు.



ఆరోజు ఎంత బాధ పడ్డానో!

'చదివించింది చాలు. ఎందుకంత కష్టపడతావు' అనే వాళ్లు కొందరు. అయితే మధు మీద మాకు చాలా నమ్మకం. చదువు తనకు ప్రాణం. పట్నంలో ఎప్పుడైనా పెద్ద ఆఫీసర్ అమ్మలను చూసినప్పుడు వారిలో నా బిడ్డే కనిపించేది. ఏదో ఒకరోజు నా బిడ్డను ఇలా గొప్పగా చూస్తాను అనుకునేవాడిని. డబ్బులు లేక, పై చదువుకు పట్నాకు వెళ్లలేక మధు ఇంట్లోనే ఉండిపోవాల్సి రావడం నాకు చాలా బాధగా ఉండేది. చదువు ఇచ్చిన దేవుడు దారి చూడడా! అనుకునే వాడిని. దేవుడు దయ తలిచాడు.

- బదావత్ రాములు, మధులత తండ్రి



చదువే లోకం...

నా బిడక్కు చదువే లోకం. సెలవులకు వస్తే కూడా చదువుకొనుడు లేదా మా మేకలతో వెళ్లేది. మా తండాకు తొవ్వ కూడా లేదు. ఇప్పుడు మా బిడ్డకు ర్యాంకు వచ్చిందని మండల అధికారులు మా ఇల్లు వెతుక్కుంటూ రావడం సంతోషంగా ఉంది. మా బిడ్డ బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలని ఆశపడుతున్నా.

- సరోజ, మధులత తల్లి

- పూరడి మల్లికార్జున్, 'సాక్షి' సిరిసిల్ల

- ఫొటోలు: **వంకాయల శ్రీకాంత్**

నేడు పేరెంట్స్ డే

దారి చూపే దివిటీలు

పిల్లల కంటే ముందే వారి కలలు తల్లిదండ్రులు కంటారు. 'నేను సాధించగలను' అని పిల్లలు అనుకోవడానికి ముందే 'మా పిల్లలు సాధించగలరు' అనే బలమైన నమ్మకం తల్లిదండ్రులకు కలుగుతుంది. తమ పిల్లలను పై స్థాయిలో చూడాలని కలలు కంటారు. కేవలం కలలకే పరిమితం కాకుండా 'పిల్లల కోసమే మా జీవితం' అన్నట్లుగా కష్టపడతారు. ఆ నిబద్ధతే ఎంతోమంది పిల్లలు విజేతలుగా నిలవడానికి కారణం అవుతుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే తల్లిదండ్రులు పిల్లల్ని తీర్చిదిద్దే శిల్పులు. వారి భవిష్యత్ చిత్రపటాన్ని అందంగా మలిచే చిత్రకారులు.



నాటి ఈగే నేటి డేగ!

● వెనిజులా ప్రతిపక్ష నేత మరియ కొరీనా మచాదో

వెనిజులా వేగుచుక్క మరియ

పన్నెండేళ్ల క్రితం ఓ రోజు – వెనిజులా నేషనల్ అసెంబ్లీలో ఆ దేశ అధ్యక్షుడు హ్యూగో చావెజ్.. దూకుడు మీదున్న దేశ పురోగతి గురించి గంభీరంగా ప్రసంగిస్తూ ఉన్నారు. స్వపక్షాలు, విపక్షాలు భయభక్తులతో వింటూ ఉన్నాయి. అంతలో అపోజిషన్ బెంచీల నుంచి మరియ కొరీనా మచాదో లేచి నిలబడి, ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు! ''మీ విధానాలు నిజంగా బాగున్నాయనే మీరు అనుకుంటున్నారా?'' అని ఆమె ప్రశ్నించారు. ఆ మాటకు చావెజ్ ఆమె వైపు డిస్టర్బ్ అయిన సింహంలా తలతిప్పి చూశారు. తీవ్రమైన ఆగ్రహంతో, అసహనంతో.. ''ఈగను డేగ వేటాడదు.. కూర్చో'' అని పెద్దగా అరిచారు. దానర్థం 'నువ్వో పిపీలికం. నీకు నేను సమాధానం చెప్పటం ఏమిటి!'' అని. చావెజ్ ఇప్పుడు లేరు. పదకొండేళ్ల క్రితమే ఆయన మరణించారు. ఆ ఈగ మాత్రం ఇప్పుడు డేగ అయింది! చావెజ్ మరణించిన నాటి నుంచి రెండు దశాబ్దాలుగా వెనిజులాను పాలిస్తూ ఆ సంపన్న దేశాన్ని తన నియంతృత్వ పోకడలతో బికారిగా మార్చిన నికొలస్ మొరోస్‌ను తాజా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో డేగలా వేటాడి వేటాడి, ఆ సామ్యవాద సింహానికి కంటకునుకు లేకుండా చేసింది.

ప్రజలు ఆమె వెన్నంటి...

తెల్లని దుస్తులు. మెడలో జపమాల. ఆత్మవిశ్వాసపు చిరునవ్వు. రోజంతా ప్రయాణం. సొట్టలు పడిన కారు పైభాగంలోనే నిలుచుని, ఎక్కడికక్కడ ప్రజల్ని ఉద్దేశించి ఆత్మీయంగా నాలుగు మాటలు. ప్రజల దగ్గరకు ఆమె వెళ్లటం అటుంచి, ప్రజలే ఆమె వెన్నంటి నడవటం. ఆమె వైపు చెయ్యందివ్వటం. మహిళలు ఆమె దోసిళ్లలో తలపెట్టి రోదించటం. కాపాడమని పురుషులు ఆమెను ప్రాధేయపడటం. రోడ్లు కిక్కిరిసిపోవటం. ఆమె మాట కోసం, ఆమె చూపు కోసం ఒకర్నొకరు తోసుకోవటం. ఒక యువకుడైతే తను గీసిన ఆమె చిత్రాన్ని అందివ్వటం. ఫ్రేమ్ లేని ఆ చిత్ర పటంలో ఆమె భుజాల చుట్టూ వెనిజులా జాతీయ జెండా. జెండాతో పాటుగా జీసెస్ చేతుల్లో సురక్షితంగా ఆమె.

''మరియా.. మాకు సహాయం చేయండి''.. గుంపులోంచి ఒక ఉద్వేగం.

56 ఏళ్ల మరియ కొరీనా మచాదో ఇప్పుడు వెనిజులా వేగుచుక్క. అధికార పక్షం గుండెల్లో పిడిబాకు. ఈ కొద్ది నెలల్లోనే ఒక ఉద్యమకారిణిగా, వెనిజులాకొక ఆశాదీపంలా అవతరించారు వెనిజులా విపక్ష నేత మరియ. ఆమె సారథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇళ్లలోంచి బయటికి వచ్చిన వేలాది మంది.. నేడు జరుగుతున్న వెనిజులా అధ్యక్ష ఎన్నికల బ్యాలట్‌ల వైపు లక్షలాదిగా కదులుతున్నారు. నిరంకుశ సామ్యవాద అధ్యక్షుడు నికోలస్ మదురోను ఓడించటమే వారి లక్ష్యం. అయితే ఈ ఎన్నికల్లో మరియ పోటీ చేయటం లేదు. తన తరఫున అంతగా ఎవరికీ తెలియని మాజీ దౌత్యవేత్త ఎడ్మండో గొంజాలెజ్‌ను నికోలస్‌కు వ్యతిరేకంగా నిలబెట్టారు మరియ. గొంజాలెజ్ గెలిస్తే మరియ గెలిచినట్లే. నికోలస్ ఓడిపోతే మరియ చేతుల్లో అతడు ఓడిపోయినట్టే. మరియకు గత ఏడాది జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో 93 శాతం ఓట్లు రావటం చూసి అధ్యక్ష ఎన్నికల్లో తన అపజయాన్ని శంకించిన అధ్యక్షుడు నికోలస్ వెను వెంటనే ఆమెపై ఆరోపణలు మోపి, సుప్రీం కోర్టు ద్వారా ఆమెను ఈ ఎన్నికలకు అనర్హురాలిని చేయించారు.

కేసులు.. భౌతిక దాడులు

మరియకు వెల్లువెత్తుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక గతవారమే వెనిజులా ప్రభుత్వం మరియ అంగరక్షకుల్ని తొలగించింది. ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిని చేయటం, అంగరక్షకుల్ని ఉపసంహరించుకోవటం.. ఇవేకాదు, నికొలస్ గత పదేళ్లుగా మరియాకు వ్యతిరేకంగా అనేక కేసులు పెట్టించారు. కోర్టుకు ఈడ్చారు. భౌతిక దాడులు చేయించారు. అయినా ఆమె వెనకంజ వేయలేదు. నికొలస్ ఆర్థిక విధానాలతో నిరుపేద దేశంగా మారిన ఈ చమురు నిక్షేపాల సంపన్న దేశాన్ని ఒడ్డున పడేయటానికి ప్రభుత్వంతో పెద్ద యుద్ధమే చేస్తున్నారు మరియ.

పిల్లలకు దూరంగా...

కుటుంబానికి ప్రాణహాని ఉందంటే పోరాటాన్ని తీసి పొయ్యిలో పడేస్తారు ఎవరైనా. కానీ మరియ తన పోరాటం ఆపలేదు. ప్రజలే తన కుటుంబం అనుకున్నారు. తన ముగ్గురు పిల్లల్ని – ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి – వారి భద్రత కోసం విదేశాలకు పంపించారు. వారు అమెరికాలో ఉన్నారని, కాదు బ్రిటన్‌లో ఉన్నారని అనుకోవటమే కానీ కచ్చితంగా ఏ దేశంలో ఉన్నారన్నది ఆమెకు తప్ప ఎవరికీ తెలియదు. ఈ పోరాటాల పోరు పడలేకే భర్త ఆమెతో విడిపోయారని అంటారు.

మరియ తండ్రి వెనిజులా రాజధాని కరాకస్‌లో పేరున్న స్టీల్ బిజినెస్‌మన్. మరియ పుట్టింది కారకస్‌లోనే. మరియ తల్లి సైకాలజిస్ట్. మొత్తం నలుగురు ఆడపిల్లల్లో మరియ పెద్దమ్మాయి. మరియ పూర్తి పేరు మరియ కొరీనా మచాదో పరిస్కా. తండ్రి పేరులోని మచాదో, తల్లి పేరులోని కొరీనా పరిస్కా కలిసి వచ్చేలా ఆమెకు ఆ పేరు పెట్టారు. మరియ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ చేశారు. కరాకస్‌లోని వీధి బాలల కోసం 1992లో ఒక అనాథాశ్రమం నెలకొల్పారు. 2002లో జాయిన్ అప్ అని అర్థం వచ్చేలా 'సూమేట్' అనే వాలంటీర్‌ల వ్యవస్థను ప్రారంభించారు. రాజకీయ హక్కులను స్వేచ్ఛగా వినియోగించుకోవటం, ప్రజా ప్రయోజన విషయాల మీద చర్చ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటుంది ఆ సంస్థ.

గోదావరి తీరం నుంచి ఒలింపిక్స్ దాకా...



తండ్రితో...

జ్యోతిక శ్రీ దండి భారతీయ క్రీడాకారిణి. మహిళల 400 మీ. పరుగులో జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో 4 X 400 భారత మహిళల రిలే జట్టులో భాగంగా పాల్గొంటోంది. స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తణుకు. జ్యోతిక ఇప్పటి వరకు రెండు అంతర్జాతీయ పతకాలు, ఆరు జాతీయ పతకాలు సాధించింది.

అయినా సరే... వెనుకంజ వేయనివ్వలేదు...

మేం ఐరన్‌కి సంబంధించిన వర్క్స్ చేస్తాం. జ్యోతిక చిన్నప్పుడు స్థానికంగా జరిగే రన్నింగ్ పోటీలు చూసి, తనూ ఉత్సాహం చూపేది. తన ఆసక్తి చూసి, కోచ్ దగ్గర చేర్చాం. అలా క్రీడలవైపు ప్రోత్సహించాం. 2013లో స్థానికంగా జరిగే పోటీలో పాల్గొంది. అక్కణ్ణుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటూ వచ్చింది. పాల్గొన్న ప్రతి పోటీలో విజేతగా నిలిచింది. వరల్డ్ కాంపిటీషన్స్‌కి స్కూల్ రోజుల్లోనే వెళ్లింది. టర్కీకి వెళ్లినప్పుడు లక్ష రూపాయలు తప్పనిసరి అన్నారు. అప్పుడు స్థానిక ఎమ్మెల్యే సపోర్ట్ చేశారు. ఇంటర్మీడియట్‌లో మంచి గ్రేడ్ వచ్చింది. చదువును కొనసాగిస్తూనే, ఉద్యోగం తెచ్చుకుంటాను అంది. కానీ, స్పోర్ట్స్‌లోనే ఉండమని, అదే మంచి భవిష్యత్తును ఇస్తుంది అని చెప్పాను. విజయవాడలోని అకాడమిలో నాలుగేళ్లు, హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అకాడమీలో రెండేళ్లు ఉంది. ఆర్థికంగా ఇబ్బందులు వచ్చినా తన పట్టుదల నన్ను వెనుకంజ వేయనివ్వలేదు. రెండేళ్లుగా ఇండియన్ క్యాంపులో ఉండటం వల్ల నాకు కొంచెం వెసులు బాటు వచ్చింది. ఇప్పుడు ఒలింపిక్స్‌లో తన సత్తా చాటడానికి వెళ్లింది. ఇన్నాళ్ల కృషికి తగిన ఫలితం నేడు చూస్తున్నాం. స్పోర్ట్స్‌లో రాణిస్తూనే డిగ్రీ చదువుతోంది. స్పిరిచ్యువల్ ఆర్ట్స్ వేస్తుంది.దేశానికి పతకం తీసుకురావాలనే లక్ష్య సాధన కోసమే కృషి చేస్తోంది.

- దండి శ్రీనివాసరావు, జ్యోతిక శ్రీ తండ్రి, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా



పిల్లల లక్ష్యం కోసం...

మాకు ఇద్దరు కూతుళ్లు. చిన్నప్పుడు జ్యోతిక పరుగు మొదలు పెట్టినప్పుడు ఊళ్లో మాకో బిల్డింగ్ ఉండేది. పిల్లల లక్ష్యాల కోసం ఆ బిల్డింగ్ అమ్మి ఖర్చు పెడుతూ వచ్చాం. పిల్లలే మాకు బిల్డింగ్ అనుకున్నాం. స్పోర్ట్స్ అంటే మంచి పోషకాహారం, ఫిట్‌నెస్, ట్రయినింగ్ ఉండాలి. ఖర్చు అని చూసుకోలేదు.

- లక్ష్మీ నాగ వెంకటేశ్వరి, జ్యోతిక శ్రీ తల్లి

హెల్త్



ముఖం మీద నల్లమచ్చలా?

ఎండలో ఎక్కువ సేపు తిరిగినప్పుడు ముఖం మీద నల్లటి మచ్చలు (పిగ్మెంటేషన్) వచ్చేందుకు అవకాశాలెక్కువ. వీటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు... ● రోజూ మైల్డ్ ఫేస్‌వాష్‌తో ముఖాన్ని కడుక్కోవాలి ● ఎండలోకి వెళ్లినప్పుడు ప్రతి మూడుగంటలకొకసారి ఎస్‌పీఎఫ్ 40 కంటే ఎక్కువ ఉన్న బ్రాడ్‌స్పెక్ట్రమ్ సన్‌స్క్రీన్‌ను దుస్తులు కప్పనిచోట్ల రాసుకోవాలి ● మచ్చలున్నచోట రోజూ రాత్రివేళల్లో స్కిన్ లైటెనింగ్ క్రీమ్‌ను రాసుకోవడం మంచిది. కంటి చుట్టూ కూడా నల్లమచ్చలు వస్తుంటే అక్కడ 15 శాతం విటమిన్ సి ఉండే సీరమ్‌ను రాసుకోవాలి. మిగతా చర్మానికి కోజిక్ యాసిడ్, విటమిన్ సి, లికోరిస్, టెట్రాహైడ్రోకర్క్యుమిన్ కాంబినేషన్‌తో ఉండే క్రీమ్‌ను రాత్రివేళ రాసుకోవాలి ● ఆహారంలో తాజా ఆకుకూరలు, కాయగూరలు, క్యారట్, బీట్‌రూట్, తాజాపండ్లు, మొలకెత్తిన గింజల వంటి మంచి పోషకాలుండే ఆహారం తీసుకోవాలి ● ప్రతిరోజూ కనీసం 20 నిమిషాలు వ్యాయామం చేయాలి. అప్పటికీ తగ్గకపోతే డర్మటాలజిస్టును సంప్రదించాలి.

సైలెంట్ డీ-హైడ్రేషన్ అంటే!



మంచి ఆరోగ్యానికి దేహంలో తగినంత నీరు అవసరం. దేహం తాలూకు అన్ని రకాల కార్యకలాపాలకు, జీవక్రియలకు... అంటే ఉదాహరణకు శరీర ఉష్ణోగ్రత నిలకడగా ఉండటానికీ, పోషకాలన్నీ ప్రతి కణానికీ చేరడానికీ, దేహంలోని వ్యర్థాలను బయటకు పంపడానికీ... ఒంట్లో తగినంత నీరు ఉండటం అవసరం. అయితే కేవలం మూత్ర విసర్జన ద్వారా మాత్రమే కాకుండా చెమట పట్టడం, గాలి వదిలిన ప్రతిసారీ ఆఖరికి మల విసర్జనలో కూడా ఒంట్లోంచి నీరు బయటకు వెళ్లి పోతుంది.

ఒంట్లో అవసరమైనంత నీటి మోతాదులో ఏమాత్రం తగ్గినా... దాహం రూపంలో తెలిసిపోతుంది. కానీ కొందరిలో... మరీ ముఖ్యంగా ఆటగాళ్లూ, చాలా ఎక్కువగా వ్యాయామం చేసేవాళ్లలో అది అంతగా తెలియదు. వీళ్లలో దాహం వేసినప్పుడు వారు తాగే నీటి కంటే వారికి మరింత ఎక్కువ నీరు అవసరం. ఇలా తెలియకుండా నీరు తగ్గే కండిషన్‌నే 'సైలెంట్ డీ-హైడ్రేషన్' అంటారు. క్రీడాకారులు, వ్యాయామం చేసేవాళ్లలో శ్వాస ప్రక్రియ మామూలు కంటే వేగంగా జరుగుతుండటంతో పాటు, వారికి చెమట రూపంలో ఎక్కువ నీరు బయటకు వెళ్లిపోతుంది. ఆ టైమ్‌లో వారు దాహమేసి నీరు తాగినప్పటికీ అది వారి జీవక్రియలకు అవసరమైనంత మోతాదులో ఉండకపోవచ్చు.

లక్షణాలు: మరీ దాహంగా అనిపించకపోయినా సైలెంట్ డీ-హైడ్రేషన్‌లో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవి... ● తలనొప్పి ● అలసట ● తల తిరుగుతున్నట్టు లేదా తేలికైనట్టు అనిపించడం ● మూత్రం గాఢమైన రంగులో ఉండటం.

తీవ్రమైన డీ-హైడ్రేషన్‌లో కనిపించే లక్షణాలు

● శ్వాస వేగంగా తీసుకుంటుండటం ● గుండె స్పందనల వేగం పెరగడం ● కాస్త జ్వరం వచ్చినట్లు అనిపిస్తుండటం ● మూత్రం రాకపోవడం

సైలెంట్ డీ-హైడ్రేషన్ నివారణకు...

● బయటకు వెళ్లేముందర నీళ్లు తాగడం ● వాతావరణంలో వేడి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యాయామాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం ● మరింతగా ఉక్కపోయకుండా తేలికైన రంగులతో, వదులైన కాటన్ దుస్తులు ధరించడం ● నీటి మోతాదులు ఎక్కువగా పుచ్చకాయ, కర్బూజ, కీరదోస వంటివి తీసుకోవడం ● పళ్లరసాలు తీసుకుంటూ, కోలా డ్రింక్స్ వంటి శీతల పానీయాలకు దూరంగా ఉండటం.

కాంటాక్ట్ లెన్స్‌లపై కన్నేద్దాం!





ఇటీవల ఓ ప్రముఖ టెలివిజన్, సినీ నటి ఉదంతం కాంటాక్ట్ లెన్స్‌లు ధరించే వారందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ఆమె తన కాంటాక్ట్ లెన్స్‌ల కారణంగా కార్నియా దెబ్బతినడంతో వార్తలోకెక్కింది. ఈ నెల 17న ఆమె తన కాంటాక్ట్ లెన్స్‌లను ధరించినప్పటి నుంచి కళ్లు నొప్పిగా ఉండటంతో పాటు చాలా ఇబ్బందిగా అనిపించసాగింది. కొద్దిసేపటికి ఆమెకు అంతా మసకమసకగా కనిపించడం మొదలైంది. తీరా సాయంత్రం కంటి డాక్టర్‌ను సంప్రదిస్తే కాంటాక్ట్ లెన్స్ కారణంగా ఆమె కార్నియా దెబ్బతిన్నదని తేలింది. ఈ నేపథ్యంలో కాంటాక్ట్ లెన్స్‌లు ధరించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో తెలుసుకుందాం.

కాంటాక్ట్ లెన్స్‌లు ధరించేవారిలో సమస్యలు చాలా సాధారణమే... కాంటాక్ట్ లెన్స్‌లు ధరించేవారిలోనూ 40% నుంచి 90% మందిలో వాటిని ఎలా ధరించాలనే అంశంపై సరైన అవగాహన ఉండదని పలు అధ్యయనాలూ, కేసుల్లో తేలింది.

ఎదురయ్యే సమస్యలివి...


● **జెయింట్ పాపిల్లరీ కంజంక్టివైటిస్ (జీపీసీ) :** ఇందులో కనురెప్ప కింద గుండ్రగా ఉండే పాపిల్లే అనే ఉబ్బెత్తు భాగాలు (బంప్స్) కనిపిస్తాయి. ఇలాంటప్పుడు కాంటాక్ట్ లెన్స్‌లను మార్చడంతో పాటు, వాటిని దాచే ద్రవాన్ని డాక్టర్లు మారుస్తారు. అలాగే కనురెప్పల ఆరోగ్యాన్ని కాపాడుకునే పరిశుభ్రతలను గురించి వివరిస్తారు. ● **అలర్జిక్ రియాక్షన్స్ :** కాంటాక్ట్ లెన్స్‌ల వల్ల అలర్జీ కారణంగా కొందరిలో కళ్లు ఎర్రబారడంతో పాటు కంట్లో పుండ్లు కనిపించే అవకాశముంది. ఇది ప్రధానంగా లెన్స్‌లను దాచే సొల్యూషన్ వల్లనే ఎక్కువ. అందుకే సరిపడేదాన్ని ఎంచుకోవాల్సిన అవసరముంది. ● **కార్నియల్ అబ్రేషన్స్ :** కార్నియా మీద కాంటాక్ట్ లెన్స్ సరిగా అమరనప్పుడు అది కార్నియా మీద నిలిచిపోకుండా కన్ను మీదంతా కదులుతూ ఉండే అవకాశముంది. దాంతో కార్నియా అలాగే కన్ను మీద ఉండే రక్షణ పొర (ఎపిథీలియమ్) గీసుకుపోయే ప్రమాదముంటుంది. ఇలా జరగడాన్నే కార్నియల్ అబ్రేషన్స్ అంటారు. అలాగే నిర్ణీత వ్యవధి కంటే ఎక్కువ సేపు కాంటాక్ట్ లెన్స్‌లు ధరించినప్పుడు కూడా కార్నియల్ అబ్రేషన్స్ రావచ్చు. కన్ను గీసుకుపోవడంతో ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదముంది. ఇలాంటప్పుడు కాంటాక్ట్ లెన్స్‌లు ధరించడానికి తాత్కాలికంగా విరామమిచ్చి, డాక్టర్ల సూచన మేరకు యాంటీబయాటిక్స్ వాడాలి. ● **కార్నియల్ అల్సర్స్ :** కంట్లో బ్యాక్టీరియల్, వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు కాంటాక్ట్ లెన్స్‌ల వల్ల సమస్య మరింత ఎక్కువయ్యే ప్రమాదముంటుంది.

పాటించాల్సిన సూచనలివి...

● కాంటాక్ట్ లెన్స్‌లను ఉదయం పెట్టుకొని, రాత్రి నిద్రపోయే ముందు తొలగించాలి ● కాంటాక్ట్ లెన్స్ ఉన్నప్పుడు కన్ను నలపకూడదు ● కాంటాక్ట్ లెన్స్‌తో డస్ట్, పొగ, వేడిమి ఉన్న ప్రదేశాలకు వెళ్లకూడదు ● ధరించే ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి ● స్టోరేజ్ కేస్‌లో భద్రపరచంతో పాటు ఫ్రెష్ సొల్యూషన్‌తో శుభ్రం చేయాలి ● స్టోరేజ్ కేస్‌ను ప్రతి మూడునెలలకోసారి మార్చడం మంచిది ● స్టోరేజ్ సొల్యూషన్ కంటామినేట్ కాకుండా ఉండేందుకు మూత గట్టిగా పెట్టాలి ● ఒకవేళ అది డిస్పోజబుల్ లెన్స్ అయితే వాడాక తప్పక పారవేయాలి ● కన్ను ఎప్పుడూ తడిగా ఉండాలి. పొడిబారకుండా చూసుకోవాలి ● డాక్టర్లు సూచించినట్లుగా క్రమం తప్పకుండా ఐ చెకప్‌కు వెళ్తుండాలి ● ఏదైనా ఇబ్బంది ఉంటే మొదట లెన్స్‌లు తొలగించాలి.

చేయకూడనివి...

● నిర్దేశించిన టైమ్‌కు మించి కాంటాక్ట్ లెన్స్‌లు తొడగకూడదు ● డాక్టర్ ప్రిస్క్రయిబ్ చేసినవి కాకుండా ఇతర కాంటాక్ట్ లెన్స్‌లు వాడవద్దు ● ఎట్టిపరిస్థితుల్లో కాంటాక్ట్‌లెన్స్ ధరించి నిద్రపోకూడదు ● ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లో లెన్స్ షేర్ చేసుకోకూడదు ● ఈదుతున్నప్పుడు ధరించకూడదు ● డాక్టర్ సూచన లేకుండా మార్చకూడదు ● కాంటాక్ట్ లెన్స్‌ను గానీ, సొల్యూషన్ బాటిల్‌ను గానీ చేతులతోగానీ మరేరకంగా గానీ టచ్ చేయకూడదు ● క్రితం రోజు వాడిన సొల్యూషనే ఆ మర్నాడు వాడకూడదు ● కాంటాక్ట్ లెన్స్ తడిచేయడానికి నల్లా నీళ్లు వాడటం లేదా నోట్లో పెట్టుకుని తడిచేయడం వంటివి చేయకూడదు.




డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్ కంటి వైద్య నిపుణులు



తొలి స్వర్ణం చైనాదే... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో పసిడి పతకం

పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో తొలి స్వర్ణ పతకాన్ని సాధించిన జట్టుగా చైనా నిలిచింది. శనివారం జరిగిన షూటింగ్ క్రీడాంశంలో చైనా ఈ ఘనత సాధించింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో 17 ఏళ్ల హువాంగ్ యుటింగ్, 19 ఏళ్ల షెంగ్ లిహావో ద్వయం విజేతగా నిలిచి 'పారిస్'లో చైనాకు తొలి పసిడి పతకాన్ని అందించింది. ఫైనల్లో హువాంగ్ యుటింగ్-షెంగ్ లిహావో జోడీ 16-12 పాయింట్ల తేడాతో కెయుమ్ జిహైన్-పార్క్ హాజున్ (దక్షిణ కొరియా) జంటను ఓడించింది. ఫైనల్లో ఓడిన కొరియా జోడీకి రజత పతకం లభించింది. అంతకుముందు కజకిస్తాన్‌కు చెందిన అలెగ్జాండ్రా లె-సత్పయెవ్ జంట కాంస్య పతకాన్ని గెల్చుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోటీలో అలెగ్జాండ్రా-సత్పయెవ్ ద్వయం 17-5తో అనా జాన్సెన్-మాక్సిమిలన్ ఉల్‌బ్రిచ్ (జర్మనీ) జంటపై విజయం సాధించింది. మహిళల డైవింగ్ సింక్రనైజ్డ్ 3 మీటర్ల స్ప్రింగ్‌బోర్డు ఈవెంట్‌లో చాంగ్ యాని-చెన్ యిువెన్ ద్వయం 337.68 పాయింట్లు సాధించి చైనాకు 'పారిస్'లో రెండో స్వర్ణ పతకాన్ని అందించింది.



దిగ్గజాల సమక్షంలో...

- వెలిగిన ఒలింపిక్ జ్యోతి
- అద్భుతంగా సాగిన పారిస్ విశ్వ క్రీడల వేడుకలు

'మీ గెలుపే మా గెలుపు... మీ ఓటమే మా ఓటమి... వచ్చే రెండు వారాల పాటు మీ భావోద్వేగాల్లో మేమూ భాగం... మేమందరం మీ వైపే'... పారిస్ క్రీడల అధ్యక్షుడు, మూడు సార్లు ఒలింపిక్ స్వర్ణపతక విజేత టోనీ ఎస్టాన్‌గెట్ ఒలింపిక్ క్రీడల విశిష్టత గురించి ఇచ్చిన సందేశంతో ఒలింపిక్స్‌కు తెర లేచింది. శుక్రవారం భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ప్రారంభోత్సవ కార్యక్రమాలు సుదీర్ఘ సమయం పాటు సాగాయి. సెన్ నదిపై జరిగిన బోట్ పరేడ్‌లో అందరికంటే చివరగా ఆతిథ్య ఫ్రాన్స్ జట్టు వచ్చినప్పుడు నదీ తీరమంతా స్థానిక అభిమానుల కేరింతలతో హోరెత్తింది. స్విమ్మర్ ఫ్లారెంట్ మనాడు, డిస్కర్ త్రోయర్ మెలినా రాబర్ట్ మికాన్ ఆ దేశపు ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. అంతకుముందు గత ఒలింపిక్స్ నిర్వహించిన జపాన్, 2028 ఒలింపిక్స్ జరిగే అమెరికా జట్లు వచ్చాయి. టెన్నిస్ స్టార్ కోకో గాఫ్, బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ యూఎస్ పతాకధారులుగా వ్యవహరించారు. ఆ తర్వాత అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) పతాకంతో ఒక గుర్రంపై 'మెటల్ ఉమన్' కూర్చొని సెన్ నదిపై దూసుకుపోగా... ఆ వెంటనే ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న అన్ని దేశాల జాతీయ పతాకాలతో పరేడ్ సాగింది. ఆ సమయంలో నేపథ్యంలో ఒలింపిక్ గీతాన్ని వినిపించారు.

జ్యోతి వెలిగింది...

ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్ ముందుగా ప్రసంగిస్తూ... ఆధునిక ఒలింపిక్ క్రీడల సృష్టికర్త అయిన పియరీ డి క్యూబర్టిన్ జన్మస్థలంలో ఈ క్రీడల నిర్వహణ తమకు గర్వకారణమని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ ఒలింపిక్ క్రీడలను అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులందరి తరఫున ఫ్రాన్స్ ఫ్లాగ్‌బేరర్లు ఫ్లారెంట్ మనాడు, మెలినా రాబర్ట్ మికాన్ ప్రతిజ్ఞ చేశారు. ఆ తర్వాత అసలైన మరో ఘట్టం మొదలైంది. కార్యక్రమం ఆరంభమైన దగ్గరి నుంచి ముఖానికి ముసుగులో ఒలింపిక్ టార్చ్‌తో కనిపించిన వ్యక్తి ఎట్టకేలకు దానిని తీసుకొచ్చి ఫ్రాన్స్ ఫుట్‌బాల్ గ్రేట్ జినెదిన్ జిదాన్ చేతిలో పెట్టగా... జిదాన్ దానిని టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌కు అందించాడు. స్పెయిన్‌కు చెందినవాడే అయినా రోలాండ్ గారోస్‌లో 14సార్లు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ నెగ్గి ఈ మట్టితో ప్రత్యేక అనుబంధం ఉండటంతో నిర్వాహకులు నాదల్‌ను సముచితంగా గౌరవించారు. ఆ వెంటనే మెరుపులు, బాణాసంచాతో ఈఫిల్ టవర్‌పై ఐదు ఒలింపిక్స్ రింగ్స్ ప్రదర్శించడంతో ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. 9 ఒలింపిక్ స్వర్ణాల విజేత కార్ల్ లూయిస్, నాలుగు స్వర్ణాలు సాధించిన సెరెనా విలియమ్స్, రొమేనియా జిమ్నాస్టిక్స్ దిగ్గజం నాదియా కొమనెసి వేదికపై నాదల్‌కు జత కలిశారు. జ్యోతి ఆ తర్వాత ఫ్రెంచ్ మాజీ టెన్నిస్ ప్లేయర్, ఈ ఒలింపిక్స్ డైరెక్టర్ అమెలీ మారెస్మో వద్దకు వెళ్లి ఆ తర్వాత బాస్కెట్‌బాల్ స్టార్ టోనీ పార్కర్ వద్దకు చేరింది. చివరగా ఫ్రాన్స్ జూడో ప్లేయర్ టెడ్డీ రైనర్, అథ్లెట్ మేరీ జోస్ పెరెక్ టార్చ్‌ను అందుకున్నారు. ప్రస్తుత, మాజీ ఒలింపియన్లు, పారాలింపియన్లు కలిపి మొత్తం 18 మంది సమక్షంలో చివరగా రైనర్, పెరెక్ జ్యోతిని వెలిగించడంతో లాంఛనంగా పారిస్ 2024 ఆటలకు నగారా మోగింది. కార్యక్రమం సాగినంత సేపూ స్వల్పంగా చినుకులు కురిసినా... దాని వల్ల ఎలాంటి ఆటంకం కలగలేదు.





మేరీ జోస్, టెడ్డీ రైనర్











ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్



మెలినా, ఫ్లారెంట్







ఫ్రెంచ్ ప్రభుత్వం ఆధీనంలోని 'తహితి'లో ఒలింపిక్స్‌కు సంబంధించిన సర్ఫింగ్ పోటీలు జరుగుతాయి. ఈ దీవి పసిఫిక్ మహా సముద్రంలో ఆస్ట్రేలియాకు దగ్గరగా, ఫ్రాన్స్‌కు దాదాపు 15 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. పారిస్‌లో ప్రారంభోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలోనే ఇక్కడ కూడా ఘనంగా ఉత్సవం నిర్వహించడం విశేషం.

రోదసిలో ఒలింపిక్ జ్యోతి...

ఒకవైపు పారిస్‌లో వేడుకలు ఘనంగా జరుగుతుండగా మరోవైపు రోదసిలో కూడా ఒలింపిక్స్ సంబరం కనిపించింది. ప్రతిష్టాత్మక సంస్థ 'నాసా' దీనికి సంబంధించి ఒక వీడియోను విడుదల చేసింది. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో భాగంగా ఉన్న సునీతా విలియమ్స్, మరో ఐదుగురు ఆస్ట్రోనాట్‌లు కలిసి ఒలింపిక్ క్రీడలను అనుకరించి తమ సంఘీభావాన్ని ప్రదర్శించారు. ఒక్కో క్రీడాంశాన్ని గుర్తుకు తెచ్చేలా వారంతా విన్యాసాలు చేశారు. ఒలింపిక్ జ్యోతిని పోలిన నమూనా జ్యోతిని కూడా ఒకరినుంచి మరొకరు అందుకుంటూ క్రీడల పట్ల తమ అభిమానాన్ని ప్రదర్శించారు.



పెళ్లి ఉంగరం నీటిపాలు...



ప్రారంభోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న ఇటలీ హైజంపర్, టోక్యో స్వర్ణపతక విజేత గియాన్‌మార్కో టాంబెరి కొద్దిసేపటి తర్వాత తీవ్ర నిరాశలో మునగాల్సి వచ్చింది. ఇటలీ ఫ్లాగ్‌బేరర్ కూడా అయిన గియాన్‌మార్కో పెళ్లి ఉంగరం సెన్ నదిలో పడిపోయింది. అయితే ఒకవైపు దీనికి తన భార్యకు క్షమాపణలు చెబుతూనే అతను రాసిన వాక్యాలు హృద్యంగా, ఆసక్తికరంగా అందరి మనసులను గెలుచుకోవడం విశేషం. 'నా పెళ్లి ఉంగరం సెన్ నదిలో పడిపోవడం బాధాకరమే అయినా అది కోల్పోవడానికి ఇంతకంటే మంచి చోటు లభించదు. ప్రేమకు చిరునామాలాంటి నగరపు నదిలో అది ఎప్పటికీ నిలిచిపోతుంది. నా జాతీయ పతాకాన్ని సగర్వంగా పైకి ప్రదర్శించే క్రమంలో దానిని కోల్పోయాను. ఇందులో కొంత కవిత్వం కనిపించవచ్చు గానీ... నీ ఉంగరాన్ని కూడా అందులో విసిరేస్తే అవి కలిసి ఉండిపోతాయి. పెళ్లినాటి ప్రమాణాలను మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చుకునే మనం మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం కూడా ఉంటుంది' అని అతను రాశాడు.

మనూ చరిత్ర లిఖించేనా!



10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఫైనల్లోకి మనూ భాకర్

- క్వాలిఫయింగ్‌లో 580 పాయింట్లతో మూడో స్థానం
- నేడు మధ్యాహ్నం గం. 3:30 నుంచి పతకం కోసం పోటీ

మనూ భాకర్

మూడేళ్ల క్రితం ఎన్నో అంచనాలతో టోక్యో ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేసిన భారత యువ షూటర్ మనూ భాకర్ తడబడి నిరాశ పరిచింది. అయితే ఈసారి 'పారిస్'లో మాత్రం మనూ తుపాకీ గర్జించింది. ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా క్వాలిఫయింగ్‌లో పూర్తి విశ్వాసంతో లక్ష్యంవైపు గురి పెట్టిన మనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో నేడు జరిగే ఫైనల్లో మనూ అదే జోరు కొనసాగిస్తే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ కొడుతుంది.

పారిస్: విశ్వ క్రీడల్లో తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు బరిలోకి దిగినా పతకానికి దూరంగా నిలిచాయి. అయితే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 22 ఏళ్ల మనూ భాకర్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్లోకి ప్రవేశించి పతకంపై ఆశలు రేకెత్తించింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ త్రుటిలో ఫైనల్ చేరే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబూతా-రమితా జిందాల్ (భారత్) ద్వయం 628.7 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన సందీప్ సింగ్-ఇలవేనిల్ వలారివన్ జోడీ 626.3 పాయింట్లు సాధించి 12వ స్థానంతో సరిపెట్టుకుంది. మొత్తం 28 జోడీలు క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డాయి. టాప్-4లో నిలిచిన జోడీలు ఫైనల్ చేరుకుంటాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో సరబ్‌జోత్ సింగ్ త్రుటిలో ఫైనల్‌కు దూరమయ్యాడు. 33 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధించారు. సరబ్‌జోత్, జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్ 577 పాయింట్లతో సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచారు. అయితే సరబ్‌జోత్ (16) కంటే 10 పాయింట్ల షాట్‌లు ఎక్కువ కొట్టిన రాబిన్ వాల్టర్ (17) ఎనిమిదో స్థానంతో ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ఇదే విభాగంలో మరో భారత షూటర్ అర్జున్ సింగ్ చీమా 574 పాయింట్లతో 18వ స్థానంలో నిలిచాడు.



సరబ్‌జోత్

నిలకడగా...

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో భారత్ నుంచి మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్ బరిలో నిలిచారు. మొత్తం 44 మంది షూటర్లు క్వాలిఫయింగ్‌లో పోటీపడ్డారు. మనూ 580 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. రిథమ్ మాత్రం 573 పాయింట్లతో 15వ స్థానాన్ని దక్కించుకొని ఫైనల్‌కు దూరమైంది. టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత పొందారు. క్వాలిఫయింగ్‌లో ఒక్కో షూటర్‌కు 10 షాట్‌లతో ఆరు సిరీస్‌లు అవకాశం ఇచ్చారు. మనూ వరుసగా ఆరు సిరీస్‌లలో 97, 97, 98, 96, 96, 96 పాయింట్లు సాధించింది. నేడు జరిగే ఫైనల్లో వెరోనికా (హంగేరి), జిన్ ఓ యె (దక్షిణ కొరియా), విన్ తు త్రిన్ (వియత్నాం), కిమ్ యెజి (దక్షిణ కొరియా), జుయ్ లీ (చైనా), తర్హాన్ సెవల్ (టర్కీ), రాన్‌జిన్ జియాంగ్ (చైనా)లతో కలిసి మనూ పోటీపడుతుంది. ఫైనల్లో ముందుగా 8 మంది షూటర్లు 10 షాట్‌లు సంధిస్తారు. 10 షాట్‌ల తర్వాత తక్కువ స్కోరు ఉన్న చివరి షూటర్ నిష్క్రమిస్తుంది. ఆ తర్వాత ప్రతి రెండు షాట్‌ల తర్వాత ఒక్కో షూటర్ అవుట్ అవుతారు. చివరకు 24 షాట్‌లు ముగిశాక టాప్-3లో నిలిచిన వారికి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

బ్యాడ్మింటన్

మహిళల సింగిల్స్ తొలి లీగ్ మ్యాచ్: పీవీ సింధు x ఫాతిమత్ నభా (మాల్దీవులు) మధ్యాహ్నం గం. 12:50 నుంచి. పురుషుల సింగిల్స్ తొలి లీగ్ మ్యాచ్: హెచ్ఎస్ ప్రణయ్ x ఫాబియన్ రోథ్ (జర్మనీ) రాత్రి గం. 9:00 నుంచి

షూటింగ్

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్: ఇలవేనిల్ వలారివన్ (మధ్యాహ్నం గం. 12:45 నుంచి). పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్: సందీప్ సింగ్, అర్జున్ బబూతా (మధ్యాహ్నం గం. 2:45 నుంచి). మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్: మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

రోయింగ్

పురుషుల సింగిల్ స్కల్స్ (రెపిచేజ్ 2): బలరాజ్ పన్వర్ (మధ్యాహ్నం గం. 1:18 నుంచి).

టేబుల్ టెన్నిస్

మహిళల సింగిల్స్ (రెండో రౌండ్): ఆకుల శ్రీజ x క్రిస్టియానా క్లైబెర్గ్ (స్వీడన్) (మధ్యాహ్నం గం. 12:15 నుంచి). మహిళల సింగిల్స్ (రెండో రౌండ్): మనికా బత్రా x అన్నా హర్సే (ఇంగ్లండ్) (మధ్యాహ్నం 12:15 నుంచి). పురుషుల సింగిల్స్ (రెండో రౌండ్): శరత్ కమల్ x డేనీ కోజుల్ (స్లొవేనియా) (మధ్యాహ్నం గం. 3:00 నుంచి).

స్విమ్మింగ్

పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ (హీట్-2): శ్రీహరి నటరాజ్ (మధ్యాహ్నం గం. 3:16 నుంచి). మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్ (హీట్-1): ధీనిధి (మధ్యాహ్నం గం. 3.30 నుంచి).

ఆర్చరీ



మహిళల రికర్వ్ టీమ్ క్వార్టర్ ఫైనల్: భారత్ (దీపిక కుమారి, అంకిత భకత్, భజన్ కౌర్) x ఫ్రాన్స్/నెదర్లాండ్స్ (సాయంత్రం గం. 5:45 నుంచి). మహిళల టీమ్ సెమీఫైనల్: (రాత్రి గం. 7:17 నుంచి). మహిళల టీమ్ ఫైనల్: (రాత్రి గం. 8:18 నుంచి).

హాకీలో భారత్ శుభారంభం

పారిస్: ఒలింపిక్స్‌లో తమ కాంస్య పతకాన్ని నిలబెట్టుకునే లక్ష్యంతో 'పారిస్'కు వచ్చిన భారత పురుషుల హాకీ జట్టు శుభారంభం చేసింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగిన గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున మన్‌దీప్ సింగ్ (24వ ని.లో), వివేక్ సాగర్ ప్రసాద్ (34వ ని.లో), హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు స్యామ్ లేన్ (8వ ని.లో), సిమోన్ చైల్డ్ (53వ ని.లో) ఒక్కో గోల్ అందించారు.



సాత్విక్ జోడీ బోణీ



సాత్విక్

బ్యాడ్మింటన్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ అలవోక విజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'సి' తొలి రౌండ్‌లో మూడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 21-17, 21-14తో లుకాస్ కార్వీ-రోనన్ లాబర్ (ఫ్రాన్స్) ద్వయంపై విజయం సాధించింది. మొదటిసారి ఒలింపిక్స్ ఆడుతున్న యువ షట్లర్ లక్ష్య సేన్ పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎల్' తొలి రౌండ్‌లో 21-8, 22-20తో కెవిన్ కార్డన్ (గ్వాటిమాలా)పై గెలిచాడు.

హర్మీత్ విజయం

టేబుల్ టెన్నిస్ (టీటీ)లో భారత ఆటగాడు హర్మీత్ దేశాయ్ ముందంజ వేశాడు. ప్రాథమిక రౌండ్ మ్యాచ్‌లో హర్మీత్ 11-7, 11-9, 11-5, 11-5తో జైద్ అబో యమన్ (జోర్డాన్)పై విజయం సాధించాడు. తదుపరి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఫెలిక్స్ లెబ్రాన్ (ఫ్రాన్స్)తో హర్మీత్ తలపడతాడు.

రెపిచేజ్‌కు బాలరాజ్

భారత రోవర్ బాలరాజ్ పన్వర్ రెపిచేజ్ దశకు అర్హత సాధించాడు. పురుషుల సింగిల్స్ స్కల్స్ హీట్-1లో బాలరాజ్ నాలుగో స్థానంలో నిలిచాడు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన రోవర్లు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించగా.. రెపిచేజ్ రౌండ్లో రాణిస్తేనే బాలరాజ్ ముందంజ వేస్తాడు.



బాలరాజ్

యువ భారత్ ప్రతీకలు వాళ్లు

పీవీ సింధు

ప్రపంచంలోనే అతి పెద్ద క్రీడా మహోత్సవంలో దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ... భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నించడం అనిర్వచనీయమైన అనుభూతి. ఒలింపిక్ వేదికపై తొలిసారి పతాకధారిగా టీమిండియాకు ముందు నిలవడంతో ఇది నాకు మరింత ప్రత్యేకం. గతంలో రియో, టోక్యో ఒలింపిక్స్‌లో పాల్గొన్నా ఇవి నాకు మూడో విశ్వక్రీడలు. దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని మాటల్లో వర్ణించలేం. ఈసారి కూడా అంతే. పారిస్ క్రీడాగ్రామంలో అడుగుపెట్టగానే కొత్త ఉత్సాహం వచ్చింది. 140 కోట్ల మంది భారతీయుల ఆశలు మోస్తూ అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు సిద్ధంగా ఉన్నా.

ఈసారి భారత బృందంలో 70 మందికి పైగా అథ్లెట్లు తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగుతున్నారు. వారు కాస్త ఆందోళన చెందుతుండొచ్చు. 2016 రియో ఒలింపిక్స్ సమయంలో నా పరిస్థితి కూడా అంతే. కానీ ఈసారి విశ్వక్రీడల్లో అరంగేట్రం చేస్తున్న వారిని చూస్తుంటే ముచ్చటేస్తోంది. వారు యువభారతానికి ప్రతీకల్లా కనిపిస్తున్నారు. ఈ తరం మరింత ఉత్సాహంగా ఉంది. తాము ఎవరికంటే తక్కువ కాదనే నమ్మకం వారిలో కనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా అంతర్జాతీయ వేదికలపై సాధించిన విజయాల వల్ల వారి ఆలోచనల్లో ఈ మార్పు వచ్చింది. ఒలింపిక్స్‌కు సిద్ధమయ్యే క్రమంలో ప్రభుత్వ సహకారం మరవలేనిది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందించిన ప్రేరణ, మానసిక బలం అథ్లెట్లలో మరింత ఉత్సాహాన్ని నింపింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న 117 మంది భారత బృందం అటు అనుభవజ్ఞులు, ఇటు యువకులతో సమతూకంగా ఉంది.

ప్రతీ అథ్లెట్ తమ తమ విభాగాల్లో అత్యుత్తమ శిక్షణ పొందడంతో పాటు... మానసిక స్థయిర్యాన్ని సాధించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇతోధిక సాయం చేసింది. అథ్లెట్లు అడిగిన సౌకర్యాలన్నింటినీ క్రీడాశాఖ సమకూర్చింది. ఇప్పుడు యావత్ భారతావని నమ్మకాన్ని నిలబెట్టడం అథ్లెట్ల బాధ్యత. పారిస్ ఒలింపిక్స్-2024లో భారత ఆటగాళ్ల ప్రదర్శన చూసేందుకు సిద్ధంగా ఉండండి.



పారిస్‌లో 'ఇండియా హౌస్'... రిలయన్స్ ఫౌండేషన్ ఏర్పాటు

పారిస్: ప్రతిష్టాత్మక ఒలింపిక్ క్రీడల సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ భారత ఆటగాళ్ల విజయాలు, ఘనతలను వేడుకలా నిర్వహించేందుకు కొత్త ప్రయత్నం చేసింది. క్రీడల వేదిక పారిస్‌లో 'ఇండియా హౌస్' పేరుతో ఒక ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఒలింపిక్స్ వేదికకు సమీపంలో ఈ తరహాలో 'ఇండియా హౌస్' ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి. రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలు నీతా అంబానీ శనివారం దీనిని ప్రారంభించారు. ఇందులో భారత్ ఘనతలు, సంస్కృతి సాంప్రదాయాలను ప్రదర్శిస్తారు. దీంతో పాటు ఆటగాళ్ల విజయాలు, ఘనతలపై ప్రత్యేక చర్చలు తదితర రోజువారీ కార్యక్రమాలు ఉంటాయి. ఒలింపిక్స్ ముగిసే వరకు ఇది సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. భారీ వేడుకల మధ్య జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష, జీసీసీఐ కార్యదర్శి జై షా, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ అభినవ్ బింద్రా తదితరులు పాల్గొన్నారు.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	2	0	0	2
బెల్జియం	1	0	1	2
జపాన్	1	0	1	2
కజకిస్తాన్	1	0	1	2
ఆస్ట్రేలియా	1	0	0	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

నినో... నీకు సలాం!

వరుసగా పదో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ జార్జియా మహిళా షూటర్ నినో సాలుక్‌వాద్జె



ఒలింపిక్స్‌కు ఒక్కసారి అర్హత సాధించడమే గొప్ప అనుకుంటుంటే... వరుసగా పదోసారి విశ్వక్రీడల్లో పోటీ పడటాన్ని ఏమనాలి! జార్జియాకు చెందిన 55 ఏళ్ల మహిళా షూటర్ నినో సాలుక్‌వాద్జె ఇలాంటి అసాధారణ ఘనత సాధించింది. 1988 సియోల్ ఒలింపిక్స్ ద్వారా విశ్వక్రీడల్లో అరంగేట్రం చేసిన నినో... తొలి ప్రయత్నంలో 25 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణం, 10 మీటర్ల విభాగంలో రజతం సాధించి అదరగొట్టింది. ఇక అప్పటి నుంచి వరుసగా అన్నీ ఒలింపిక్స్‌లో పాల్గొన్న నినో... తాజాగా పారిస్ క్రీడల ద్వారా వరుసగా పదోసారి గేమ్స్ లో పాల్గొన్న క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. శనివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో నినో బరిలోకి దిగి 562 పాయింట్లు స్కోరు చేసి 38వ స్థానంలో నిలిచింది. కెనడాకు చెందిన ఈక్వెస్ట్రియాన్ ఇయాన్ మిల్లర్ కూడా 10 ఒలింపిక్స్‌లో పాల్గొన్నా... అతడు 1980 మాస్కో ఒలింపిక్స్‌కు దూరంగా ఉన్నాడు. 2016 రియోలో కుమారుడు సోట్నే మచావరియానితో కలిసి పోటీపడటం ద్వారా.. విశ్వక్రీడల్లో బరిలోకి దిగిన తొలి తల్లీ తనయులుగా నినో రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు మూడు పతకాలు సాధించిన నినో... తండ్రి చివరి కోరిక మేరకే పదో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్నట్లు పేర్కొంది.

ఆరంభం అదిరింది

- తొలి టి20 మ్యాచ్‌లో 43 పరుగులతో గెలిచిన భారత్
- చెలరేగిన సూర్యకుమార్, పంత్
- 8 బంతుల్లో 3 వికెట్లు తీసిన పరాగ్
- నిసాంక మెరుపులు వృథా
- నేడు రెండో టి20


పరాగ్


సూర్యకుమార్

పల్లెకెలె: టి20 ప్రపంచ చాంపియన్ భారత్... శ్రీలంక పర్యటనలో శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ బృందం 43 పరుగుల తేడాతో లంకపై విజయం సాధించింది. మూడు టి20ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. విరామం లేకుండా నేడే రెండో టి20 మ్యాచ్ జరగనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ (26 బంతుల్లో 58; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రిషభ్ పంత్ (33 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. పతిరణకు 4 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 19.2 ఓవర్లలో 170 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు నిసాంక (48 బంతుల్లో 79; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (27 బంతుల్లో 45; 7 ఫోర్లు, 1 సిక్స్) ఒకదశలో భారత శిబిరాన్ని వణికించేలా మెరిపించారు. రియాన్ పరాగ్ (1.2-0-5-3) బంతితో మ్యాజిక్ చేశాడు. అర్ష్‌దీప్ (2/24), అక్షర్ పటేల్ (2/38) కీలక వికెట్లు తీశారు.

జైస్వాల్, గిల్ మెరుపులతో...

ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (21 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (16 బంతుల్లో 34; 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్‌తో భారత్ ఇన్నింగ్స్ మొదలైంది. ఉన్నది కాసేపే అయినా ఇద్దరు పోటీపడి బౌండరీలు బాదడంతో 4వ ఓవర్లో జట్టు స్కోరు 50 దాటింది. పవర్ ప్లేలో పవర్ చూపిన ఓపెనర్లిద్దరిని లంక బౌలర్లు వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చారు. మదుషంక వేసిన ఆరో ఓవర్లో శుబ్‌మన్ రెండు ఫోర్లు, డీప్ మిడ్‌వికెట్ దిశగా భారీ సిక్సర్ బాదాడు. తొలి ఐదు బంతుల్లోనే 15 పరుగులు రాగా... అదే ఊపులో ఆఖరి బంతిని షాట్ ఆడేందుకు ప్రయత్నించగా, మిడాన్‌లో ఉన్న ఫెర్నాండో క్యాచ్ పట్టడంతో గిల్ వెనుదిరిగాడు. 6 ఓవర్లలో 74/1 స్కోరుతో ఉన్న భారత్‌కు తర్వాతి బంతి మరో దెబ్బతీసింది. హసరంగ వేసిన ఏడో ఓవర్ తొలిబంతికి జోరుమీదున్న జైస్వాల్ స్టంపౌట్ అయ్యాడు.

సూర్య ఫిఫ్టీ...

ఈ ఊరట కాస్తా ఆ రెండు బంతులకే పరిమితమైంది. తర్వాత దశను హార్డ్ హిట్టర్లు సూర్యకుమార్, రిషభ్ పంత్ మొదలుపెట్టారు. దీంతో పరుగుల్లో వేగం, బ్యాటింగ్‌లో దూకుడు మరింత పెరిగిందే తప్ప తగ్గలేదు. 8.4 ఓవర్లోనే భారత్ 100 పరుగుల మైలురాయిని చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ స్ట్రోక్ ప్లేతో పదేపదే బౌండరీలకు తరలించాడు. చెత్త బంతులు ఎదురైతే సిక్స్‌లుగా బాదేశాడు. ఈ మెరుపులతో అతని అర్ధశతకం 22 బంతుల్లోనే పూర్తవగా, 13.1 ఓవర్లో జట్టు స్కోరు 150 పరుగులకు చేరింది. కానీ తర్వాతి బంతికి పతిరణ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో కెప్టెన్ ఇన్నింగ్స్ ముగిసింది. హార్దిక్ పాండ్యా (9), పరాగ్ (7) విఫలమైనప్పటికీ పంత్ తనశైలి ఆటతీరుతో జట్టు స్కోరును 200 పైచిలుకు తీసుకెళ్లాడు. పరుగు తేడాతో అర్ధసెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

చకచకా లక్ష్యం వైపు... అంతలోనే!

శ్రీలంక కూడా లక్ష్యానికి తగ్గ దూకుడుతోనే బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండిస్ మెరుపులతో సగటున ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో లంక ఇన్నింగ్స్ దూసుకెళ్లింది. 5.1 ఓవర్లలో జట్టు స్కోరు 50కి చేరింది. నిసాంక భారీషాట్లతో విరుచుకుపడగా, మెండిస్ బౌండరీలతో భారత బౌలర్ల భరతం పట్టాడు. జట్టు స్కోరు 84 వద్ద అర్ష్‌దీప్... మెండిస్‌ను అవుట్ చేసి తొలివికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. తర్వాత కుశాల్ పెరీరా (14 బంతుల్లో 20; 3 ఫోర్లు) అండతో నిసాంక మరింతగా రెచ్చిపోయాడు. 14 ఓవర్లదాకా ఎంతవేగంగా లక్ష్యం వైపు దూసుకొచ్చింతో... నిసాంక అవుటయ్యాక అంతే వేగంగా లంక ఇన్నింగ్స్ పతనమైంది. 140 స్కోరు వద్ద నిసాంక రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. 36 బంతుల్లో 74 పరుగుల సమీకరణం ఏమంత కష్టం కాకపోయినా... భారత బౌలర్లు పట్టు బిగించడంతో అనూహ్యంగా మరో 30 పరుగుల వ్యవధిలోనే 8 వికెట్లను కోల్పోయి లంక 170 పరుగులకే ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) హసరంగ 40; గిల్ (సి) ఫెర్నాండో (బి) మదుషంక 34; సూర్యకుమార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరణ 58; పంత్ (బి) పతిరణ 49; పాండ్యా (బి) పతిరణ 9; పరాగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరణ 7; రింకూ సింగ్ (బి) ఫెర్నాండో 1; అక్షర్ (నాటౌట్) 10; అర్ష్‌దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 213.** **వికెట్ల పతనం:** 1-74, 2-74, 3-150, 4-176, 5-192, 6-201, 7-206. **బౌలింగ్:** మదుషంక 3-0-45-1, అసిత ఫెర్నాండో 4-0-47-1, తీక్షణ 4-0-44-0, హసరంగ 4-0-28-1, కమిందు మెండిస్ 1-0-9-0, పతిరణ 4-0-40-4.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) అక్షర్ 79; కుశాల్ మెండిస్ (సి) జైస్వాల్ (బి) అర్ష్‌దీప్ 45; పెరీరా (సి) బిష్ణోయ్ (బి) అక్షర్ 20; కమిందు మెండిస్ (బి) పరాగ్ 12; అసలంక (సి) జైస్వాల్ (బి) బిష్ణోయ్ 0; షనక (రనౌట్) 0; హసరంగ (సి) పరాగ్ (బి) అర్ష్‌దీప్ 2; తీక్షణ (బి) పరాగ్ 2; పతిరణ (సి) అక్షర్ (బి) సిరాజ్ 6; ఫెర్నాండో (నాటౌట్) 0; మదుషంక (బి) పరాగ్ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19.2 ఓవర్లలో ఆలౌట్) 170.** **వికెట్ల పతనం:** 1-84, 2-140, 3-149, 5-160, 6-161, 7-163, 8-170, 9-170, 10-170. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3-0-24-2, సిరాజ్ 3-0-23-1, అక్షర్ 4-0-38-2, రవి బిష్ణోయ్ 4-0-37-1, పాండ్యా 4-0-41-0, పరాగ్ 1.2-0-5-3.

ఎనిమిదో టైటిల్ లక్ష్యంగా...

ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో నేడు శ్రీలంకతో భారత్ తుది సమరం

- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం



దంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియాకప్ టి20 క్రికెట్ టోర్నీలో ఎదురు లేకుండా సాగుతున్న భారత జట్టు.. నేడు తుది సమరానికి సిద్ధమైంది. టోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేసిన టీమిండియా.. ఆదివారం జరగనున్న ఫైనల్లో శ్రీలంకతో తలపడనుంది. ఇప్పటికే ఎనిమిదిసార్లు (వన్డే, టి20 ఫార్మాట్లలో కలిపి) ఆసియాకప్ ఫైనల్ ఆడి అందులో ఏడింట విజేతగా నిలిచిన టీమిండియా.. ఎనిమిదోసారి ట్రోఫీ కైవసం చేసుకోవాలని తహతహలాడుతోంది. గ్రూప్ 'ఎ' నుంచి బరిలోకి దిగిన హర్మన్‌ప్రీత్ బృందం.. దాయాది పాకిస్తాన్, యూఏఈ, నేపాల్ జట్లపై గెలిచి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. ఏకపక్షంగా సాగిన సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఇటీవలి కాలంలో హర్మన్‌ప్రీత్ బృందం జోరు చూస్తుంటే.. కప్ ఖాయంగానే కనిపిస్తోంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మతో పాటు జెమీమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్‌తో బ్యాటింగ్ పటిష్టంగా ఉంటే... బౌలింగ్‌లో రేణుక సింగ్, రాధ యాదవ్, దీప్తి శర్మ అదరగొడుతున్నారు. హర్మన్, జెమీమాకు ఈ టోర్నీలో పెద్దగా బ్యాటింగ్ చేసే అవకాశం రాకపోయినా... సమయం వస్తే సత్తా చాటడం ఖాయమనే మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌లు నెగ్గిన లంక... పాకిస్తాన్‌తో హోరాహోరీ సెమీఫైనల్లో ఒత్తిడిని జయించి ఫైనల్‌కు అర్హత సాధించింది. కెప్టెన్ చమరి అటపట్టుపై లంక భారీ ఆశలు పెట్టుకుంది. ఈ టోర్నీలో 243 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్న చమరి రాణిస్తేనే టీమిండియాకు లంక పోటీనివ్వగలదు.

24 టి20 ఫార్మాట్‌లో భారత్, శ్రీలంక జట్ల మధ్య ఇప్పటి వరకు 24 మ్యాచ్‌లు జరిగాయి. 19 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా... 4 మ్యాచ్‌ల్లో శ్రీలంక విజయం సాధించింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

ఇంగ్లండ్‌కు ఆధిక్యం

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో రెండో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 33 పరుగులు చేసింది. బ్రాత్‌వైట్ (0), మెకెన్జీ (8) వెనుదిరగ్గా... మికైల్ లూయిస్ (18 బ్యాటింగ్), అతనజె (5 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 38/3తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా ఆ జట్టుకు 94 పరుగుల ఆధిక్యం లభించింది. జేమీ స్మిత్ (109 బంతుల్లో 95; 12 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (87), క్రిస్ వోక్స్ (62), బెన్ స్టోక్స్ (54) అర్ధ సెంచరీలు సాధించారు. విండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ 4 వికెట్లు పడగొట్టగా...జేడెన్ సీల్స్‌కు 3, షామర్ జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి రెండు టెస్టులు నెగ్గిన ఇంగ్లండ్ ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకుంది.

సినిమా

కథానాయక

సినిమాలో కథను ఎవరు లీడ్ చేస్తే వాళ్లే ఆ కథకు నాయకులవుతారు. అది హీరో కావొచ్చు... హీరోయిన్ కావొచ్చు. హీరోలు లీడ్ చేసే కథలు ఏడాదికి ఓ వంద వస్తే... హీరోయిన్లు లీడ్ చేసే కథలు ఓ ఇరవై ఉంటాయేమో. అంటే... హీరోయిన్లకు అరుదైన అవకాశం అన్నమాట. అందుకే ఇలాంటి అవకాశం రాగానే అందిపుచ్చుకుంటారు. ప్రస్తుతం హిందీలో అలా కథకు హీరోగా మారిన కథ'నాయక'లు చేస్తున్న చిత్రాలు, వెబ్ సిరీస్‌ల గురించి తెలుసుకుందాం.

సూపర్ ఏజెంట్స్


● ఆలియా భట్

బాలీవుడ్‌లో స్పై క్యారెక్టర్స్ చేసి ప్రేక్షకులను మెప్పించిన కథానాయికల్లో ఆలియా భట్ ఒకరు. 'రాజీ' (2018) మూవీలో స్పైగా ఆలియా భట్ నటన ఆడియన్స్‌ను ఎంతగానో మెప్పించింది. ఆరేళ్లకు మళ్లీ పూర్తి స్థాయి స్పై క్యారెక్టర్‌కు ఆలియా భట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీకి 'ఆల్ఫా' అనే టైటిల్ ఖరారు చేశారు. అయితే 'రాజీ' సినిమాలో కాస్త కూల్‌గా ఉండే స్పైగా కనిపించిన ఆలియా 'ఆల్ఫా'లో మాత్రం అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లు చేసి, ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేసే స్పైగా నటిస్తున్నారు. ఆలియా భట్‌కు తోడుగా మరో హీరోయిన్ శార్వరీ ఉంటారు. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్‌లకు ఎంత ప్రాధాన్యం ఉందంటే... దాదాపు రెండు నెలలకు పైగా ఆలియా, శార్వరి మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఈ ఇద్దరు సూపర్ ఏజెంట్స్ చేసే ఫైట్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురి చేసే విధంగా ఉంటాయట. 'ధూమ్ 3' సినిమాకు దర్శకత్వ విభాగంలో చేసి, ఆ తర్వాత 'ది రైల్వే మేన్' వెబ్ సిరీస్‌తో దర్శకుడిగా తన సత్తా నిరూపించుకున్న శివ్ రావేల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 'వైఆర్‌ఎఫ్' (యశ్‌రాజ్ ఫిలింస్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా నిర్మిస్తున్న ఈ 'ఆల్ఫా' చిత్రం ఏడాది థియేటర్లకు రానుంది.

పోలీస్ వర్సెస్ సైకో


● కాజోల్


● కృతీ సనన్

ఓ పోలీస్, ఓ సైకో మధ్య పోటాపోటీగా సాగే మైండ్ గేమ్‌తో గతంలో కొన్ని సినిమాలు వచ్చాయి. తాజాగా ఇలాంటి మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో కాజోల్, కృతీ సనన్ నటించారు. 'దో పత్తీ' టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమాతో శశాంక్ చతుర్వేది దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆల్రెడీ చిత్రీకరణ ముగిసింది. ఇటీవల టీజర్‌ను కూడా విడుదల చేశారు. నార్త్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సైకో థ్రిల్లర్ మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా కాజోల్, సైకో పాత్రలో కృతీసనన్ కనిపిస్తారు. అంతేకాదు... ఈ సినిమాకు ఓ నిర్మాతగా కూడా ఉన్నారు కృతీ సనన్. మరో ఆసక్తికర విషయం ఏంటంటే... 'దిల్‌వాలే' (2015)లో స్క్రీన్ షేర్ చేసుకున్న కాజోల్, కృతి తొమ్మిదేళ్లకు 'దో పత్తీ'లో కలిసి నటించారు. ఈ చిత్రం త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

ఇలా హిందీలో కథానాయిక ప్రాధాన్యంగా సాగే సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఇంకా ఉన్నాయి.

రోడ్ ట్రిప్


● ప్రియాంక


● కత్రినా కైఫ్

ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్ లీడ్ రోల్స్‌లో నటించాల్సిన చిత్రం 'జీ లే జర'. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమా ప్రకటన వచ్చి దాదాపు మూడేళ్లు అవుతున్నా సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో ఈ చిత్రం ఆగిపోయిందనే వార్తలు వచ్చాయి. కానీ 'జీ లే జర' చిత్రీకరణ లేట్ అవుతున్న మాట వాస్తవమే అని, అయితే ఆగిపోలేదని, రణ్‌వీర్ సింగ్‌తో 'డాన్ 3' తీసిన తర్వాత ఈ సినిమాను సెట్స్‌పైకి తీసుకువెళ్తానని ఇటీవల ఫర్హాన్ అక్తర్ పేర్కొన్నారు. ఒకరితో ఒకరికి పరిచయం లేని ముగ్గురు మహిళల రోడ్ ట్రిప్ నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుందని టాక్.

లాహోర్ టు ముంబై


● సోనాక్షీ సిన్హా ● అదితీరావు హైదరీ


ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ తీసిన తొలి వెబ్ సిరీస్ 'హీరామండి: ది డైమండ్ బజార్'. మనీషా కోయిరాల, సోనాక్షీ సిన్హా, అదితీరావ్ హైదరీ, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్ లీడ్ రోల్స్‌లో నటించారు. 2024 మే 1 నుంచి ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తొలి సీజన్‌కు వీక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో రెండో సీజన్‌ను ప్రకటించారు భన్సాలీ. తొలి సీజన్‌లో ఉన్న వారితో పాటు రెండో సీజన్‌లో మరికొంతమంది హీరోయిన్స్ యాడ్ అవుతారట. దేశ విభజన సమయంలో లాహోర్‌లోని మెజారిటీ వేశ్యలు ముంబై, కోల్‌కతా వెళ్లి స్థిరపడతారు. వారు సినిమా ఇండస్ట్రీకి ఎలా వచ్చారు? సినీ ఇండస్ట్రీని ఏ విధంగా ప్రభావితం చేశారు? అనే కోణాల్లో 'హీరామండి' సెకండ్ సీజన్ ఉంటుంది.

రివెంజ్


● కీర్తీ సురేష్

కీర్తీ సురేష్, రాధికా ఆప్టే లీడ్ రోల్స్‌లో 'అక్క' అనే రివెంజ్ థ్రిల్లర్ సిరీస్ రూపొందుతోంది. ధరమ్ రాజ్ శెట్టి ఈ సిరీస్‌తో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ రివెంజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సిరీస్ ఉంటుందని బాలీవుడ్ టాక్. అయితే కీర్తీపై రాధికా రివెంజ్ ప్లాన్ చేశారా? లేక రాధికాపై కీర్తీ పగ తీర్చుకుంటారా? అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఆదిత్యా చోప్రా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు.

సరికొత్తగా...


● 'అల్లరి' నరేశ్

'అల్లరి' నరేశ్ కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. 'అల్లరి' నరేశ్ హీరోగా రచయిత–దర్శకుడు మెహర్ తేజ్ ఓ సినిమాను తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. ఇందులో రుహానీ శర్మ హీరోయిన్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా శనివారం ఆరంభమైంది. మరో వారం రోజుల్లో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించనున్నారు. ''సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించనున్నాం'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకు సంగీతం: జిబ్రాన్, సహ–నిర్మాత: వెంకట్ ఉప్పుటూరి.

కాలేజ్‌లో...


● స్నేహా, పవన్, సాహిబా

'పవన్ కుమార్ కొత్తూరి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహ మాల్వియ, సాహిబా భాసిన్, వివియా సంత్, ఝాన్సీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. పవన్ కుమార్ కొత్తూరి, బిషాలి గోయెల్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. 'కాలేజ్‌లో ఉన్నంత వరకే స్టూడెంట్ నాని.. ఆ తరువాత కూకట్‌పల్లి నాని' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''రొమాన్స్, కామెడీ, యాక్షన్, ఎమోషన్స్... ఇలా అన్ని అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను మా చిత్రం అలరిస్తుంది'' అనియూనిట్ పేర్కొంది.


నా లుక్ కొత్తగా ఉంటుంది


● సత్యరాజ్, విజయ్ ఆంటోనీ, విజయ్

''బాహుబలి' తర్వాత సినిమాల రేంజ్ పెరిగింది. **- సత్యరాజ్**

తెలుగు ప్రేక్షకులతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది. 'తుఫాన్' సినిమాతో వారికి మరింత దగ్గరవుతానని ఆశిస్తున్నాను'' అని విజయ్ ఆంటోనీ అన్నారు. విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, డి. లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ–''తుఫాన్' కంటెంట్, క్వాలిటీ మాకు సక్సెస్ ఇస్తాయన్న నమ్మకం ఉంది. నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమాను తమిళంతో పాటు తెలుగులోనూ విడుదల చేస్తున్నారు. వారికి థ్యాంక్స్'' అన్నారు. ''నాకు నచ్చిన థ్రిల్లర్ మూవీ 'తుఫాన్'. ఈ సినిమాలో నా లుక్, మేకోవర్, క్యారెక్టర్ కొత్తగా ఉంటాయి'' అన్నారు సత్యరాజ్. ''తుఫాన్'ను థియేటర్స్‌లో చూడండి'' అన్నారు విజయ్ మిల్టన్. ''తుఫాన్'లో క్వాలిటీ కంటెంట్, కమర్షియల్ అంశాలు ఉన్నాయి'' అన్నారు ధనుంజయ.

వరుణ్ సందేశ్ ఎమోషనల్ అయ్యారు


● ఆద్యంత్ హర్ష

''విరాజి'లో సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలు ఉన్నాయి. కొన్ని సామాజిక అంశాలనూ చూపిస్తున్నాం. ఆ అంశాలు ఆడియన్స్‌ని వెంటాడతాయి'' అన్నారు దర్శకుడు ఆద్యంత్ హర్ష. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'విరాజి'. మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఆద్యంత్ హర్ష మాట్లాడుతూ– ''ఈ మూవీలో హీరో క్యారెక్టర్ పేరు ఆండీ. ఓ పది మంది కొండమీద ఉండే ప్రదేశానికి వెళ్తారు. అది మూసి వేసిన పిచ్చాసుపత్రి అని తెలుస్తుంది. వాళ్లు బయటకు వచ్చి చూస్తే వాళ్ల కారు ఉండదు. ఆ టైమ్‌లో ఆండీ అనే వ్యక్తి వారి దగ్గరకు వస్తాడు. ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు జరిగాయి? అనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. 'విరాజి' ప్రివ్యూ చూసి వరుణ్ సందేశ్ ఈ సినిమా మీకూ, నాకూ లైఫ్ ఇస్తుందని ఎమోషనల్ అయ్యారు'' అన్నారు.

నా విలువలను వదులుకోను

- కె. విజయభాస్కర్



''సినిమాల విషయంలో ప్రేక్షకుల అభిరుచి మారిందనే మాటని ఒప్పుకోను. ఎన్ని ఓటీటీలు వచ్చినా సినిమాలకు ఆదరణ తగ్గదు. అన్నీ సమపాళ్లలో జోడించి ఎంటర్‌టైన్ చేయగలిగితే తప్పకుండా కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి సినిమాలు చూస్తారు. అలా ఫ్యామిలీ అంతా కలిసి వచ్చి చూసే చిత్రమే మా 'ఉషా పరిణయం'' అని డైరెక్టర్ కె. విజయ భాస్కర్ అన్నారు. 'నువ్వే కావాలి, నువ్వు నాకు నచ్చావ్, మన్మథుడు, మల్లీశ్వరి, జై చిరంజీవ' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన కె.విజయ భాస్కర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఉషా పరిణయం'. ఆయన తనయుడు శ్రీ కమల్ హీరోగా, తన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా కె. విజయ భాస్కర్ చెప్పిన విశేషాలు.

● ఎవరి కోసం కథ రాస్తామో వాళ్లను దృష్టిలో పెట్టుకుని కామెడీ రాస్తాం. 'మన్మథుడు' చిరంజీవిగారికి మ్యాచ్ కాదు. 'జై చిరంజీవ' వెంకటేశ్‌కి సరిపోదు. 'నువ్వు నాకు నచ్చావ్'లో వెంకటేశ్‌ని తప్ప మరెవరినీ ఊహించుకోలేం.

'ఉషా పరిణయం' కథని మా అబ్బాయి శ్రీ కమల్ కోసం రాయలేదు. ఈ స్క్రిప్ట్‌ని ముగ్గురు హీరోలకు చెప్పాను.. కానీ కుదరలేదు. 'జిలేబి' మూవీ తర్వాత నాకు సరిపోయే కథతో సినిమా చేయమని కమల్ అడిగాడు. తన వయసుకు, బాడీ లాంగ్వేజ్‌కి 'ఉషా పరిణయం' కథ సరిపోతుందనిపించి ముందుకెళ్లాం. శ్రీ కమల్, తన్వీ జోడీ అద్భుతంగా కుదిరింది. వారి నటన కూడా చాలా బాగుంటుంది.

● ప్రేమకు నేనిచ్చే నిర్వచనమే 'ఉషా పరిణయం'. ప్రేమ ఎప్పుడూ హింసని కోరుకోదనే పాయింట్‌ని సందేశంలా కాకుండా వినోదాత్మకంగా చెప్పాను.

● మా సినిమా యూత్‌ఫుల్‌గా ఉంటుంది. కానీ, మా టార్గెట్ ఫ్యామిలీ ఆడియన్స్. ఇంట్లో అందరూ కలిసి కూర్చొని భోజనం చేస్తున్నట్లే సినిమాని కూడా కుటుంబమంతా కలిసి చూసేట్లు తీయాలి. నా దృష్టిలో దర్శకుడికి విలువలు ముఖ్యం. నేను సినిమా అయినా వదులుకుంటాను కానీ, నా విలువలను వదులుకోను. నా చిత్రాలను నా తల్లి, భార్య, పిల్లలతో కలిసి చూడాలనుకుంటాను.

ఆటిజం సమాజానికి సంబంధించిన సమస్య

- శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- నయీదిశా హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి



సాక్షి, హైదరాబాద్: ఆటిజం, మానసిక వైకల్యం కేవలం వ్యక్తులు, కుటుంబానికి సంబంధించిన సమస్య కాదని, అది పూర్తిగా సమాజానికి సంబంధించిన సమస్య అని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అలాంటి పిల్లలకు, ఆయా కుటుంబాలకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నయీదిశా రిసోర్స్ సెంటర్‌తో అవగాహన కుదుర్చుకుందని వివరించారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో నయీదిశా సంస్థ హెల్ప్‌లైన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హెల్ప్‌లైన్ ద్వారా థెరపిస్టులు, ప్రత్యేక శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులు, పాఠశాలలు, ఆసుపత్రులు, వైద్యులు, ఇతర ఆటిజం పిల్లల తల్లిదండ్రులతో అనుసంధానం అయ్యే అవకాశం కలుగుతుందని అన్నారు. పిల్లల్లో ఆటిజం, ఎదుగుదల లోపం ఉంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి చాలామంది తల్లిదండ్రుల్లో ఉందన్నారు. అలాంటివారి కోసం ఈ హెల్ప్‌లైన్ ఎంతో ఉపయోగకరమన్నారు. కాగా, దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ప్రారంభించిందని, వైకల్యం ఉంటే ఆత్మన్యూనతకు గురికావద్దని సూచించారు.

'గ్రూప్' పోస్టులు పెంచాలని భిక్షాటన



చిక్కడపల్లి (హైదరాబాద్): గ్రూప్-2, 3 ఉద్యోగాల సంఖ్య పెంచాలని, గ్రూప్-1 ఉద్యోగాలకు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను పిలవాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ నేత జనార్దన్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో శనివారం గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేయడానికి భిక్షాటన చేసినట్టు స్పష్టం చేశారు. కాగా, భిక్షాటన చేస్తున్న నిరుద్యోగ విద్యార్థులు జనార్దన్, అర్జున్, నరసింహ ఇంద్రలను అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేసినట్టు చిక్కడపల్లి సీఐ సీతయ్య తెలిపారు.

ఆపరేషన్ ధూల్‌పేట్

ఆగస్టు 31లోగా గంజాయి రహితంగా మారుస్తాం

- పోలీస్, టీజీఏఎన్‌బీతో కలిసి ఆపరేషన్లు చేస్తున్నాం
- మూడు నెలల్లో నాటుసారా కనుమరుగు చేస్తాం
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గంజాయికి నగరంలో కేంద్రంగా మారుతున్న ధూల్‌పేట్ ప్రాంతాన్ని ఆగస్టు 31లోపు గంజాయి రహిత ప్రాంతంగా మార్చే లక్ష్యంతో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ ధూల్‌పేట్ చేపట్టినట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. నగరంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ధూల్‌పేట్‌లోనే మూలాలు ఉంటున్నందున ఎక్కువ దృష్టి పెట్టినట్టు తెలిపారు. ధూల్‌పేట్ ప్రాంతంలో గంజాయి రవాణా, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న 15 మంది నిందితులను గుర్తించామని, ఇందులో ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. శనివారం ఆబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషితో కలిసి కమలాసన్‌రెడ్డి మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ పోలీసు, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారుల సమన్వయంతో దాడులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ధూల్‌పేట్‌తోపాటు గంజాయికి అడ్డాలుగా మారుతున్న నానక్‌రామ్‌గూడ, లంగర్‌హౌస్, సీతాఫల్‌మండి సహా ఇతర ప్రాంతాల్లోనూ నిఘా పెంచినట్టు తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈఎస్ అంజిరెడ్డి బృందం శనివారం జరిపిన సోదాల్లో 54 కిలోల గంజాయి పట్టుబడిందని, గంజాయి రవాణా ముఠాలో కీలకంగా ఉన్న ఏ-1 రాహుల్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో హైదరాబాద్‌లో గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో క్రమంగా పెరుగుతున్న నాటుసారాపై సైతం దృష్టి పెట్టామని, మూడు నెలల్లో దీన్ని పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4,200 కిలోల బెల్లాన్ని, 50 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్టు కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి మాట్లాడుతూ, ఆపరేషన్ ధూల్‌పేట్ ఈనెల 20 నుంచి ప్రారంభించామన్నారు. స్థానిక పోలీస్, ఎక్సైజ్‌శాఖ, టీజీఏఎన్‌బీ ఉమ్మడిగా కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నట్టు తెలిపారు. ఈ నెలలో ఇప్పటివరకు ధూల్‌పేట్ ప్రాంతంలో 12 కేసులు నమోదు చేశామని, మొత్తం 37 మంది నిందితులను గుర్తించామన్నారు. ఈ ముఠాలు ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు నుంచి పెద్దమొత్తంలో తెచ్చిన ఎండు గంజాయిని ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, బీబీనగర్ ప్రాంతాల్లో స్థావరాలు పెట్టుకుని, అక్కడ నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోల్లో కొద్దికొద్ది మొత్తాల్లో నగరంలోకి తెస్తున్నట్టు గుర్తించామన్నారు. ధూల్‌పేట్‌తోపాటు ఇతర ప్రాంతాలపైనా గంజాయి ముఠాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

వేగంగా కేసుల పరిష్కారమే లక్ష్యం

హైకోర్టు జడ్జి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్



యాదగిరిగుట్ట పట్టణంలో నూతన కోర్టు ప్రారంభంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ సుజన తదితరులు

యాదగిరిగుట్ట రూరల్: నూతన న్యాయస్థానాల ఏర్పాటుతో సకాలంలో కేసులు పరిష్కారం అవుతాయని హైకోర్టు జడ్జి, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఇ.వి.వేణుగోపాల్ అన్నారు. భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి, మొదటి శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును శనివారం హైకోర్టు జడ్జిలు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ సుజనతో కలిసి ప్రారంభించారు. వేగంగా కేసులు పరిష్కరించడం కోసం ఈ కోర్టును యాదగిరిగుట్టలో ప్రారంభించుకుంటున్నట్లు జస్టిస్ వేణుగోపాల్ తెలిపారు. జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ, యాదగిరిగుట్ట, రాజాపేట మండలాలకు సంబంధించిన కేసుల పరిష్కారానికి ఈ కోర్టు ప్రారంభించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి యాదగిరిగుట్టకు ఒక న్యాయమూర్తి నియామక ప్రక్రియ ఉంటుందన్నారు. అనంతరం జస్టిస్ సుజన మాట్లాడుతూ, కేసుల సులభతరం కోసం యాదగిరిగుట్టలో కోర్టు ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. నూతన కోర్టు ద్వారా కేసులు సత్వరం పరిష్కారమవుతాయని తెలిపారు. అంతకుముందు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం బార్ అసోసియేషన్ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ మధుసూదన్‌రావు, భువనగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, కలెక్టర్ హనుమంతు జెండగే, సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత, జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య బదిలీల్లో భారీ అవినీతిపై విజిలెన్స్ విచారణ

- వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి మంత్రి దామోదర ఆదేశం




సాక్షి, హైదరాబాద్: వైద్య బదిలీల్లో అవినీతికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆ వైద్యారోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించారు. 'వైద్య బదిలీలలో భారీ అవినీతి' జరిగిందని వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇలా అవినీతికి పాల్పడటం, అటువంటి ఆరోపణలు రావడం పట్ల శనివారం ఓ ప్రకటనలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీలలో అవకతవకలకు పాల్పడినట్లు విచారణలో తేలితే వారు ఏ స్థాయి వారైనా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. కాగా, యాదాద్రి భువనగిరిలో ఒక కీలకాధికారి తాను బదిలీ అయినప్పటికీ, పాత పోస్టులోనే ఉంటూ పనులు చక్కబెడుతున్నారని, కొందరికి డిప్యూటేషన్లు ఇవ్వడంపైనా వైద్యారోగ్యశాఖ దృష్టిసారించింది. ఆ అధికారి బదిలీ అయిన ఐదు రోజులకు కూడా కొందరికి డిప్యూటేషన్లు ఇచ్చినట్లు గుర్తించినట్లు సమాచారం. దీనిపైనా అధికారులు విచారణ చేపట్టారు.

నిత్య విద్యార్థి కాకపోతే ఉపన్యాసాలు ఇవ్వడం కష్టం

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

- సామాజిక చలనం-ప్రజాస్వామిక ప్రతిస్పందన పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, వేణుగోపాల్, హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): నిత్య విద్యార్థి కాకపోతే ఉపన్యాసాలు ఇవ్వడం కష్టమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇదే కోవలో ప్రొఫెసర్ హరగోపాల్ నిత్యం విద్యార్థిగా ఉంటూ.. ప్రజలను చైతన్యం చేసే అనేక రచనలు చేశారని, అలాగే వ్యాసాలు రాయడంతోపాటు ఉపన్యాసాలు ఇచ్చారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభినందించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ హరగోపాల్ రాసిన ఆరు పుస్తకాలను సమీక్షించిన ప్రముఖుల ప్రసంగ పాఠాలను వ్యాస రూపంలో తీసుకువచ్చిన సామాజిక చలనం-ప్రజాస్వామిక ప్రతిస్పందన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ హరగోపాల్ గొప్ప మానవతావాది అని అన్నారు. రాజ్యాంగం పట్ల హరగోపాల్‌కు ఎంతో మక్కువ ఉందన్నారు. వివిధ రకాల పోరాటాలు, సంఘటనల వల్ల ఏర్పడిందే రాజ్యాంగం అని అన్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, బలమైన ప్రతిపక్షం లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడలో ఉండదని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ రాజ్యాంగం గురించి గత 60 ఏళ్లుగా మాట్లాడుతూనే ఉన్నారన్నారు. మానవ హక్కులు, పౌర హక్కులకు భంగం కలిగితే మనం గొంతెత్తాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమానత్వం గురించి మాట్లాడితే ప్రస్తుత పరిస్థితుల్లో అర్బన్ నక్సలైట్లు అనే దుస్థితి దాపురించిందన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధి రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ వనమాల, ప్రొఫెసర్ జి.హరగోపాల్, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధి ఎం.రాఘవాచారి తదితరులు ప్రసంగించారు.

తెలంగాణ ఆణిముత్యం సినారె

రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి



డాక్టర్ యాకూబ్‌కు సినారె పురస్కారం ప్రదానం చేస్తున్న డాక్టర్ చిన్నారెడ్డి, గోరటి వెంకన్న, శివారెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి

సుల్తాన్‌బజార్ (హైదరాబాద్): అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న మహాకవి డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలంగాణ ఆణిముత్యమని రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మృతిని పదిలపరిచేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం సాయంత్రం తెలంగాణ సారస్వత పరిషత్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో కవి డాక్టర్ యాకూబ్‌కు సినారే 93వ జయంతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతను రూ.25 వేలు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ యాకూబ్ కవి సంగమం ద్వారా తెలుగు కవిత్వానికి ఒక తరాన్ని తయారు చేసి అందించడం గొప్ప విషయమని అభినందించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ప్రజా కవి గోరటి వెంకన్న, రచయిత్రి ముదిగంటి సుజాతరెడ్డి, మంత్రి రామారావు ప్రసంగించారు.

జెన్‌కోలో సమ్మెలపై నిషేధం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జెన్‌కోలో సమ్మెలపై నిషేధాన్ని మరో 6 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జూలై 27తో నిషేధం ముగియాల్సి ఉండగా.. మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా...

మీర్‌ఖాన్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ

- స్థల పరిశీలనకు సీఎం రాక నేడు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రతిష్టాత్మక స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ రంగారెడ్డి జిల్లాలో కొలువుదీరనుంది. యాభై ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ విశ్వవిద్యాలయాన్ని మీర్‌ఖాన్‌పేటలోని అమెజాన్ డేటా సెంటర్ సమీపంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిపాదిత స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించనున్నారు. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో దీన్ని స్థాపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యూనివర్సిటీ నిర్మాణానికి ఆగస్టు 1న సీఎం భూమి పూజ నిర్వహించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రతిపాదిత స్థలాన్ని కలెక్టర్ శశాంక శనివారం పరిశీలించారు.

31న టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ప్రిలిమినరీ కీ

- ప్రిలిమినరీ కీ పై అభ్యంతరాలకు ఆగస్టు 5 తుదిగడువు

సాక్షి, హైదరాబాద్: వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) ఉద్యోగాలకు నిర్వహించిన అర్హత పరీక్ష ప్రాథమిక కీతో పాటు అభ్యర్థి రెస్పాన్స్ షీట్‌ను ఈనెల 31న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రెస్పాన్స్ షీట్ ఆగస్టు 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రిలిమినరీ కీ పైన అభ్యంతరాలుంటే ఆగస్టు 1వ తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆన్‌లైన్ పద్ధతిలో సమర్పించాలని సూచించారు. వివరాలకు కమిషన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

కార్పొరేషన్ చైర్మన్‌కూ ఆసరా పింఛన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌కు చైర్మన్‌గా ఉన్న ఓ వ్యక్తికి, గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద పింఛన్ ఇచ్చినట్టుగా భూపాలపల్లి జిల్లాకు చెందిన అధికారులు తెలిపారు. ఈ మేరకు ఈ విషయాన్ని పంచాయతీ సెక్రటరీ కూడా ధ్రువీకరించారు. దీనికి సంబంధించి గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) కూడా వివరాలను అందజేసింది. గతంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న వాసు కేతిరెడ్డి అనే వ్యక్తికి ఆసరా కింద పెన్షన్ అందిందని తెలిసింది. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అయిదు వేల మందికి పైగా అనర్హులకు పెన్షన్లు ఇచ్చినట్టుగా చెబుతున్నారు. కార్పొరేషన్ చైర్మన్ కాకముందు నుంచి.. అంటే 2014 నుంచి వాసు కేతిరెడ్డి దివ్యాంగుల పెన్షన్ తీసుకున్నారు. అయితే చైర్మన్ అయ్యాక ఆ పెన్షన్ వదులుకోకుండా తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 2024 మే నెల దాకా కూడా ఆయన పింఛన్ తీసుకున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే...శనివారం అసెంబ్లీలో చేయూత పెన్షన్లపై పీఆర్ మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఈ పెన్షన్లపై హరీశ్‌రావు అవాస్తవాలు చెప్పి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం నెల చివరి తేదీన కూడా పింఛన్లు ఇచ్చేదని, అయితే తాము ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధిదారులకు పింఛన్లు చెల్లిస్తున్నామని చెప్పారు.

భార్యను చూసేందుకని.. బస్సునే ఎత్తుకెళ్లాడు!

మతిస్థిమితం లేని ఓ వ్యక్తి నిర్వాకం


పగిడ్యాల: పుట్టింటిలో ఉన్న తన భార్యను చూసేందుకు ఏకంగా ఓ బస్సునే అపహరించి..దానిని నడుపుకుంటూ వెళ్లిన ఘటన నంద్యాల జిల్లాలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన వడ్డె దర్గయ్య పాత ముచ్చుమర్రికి చెందిన సరోజను పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది పాప ఉంది. అయితే భార్య సరోజ ఏడాది క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉండిపోయింది. ఆమెను చూసేందుకు చార్జీకి డబ్బులు లేకపోవడంతో.. ఆత్మకూరు పట్టణ శివారులోని చక్రం హోటల్ వద్ద నిలిపిన ఏపీ 39యూకే 7439 నంబరు గల హైర్ బస్సును శనివారం తెల్లవారుజామున అపహరించి.. బస్సును నడుపుకుంటూ వెళ్తూ ముచ్చుమర్రిలో పోలీసులకు పట్టుబడ్డాడు.



వడ్డె దర్గయ్య

దర్గయ్యకు మతిస్థిమితం సరిగా లేదని, గతంలో లారీ డ్రైవర్‌గా పనిచేసినట్లు బంధువులు వెల్లడించారు. ముందస్తు సమాచారం అందుకున్న ముచ్చుమర్రి స్టేషన్ ఏఎస్ఐ కృష్ణుడు అప్రమత్తంగా ఉండి బస్సు ముచ్చుమర్రి గ్రామంలోకి రాగానే స్టేషన్ వద్ద నిలిపివేసి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు యజమాని మహేష్‌కు సమాచారం ఇచ్చారు. అయితే బస్సు అపహరణపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అక్కడికే పంపాలని కోరడంతో బస్సును, నిందితుడిని అక్కడికి పంపివేశారు.

టుడేస్ గ్రాఫిక్



తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ

న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. రాజవంశీకుడైన ఆయన రామజన్మభూమి ఉద్యమ సమయంలో 1990లలో బీజేపీలో చేరారు. 2018–23 వరకు త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కూడా. జిష్ణుదేవ్ వర్మ సతీమణి సుధా దేవ్‌వర్మ. వర్మను తెలంగాణ గవర్నర్‌గా నియమిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ శనివారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఓంప్రకాశ్ మాథుర్ సిక్కిం గవర్నర్‌గా, హరిభావు కిషన్‌రావు బాగ్డే రాజస్తాన్ గవర్నర్, సి.హెచ్.విజయశంకర్ మేఘాలయ గవర్నర్‌గా నియమితులయ్యారు. సంతోష్‌కుమార్ గంగ్వార్ జార్ఖండ్‌కు, రామెన్ డేకా చత్తీస్‌గఢ్‌కు గవర్నర్లుగా నియమితులయ్యారు. జార్ఖండ్ గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌ను మహారాష్ట్రకు మార్చారు. అలాగే అస్సాం గవర్నర్ గులాబ్‌చంద్ కటారియాను పంజాబ్‌కు మార్చి చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్‌గా కూడా బాధ్యతలు అప్పగించారు. లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను అస్సాం గవర్నర్‌గా నియమించి మణిపూర్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు. కె.కైలాసనాథన్‌ను పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించారు.

సాక్షి, అమరావతి

ప్రస్తుత స్మార్ట్ ఫోన్ల యుగంలో ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది. ఇక భారత్‌లో అయితే సోషల్ మీడియా మేనియా అన్ని దేశాలకన్నా ముందుంది. ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగంలో భారత్ మొదటిస్థానంలో ఉండగా.. రానున్న రోజుల్లో ఇది మరింత ఉధృతమవుతుందని ఫోర్బ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో సెల్ ఫోన్ వినియోగదారులు రోజుకు సగటున రెండున్నర గంటల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. ఇక పెద్ద పెద్ద వ్యాపార సంస్థల నుంచి చిన్న స్థాయి సంస్థల వరకూ ప్రకటనల ద్వారా తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి సోషల్ మీడియానే ఆశ్రయిస్తున్నారు.

ఇన్‌ఫ్లుయన్సర్స్ హవా..

ఈ సోషల్ మీడియా యుగంలో ఇన్‌ఫ్లుయన్సర్స్ హవా కొనసాగుతోంది. కనీసం 10లక్షల మంది ఫాలోయర్లు ఉండే ఇన్‌ఫ్లుయన్సర్స్‌కు డిమాండ్ భారీగా ఉంటోంది. వారికి భారీ పారితోషికాన్ని చెల్లించేందుకు పారిశ్రామిక సంస్థలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా ఉంటున్నాయి. యూ ట్యూబ్‌లో 10 లక్షల వ్యూస్ వచ్చే వీడియోకు రూ. 3 లక్షలు చొప్పున చెల్లిస్తున్నారు.



సోషల్ మీడియా.. మార్కెట్ మేనియా

ప్రపంచ వ్యాప్తంగా 500 కోట్ల మంది ఖాతాదారులు

భారత్‌లో 42 కోట్లకుపైగా వినియోగదారులు

- రోజుకు ఒక్కొక్కరు రెండున్నర గంటల పాటు కాలక్షేపం
- మొదటి రెండు స్థానాల్లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్
- ప్రకటనల మార్కెట్ విలువ రూ.10 వేల కోట్లు

ఫోర్బ్స్ నివేదిక వెల్లడి



విస్తృతమవుతున్న ప్రకటనల మార్కెట్

- 2024 మార్చి నాటికి సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనల మార్కెట్: రూ. 10 వేల కోట్లు.
- 2027 నాటికి సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనల మార్కెట్ (అంచనా): రూ. 14 వేల కోట్లు.
- ఏదో ఒక బ్రాండు, బ్రాండ్ అంబాసిడర్‌ను అనుసరిస్తున్న సోషల్ మీడియా ఖాతాదారులు: 90 శాతం
- ప్రకటనను చూసిన వెంటనే కొనుగోలు చేస్తున్న వారు: 11 శాతం
- ప్రకటనలు చూసి అవే ఉత్పత్తులను బయట స్టోర్స్‌లో కొనుగోలు చేస్తున్న వారు: 21 శాతం
- దేశంలో సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనలపై ఆధారపడుతున్న పెద్ద, మధ్య తరహా వ్యాపార సంస్థలు: 77 శాతం
- సోషల్ మీడియాలో చూసిన వాటిలో కనీసం ఏదో ఒక ఉత్పత్తిని కొనుగోలు చేస్తున్న ఖాతాదారులు: 76 శాతం
- ప్రకటన చూశాక ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నవారు: 44 శాతం

ఫోర్బ్స్ నివేదికలో ప్రధాన అంశాలు ఇవీ..

- ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 500 కోట్ల మంది సోషల్ మీడియా ఖాతాదారులు ఉన్నారు. 2027 నాటికి ఈ సంఖ్య 585 కోట్లకు చేరుతుందని అంచనా.
- సోషల్ మీడియా ఖాతాదారుల్లో అత్యధికంగా భారత్‌లో 42 కోట్ల మంది ఉన్నారు. దేశ జనాభాలో ఇది 40 శాతం సోషల్ మీడియా ఖాతాదారులు కావడం గమనార్హం. ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నవారిలో 67 శాతం మంది సగటున కనీసం ఒక సోషల్ మీడియా మాధ్యమాన్ని వాడుతున్నారు.
- భారత్‌లో రోజుకు సగటున 150 నిమిషాల పాటు అంటే రెండున్నర గంటల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తున్నారు. ఈ ప్రకారం 73 ఏళ్ల జీవించే పౌరుడు తన జీవిత కాలంలో 5.7 ఏళ్ల పాటు సోషల్ మీడియాలో కాలక్షేపం చేసినట్టు అవుతుందని ఫోర్బ్స్ సంస్థ అంచనా వేసింది.
- దేశంలోని ఖాతాదారుల్లో 78 శాతం మంది తమ మొబైల్ ఫోన్ ద్వారానే సోషల్ మీడియాను వీక్షిస్తున్నారు.
- భారత్‌లో సోషల్ మీడియా వేదికల్లో మొదటి స్థానంలో ఫేస్‌బుక్, రెండో స్థానంలో ఇన్‌స్టాగ్రామ్ ఉన్నాయి. 18 ఏళ్ల దాటిన సోషల్ మీడియా ఖాతాదారుల్లో 74 శాతం మంది ఫేస్‌బుక్, 71 శాతం మంది ఇన్‌స్టాగ్రామ్ మాధ్యమాన్ని అనుసరిస్తున్నారు. కాగా 49 శాతం మంది ఎక్స్‌ను ఫాలో అవుతున్నారు. ఫేస్‌బుక్ మరికొన్నేళ్లపాటు తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందని అంచనా వేశారు.



10వ తరగతి విద్యార్థినులకు ఆంగ్లం బోధిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

వీక్లీ వస్తారు సారు..తహసీల్దారు మాస్టారు!

ఇంగ్లిష్ టీచర్ లేకపోవడంతో తానే స్వయంగా ఆంగ్లం బోధిస్తున్న తహసీల్దారు

చందంపేట: తహసీల్దార్ ఉద్యోగం అంటేనే ఊపిరిసలపనివ్వని విధి నిర్వహణతో ముడిపడి ఉంటుంది. అలాంటిది.. ఆ హోదాలో విధులు నిర్వహిస్తూనే.. పిల్లలకు ఆంగ్ల పాఠాలు బోధిస్తున్నారొక అధికారి. ఆయనే నల్లగొండ జిల్లా చందంపేట తహసీల్దార్ శ్రీనివాస్. ఆయన ఇటీవల మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించినప్పుడు విద్యార్థులతో ముచ్చటించారు. తమకు ఆంగ్ల ఉపాధ్యాయుడు లేక పాఠాలు చెప్పేవారే లేరని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ శ్రీనివాస్ అప్పటికప్పుడే.. విద్యార్థినులకు కొద్దిసేపు ఆంగ్ల పాఠాలు బోధించారు. వారంలో ఒకరోజు సమయం కేటాయించి విద్యార్థులకు బోధిస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేసిన శ్రీనివాస్.. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏవోగా ఉద్యోగం చేస్తూ పదోన్నతిపై చందంపేట తహసీల్దార్‌గా వచ్చారు. ఒకప్పటి ఉపాధ్యాయ వృత్తి మిగిల్చిన అనుభవంతో.. చందంపేట కస్తూర్బా పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఆంగ్ల పాఠాలు బోధిస్తున్నారు. శనివారం 10వ తరగతి విద్యార్థులకు పాఠాలు చెబుతూ కనిపించారు.

31న ఎడ్‌సెట్, పీఈసెట్ అడ్మిషన్ నోటిఫికేషన్



సాక్షి, హైదరాబాద్: టీజీ ఎడ్‌సెట్, టీజీ పీఈసెట్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశాల నోటిఫికేషన్ ఈనెల 31న విడుదల కానుంది. శనివారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి అధ్యక్షతన జరిగిన టీజీ ఎడ్‌సెట్, టీజీ పీఈసెట్ అడ్మిషన్ కమిటీ సమావేశంలో అడ్మిషన్లకు సంబంధించి కౌన్సెలింగ్‌పై అధికారులు చర్చించారు.. వేర్వేరుగా కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. టీజీ ఎడ్‌సెట్, టీజీ పీఈసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌లను 31న విడుదల చేయాలని నిర్ణయించారు. పూర్తిస్థాయి షెడ్యూల్, ఇతర సమాచారాన్ని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచారు.

విషయం	టీజీఎడ్‌సెట్-2024	టీజీపీఈసెట్-2024
నోటిఫికేషన్	31.07.2024	31.07.2024
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, పేమెంట్	08.08.2024 నుంచి 20.08.2024 వరకు	07.08.2024 నుంచి 14.08.2024 వరకు
స్పెషల్ కేటగిరీ ఫిజికల్ వెరిఫికేషన్	12.08.2024 నుంచి 16.08.2024 వరకు	13.08.2024 నుంచి 14.08.2024 వరకు
అర్హుల జాబితా ప్రకటన	21.08.2024	14.08.2024
ఫేజ్-1 వెబ్ ఆప్షన్ల నమోదు	22.08.2024 నుంచి 23.08.2024 వరకు	16.08.2024 నుంచి 17.08.2024 వరకు
వెబ్ ఆప్షన్లలో సవరణలు	24.08.2024	18.08.2024
కాలేజీల వారీగా ప్రొవిజినల్ సెలెక్టెడ్ లిస్ట్ జారీ	30.08.2024	20.08.2024
కాలేజీలో రిపోర్టింగ్, ట్యూషన్ ఫీజు చలానా	31.08.2024 నుంచి 04.08.2024 వరకు	21.08.2024 నుంచి 24.08.2024 వరకు
తరగతులు ప్రారంభం	31.08.2024	27.08.2024



ఎయిర్‌పోర్టు సమీపంలో అతిపెద్ద ఈవీ చార్జింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్



భవిష్యత్ ఎలక్ట్రిక్ వాహనాలదే

దేశంలోనే అతి పెద్ద పబ్లిక్ ఈవీ చార్జింగ్ కేంద్రం ప్రారంభించిన జయేశ్‌రంజన్

శంషాబాద్: చార్జింగ్ కేంద్రాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో భవిష్యత్‌లో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపే ఎక్కువగా మొగ్గు చూపుతారని ఐటీ,పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ అన్నారు. పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్వీడన్‌కు చెందిన గ్లీడా సంస్థ శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో శ్రీశైలం హైవేలో ఒకేసారి 102 వాహనాలు చార్జింగ్ చేసుకునేలా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ గ్లీడా వంటి సంస్థ దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఈవీ చార్జింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ 2018 కేవలం ఒక చార్జింగ్ పాయింట్‌తో ప్రయాణం ప్రారంభించి ప్రస్తుతం నగరంలో మొత్తం 89 కేంద్రాలను విస్తృత పర్చిందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవదేశ్ అన్నారు.



ఇల.. ఓ కన్నీటి అల..

తుపాను అలలు తన టీ షాపును ధ్వంసం చేస్తే.. ఏం చేయాలో తెలియక.. దాని ముందు నిస్సహాయంగా నిల్చున్న ఈ బాలిక చిత్రం మాంగ్రోవ్(మడ అడవులు) ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్–2024 పోటీలో ఓవరాల్ విన్నర్‌గా ఎంపికైంది. మాంగ్రోవ్ యాక్షన్ ప్రాజెక్టు ఈ అవార్డును ప్రకటించింది. 'ప్రపంచంలోనే అతి పెద్ద మడ అడవులుగా పేరొందిన సుందర్‌బన్స్ మానవ అభివృద్ధి కార్యకలాపాల వల్ల నానాటికీ క్షీణిస్తున్నాయి. దీని వల్ల సముద్ర తీరం కోతకు గురవుతోంది. మడ అడవుల క్షీణత వల్ల సుందర్‌బన్స్ ప్రాంతం తరచూ తుపాను బారిన పడుతోంది. ఈ అమ్మాయి దయనీయమైన పరిస్థితి.. ఈమె ఒక్కరిదే కాదు. తీరానికి దగ్గరగా నివసించే లక్షలాది మంది ప్రజలది కూడా. వాతావరణ మార్పులు, సముద్ర మట్టాల పెరుగుదల వల్ల చాలామంది శరణార్థులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది' అని అవార్డు జ్యూరీ పేర్కొంది. ఈ చిత్రాన్ని 'సింకింగ్ సుందర్‌బన్స్' పేరిట సుప్రతీం భట్టాచార్జీ అనే ఫొటోగ్రాఫర్ తీశారు.

సాక్షి సెంట్రల్ డెస్క్

25 మంది విద్యార్థులకు అంటకత్తెర!

- ఖమ్మం జిల్లా పేరువంచ జెడ్పీహెచ్‌ఎస్‌లో టీచర్ నిర్వాకం
- ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు



కల్లూరురూరల్: విద్యార్థుల జుట్టు పెరిగిందని.. పాఠం చెబుతుండగా తరచు ఎగురవేస్తూ..సవరించుకుంటున్నారని ఓ ఉపాధ్యాయురాలు ఇష్టానుసారం జుట్టు కత్తిరించేసింది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పాఠశాల ఇంగ్లిష్ టీచర్ దిగుమర్తి శిరీష పలువురు విద్యార్థులకు జుట్టు పెరిగిందని...కటింగ్ చేయించుకోవాలని శుక్రవారం సూచించింది. అయితే, ఆదివారం కటింగ్ చేయించుకోవచ్చనే భావనతో విద్యార్థులు శనివారం అలాగే పాఠశాలకు వచ్చారు. దీంతో ఆగ్రహించిన టీచర్ 6, 7, 8, 9, 10వ తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులను దశల వారీగా స్కూల్ ఆవరణలోకి తీసుకొచ్చి కత్తెరతో ఇష్టమున్నట్టు కత్తిరించింది.



దిగుమర్తి శిరీష

తల్లిదండ్రుల ఆందోళన

ఈ ఘటనతో ఆవేదన చెందిన విద్యార్థులు ఇళ్లకు వెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో వారు పాఠశాలకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కొందరు విద్యార్థులు పెరిగిన జుట్టుతో వెనక్కి ఊపుకుంటూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని అందుకే తాను కత్తెరతో జుట్టును అక్కడక్కడ కత్తిరించిన విషయం వాస్తవమేనని ఉపాధ్యాయురాలు శిరీష చెప్పారు. ఈ ఘటనపై వివరాలు సేకరించిన అనంతరం ఉపాధ్యాయురాలు శిరీషను సస్పెండ్ చేస్తూ డీఈఓ సోమశేఖరశర్మ సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

జుట్టుతో 54 ఏళ్లుగా జట్టు!

భూదాన్‌పోచంపల్లి: ఆ వ్యక్తి ఎత్తు 5.2 అడుగులు.. జుట్టు పొడవు 13 అడుగులకు పైనే. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన గుండోజు లక్ష్మణాచారి పొడవైన జుట్టుతో ఆకర్షిస్తున్నారు. వీరభద్రస్వామి భక్తుడైన ఈయన వయసు 72 ఏళ్లు. తన 18 ఏట వీరభద్రస్వామి కలలో కనిపించడంతో.. జుట్టు కత్తిరించకుండా దేవుడికి అర్పించినట్టు లక్ష్మణాచారితెలిపారు. జుట్టు పెరగడానికి ప్రత్యేక చర్యలేవీ తీసుకోనని.. నెలలో రెండు, మూడు సార్లు షాంపూతో తలస్నానం చేసి, కొబ్బరి నూనె రాస్తానని వివరించారు.







ఎడ్లబండి కట్టి.. వాగు దాటించి

పురిటి నొప్పులతో గర్భిణికి అవస్థలు

జన్నారం: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జన్నారం మండల కేంద్రం నుంచి లోతొర్రె గ్రామానికి వెళ్లే దారిలో వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గర్భిణి ఆత్రం గంగాదేవికి శనివారం తెల్లవారు జామున పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. అయితే లోతొర్రె వెళ్లే దారిలో వాగు ఉండటం, రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో అంబులెన్స్ గ్రామానికి రాలేకపోయింది. సుమారు 7 కిలోమీటర్ల దూరంలో కవ్వాల్ గ్రామం వద్దే అది ఆగిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు గంగాదేవిని ఎడ్లబండిలో కవ్వాల్ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే నాలుగు గంటల సమయం పట్టింది. అక్కడినుంచి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. జన్నారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది లేక కాన్పు చేసే అవకాశం లేకపోవడంతో అక్కడి నుంచి జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అంబులెన్స్ బీర్‌పూర్ వరకు వెళ్లిన తర్వాత మొరాయించింది. దీంతో అక్కడి నుంచి మరో అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి గంగాదేవిని తరలించారు. వెంటనే ఆమెకు సిజేరియన్ చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.